www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
18-10-2024

సంపుటి : 01 | సంచిక : 166 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## మిస్ ఇండియా మధ్యప్రదేశ్ భామ

కిరీటాన్ని గెలుచుకున్న నిఖిత పోర్వాల్

అట్టహాసంగా జరిగిన వేడుకలు

2



# సుందరీకరణ కాదు..
# మూసీ నది పునరుజ్జీవం

ప్రతీదీ రాజకీయం చేస్తే దశాబ్దాల దురవస్థ మారదు.. మూడునెలలు వారు మూసీ ఒడ్డున ఉండగలిగితే.. ప్రాజెక్ట్ ఆపేస్తాం.మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవ కార్యక్రమం.. కాలుష్యం నుంచి విముక్తికోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఆహ్వానించాల్సింది పోయి తప్పుడు ప్రచారం చేయడం దారుణమంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై మండిపడ్డారు. మూసీ నిర్వాసితుల స్థితిగతులు, వారి కుటుంబాలపై పూర్తిస్థాయి అధ్యయనం తర్వాతే పునరావాసం కల్పించామన్నారు.

### ఎవరినీ నిర్దయగా ఖాళీ చేయించడం లేదు

మూసీ అభివృద్ధి పనుల కోసం ఒక కన్సల్టెన్సీ

కొందరి మెదళ్లలో మూసీకంటే మురికి ఎక్కువగా ఉంది

కేటీఆర్ , హరీశ్‌రావు, ఈటల మూసీ తీరంలో మూడు నెలలు ఉండగలరా?

మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**

రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కార్ చేపట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ నది అభివృద్ధి, సుందరీకరణ వివరాలను సెక్రటేరియట్ లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయ న వెల్లడించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని, మూసీ నది పునరుజ్జీవనమని ఆయన తెలిపారు. 33 టీమ్‌లు మూసీ పరీవాహకంపై అధ్యయనం చేశాయన్నారు. నదీ పరీవాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారన్న సీఎం, వారికి మెరుగైన జీవితం అందించాలని తాము భావిస్తున్నట్లు తెలిపారు. మూసీ అభివృద్ధి పనుల కోసం ఒక కన్సల్టెన్సీని నియమించనున్నట్లు చెప్పారు.కొందరి మెదళ్లలో మూసీలో ఉన్న మురికి కంటే ఎక్కువ విషం ఉందని, అందుకే ఈ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై ధ్వజమెత్తారు.


మిగతా2లో...

## సుప్రీంకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

కేంద్రానికి సుప్రీం చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రతిపాదన

ప్రస్తుత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి పదవీకాలం వచ్చే నెల 11న పూర్తి

కొత్త సీజేఐ పదవిలో కొనసాగేది ఆరు నెలలు



2

## గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు..

హెచ్‌ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

అధికారులకు సీఎస్ ఆదేశం



2

## షేక్ హసీనాపై అరెస్టు వారెంట్

- నవంబర్ 18లోగా అరెస్టు చేయండి
- ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆదేశం
- భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా



2

## వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు

మరో ఉద్యమానికి మాదిగ ఉపకులాలు సిద్ధంగా ఉండాలి: మందకృష్ణ మాదిగ

**విశ్వంభర, హైదరాబాద్:** మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీ కరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు.

మిగతా2లో...





## 'మోదీ వస్తే బాగుండేది'

- ఎస్‌సీవో సదస్సుకు జైశంకర్ రావడం సానుకూల పరిణామం
- ఆయన పాక్‌లో పర్యటించడం తొలి అడుగు
- పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్

**లాహోర్:** పాకిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పాల్గొనడంపై పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్పందించారు. ఇది సానుకూల పరిణామమన్నారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ వస్తే మరింత

మిగతా2లో...

## బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గొంతుక

- ఇది కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు
- మరో 75 ఏళ్ల పాటు సిరంగా ఉంటుంది
- స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటుంది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 120 | రిటైల్ ₹ 142 |
| స్కిన్ ₹ 206 | స్కిన్ లెస్ ₹ 234 |

## గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?

పత్తి మద్దతు ధరపై ఎందుకీ తేడా?.. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు.

మిగతా2లో...

### ఏపీ సీఎస్‌కు రిపోర్ట్ చేసిన నలుగురు ఐఏఎస్‌లు



2

### యాదగిరిగుట్ట లడ్డూకు వాడే నెయ్యి స్వచ్ఛమైనది

ఈవో భాస్కర్‌రావు వెల్లడి

2

## నేతలకు ప్రధాని దిశానిర్దేశం



ఎన్డీయే కూటమి అగ్రనేతలతో మోదీ భేటీ

- త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహాలపై చర్చ
- కేంద్రంలో మూడోసారి అధికారంలోకొచ్చాక ఇదే తొలి సమావేశం

**ఢిల్లీ:** వందరోజుల పాలనలో సాధించిన విజయాలు.. వచ్చే నాలుగున్నరేళ్లలో చేరుకోవాల్సిన లక్ష్యాలపై గురువారం సుదీర్ఘంగా చర్చించారు ఎన్డీఏ నేతలు. 2047 అమృత్‌కాల్ విజన్‌తో పాటు జాతీయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో నేతలకు ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. సంవిధాన్ కా అమృత్ మహోత్సవ్ అలాగే ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాజ్యాంగ హత్యా దినంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. హర్యానాలో హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో త్వరలో జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించారు. హర్యానా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఎన్డీఏ పార్టీల నేతలు.. కార్యక్రమం అనంతరం చండీగఢ్‌లో జరిగిన కూటమి భేటీలో పాల్గొన్నారు. కేంద్రంలో ఎన్డీఏ సర్కారు మూడోసారి కొలువు

మిగతా2లో...

## పంచాంగం

**18-10-2024, శుక్రవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
తిథి: విదియ ఉ.09.51వరకు తర్వాత తదియ (పూర్తి)
నక్షత్రం: భరణి ఉ.10.48వరకు
సూర్యోదయం: ఉ.6.13
సూర్యాస్తమయం: సా.5.48
వర్జ్యం: రా.09.39 నుంచి రా.11.06వరకు
దుర్ముహూర్తం: ఉ.07.46 నుంచి ఉ.08.32వరకు
రాహుకాలం: ఉ.09.07 నుంచి ఉ.10.34వరకు
అమృత ఘడియలు: ఉ.06.30 నుంచి ఉ.07.56 వరకు

## మిస్ ఇండియా మధ్యప్రదేశ్ భామ



**ముంబయి:** అందాల పోటీలలో మధ్యప్రదేశ్ యువతి నిఖిత పోర్వాల్ సత్తా చాటింది. ప్రతిష్టాత్మక 60వ ఎడిషన్ ఫెమినా మిస్ ఇండియా ఫైనల్ పోటీలు ముంబయిలో బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఇక ఈ పోటీల్లో 2024కు గాను ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన నిఖిత పోర్వాల్ దక్కించుకుంది.గతేడాది మిస్ ఇండియా టైటిల్ గెలిచిన రాజస్థాన్‌కు చెందిన నందినీ గుప్తా కిరిటాన్ని నిఖిత పోర్వల్‌కు అందించింది. మరోవైపు ఈ పోటీల్లో నిఖిత పోర్వాల్‌కి గట్టిపోటీనిచ్చిన రేఖా పాండే మొదటి రన్నరప్‌గా నిలువగా.. ఆయుశీ దోలకియా రెండవ రన్నరప్‌గా నిలిచింది. ఇక మిస్ ఇండియా కిరిటం దక్కించుకున్న నిఖితా మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. బుధవారం రాత్రి అట్ట హాసంగా జరిగిన ఈ వేడుకలకు సినీ తారలతో పాటు పలు రంగానికి చెందిన ప్రముఖులు తరలి వచ్చారు. స్టేజీపై ఆట, పాటలతో హోరెత్తించారు.

## ‘మోదీ వస్తే బాగుండేది’

(మొదటి పేజీ తరువాయి)
సంతోషించేవాడినన్నారు. భారత్‌కు చెందిన ఓ జాతీయ వార్తా ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన ఇరుదేశాలు గతాన్ని పక్కన పెట్టి.., ఇంధనం, వాతావరణ మార్పుల వంటి భవిష్యత్తు సవాళ్లను పరిష్కరించుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్‌సీవో సదస్సు కోసం పాకిస్థాన్ వెళ్లిన భారత జర్నలిస్టులతో నవాజ్ షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లాహోర్‌లోని ఆయన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాకిస్థాన్‌లో పర్యటించడం తొలి అడుగుగా అభివర్ణించారు. ఇదిలాఉంటే, భారత జర్నలిస్టులతో షరీఫ్ ప్రత్యేకంగా సమావేశం కావడంపై కొన్ని పాక్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి. తమ జర్నలిస్టులకూ అలాంటి అదృష్టం వస్తే బాగుండేదని పేర్కొనడం గమనార్హం.

## వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు

(మొదటి పేజీ తరువాయి)
‘‘ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది’’ అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

## గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?

(మొదటి పేజీ తరువాయి)
ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ‘‘ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్’’ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?’’ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ఏపీ సీఎస్‌కు రిపోర్ట్ చేసిన నలుగురు ఐఏఎస్‌లు

**విశ్వంభర, విజయవాడ:** డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఏపీలో రిపోర్టు చేశారు. తెలంగాణ హైకోర్టు డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఆమ్రపాలి కాట , రోనాల్డ్ రోస్ , వాణీ ప్రసాద్, వాకాటి కరుణ, ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్.. ముగ్గురి మృతి

### వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**విశ్వంభర, పూడూరు:** వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై పూడూరు గేటు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. మృతులను పూడూరు మండలం మేడికొండకు చెందిన వారిగా గుర్తించారు. బస్సు సేడం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## 23న తెలంగాణ కేబినెట్ భేటీ

### కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 23న భేటీ కానుంది. సచివాలయంలో 23న సాయంత్రం 4గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరగనుంది. మూసీప్రాజెక్టు, ధరణి, హెల్త్, రేషన్ కార్డులు తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశముంది.

# సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)
**మంచి జీవితం ఇవ్వాలన్నదే మా ఆలోచన:** మూసీ పరీవాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలన్నదే సర్కార్ ఆలోచనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మల్లన్న సాగర్, వేమలఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలన్న ముఖ్యమంత్రి, రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి తాము ఖాళీ చేయించటం లేదని అన్నారు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా తాను వస్తానన్న సీఎం, నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారిందని వ్యాఖ్యానించారు. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయన్నారు. తాము ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించటంలేదని, నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చినట్లు తెలిపారు. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది తప్ప పరీవాహకంలో ఎవరి ఇళ్లను కూల్చలేదన్నారు. చినుకు పడితే చాలు హైదరాబాద్ నగరంలో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోందన్న సీఎం, రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా? అని ప్రశ్నించారు.

**ఆ ముగ్గురూ మూసీ ఒడ్డున ఉంటారా? :** మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అనలేదా అని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి , అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు పాటు మూసీ ఒడ్డున జీవించి చూపాలని సవాలు విసిరారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా ఈటల రాజేందర్ 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలని, వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తామని విమర్శించారు. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే, ఈ ప్రాజెక్టును ఆపేస్తామన్నారు. మూసీ పరీవాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలని సీఎం అన్నారు. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి లేదా మూసీ పునరుజ్జీవం కోసం వారి (విపక్షాలు) వద్ద ఉన్న ప్రణాళిక చెప్పాలని కోరారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలన్న సీఎం, విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు.



# గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

# నేతలకు ప్రధాని దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)
దీరిన తర్వాత కూటమి నేతలు భేటీ కావడం ఇదే మొదటిసారి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలొచ్చాక ఢిల్లీలో ఒకసారి సమావేశమైనా.. అది లాంఛనప్రాయమే. సమావేశంలో ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు, బీజేపీ అగ్రనేతలు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. నేతల మధ్య చర్చ జరిగింది.హర్యానా ఇచ్చిన ఊపును కొనసాగించాలన్న వ్యూహాన్ని కూడా అక్కడి నుంచే అమలు చేయాలన్నది ఎన్డీఏ ప్రణాళిక. అందుకే.. ప్రమాణస్వీకారం తర్వాత పంచకులలో ఎన్డీఏ కీలక సమావేశం జరిగింది. ఎన్డీఏలోని మొత్తం 31 పార్టీల నేతలు సమావేశానికి హాజరయ్యారు.మహారాష్ట్ర ఎన్నికల రూపంలో మోదీ 3.0కు అతిపెద్ద సవాల్ ఎదురయింది. మహారాష్ట్ర ఒకప్పుడు రెండు శిబిరాలకు మాత్రమే రాజకీయ రణక్షేత్రం పరిమితమయ్యేది. ఓవైపు బీజేపీ-శివసేన.. మరోవైపు కాంగ్రెస్-ఎన్సీపీలు తలపడేవి. అయితే 2019 ఎన్నికల తర్వాత సీన్ మారింది. సీఎం పదవి కోసం బీజేపీకి హ్యాండిచ్చి.. కాంగ్రెస్ కూటమిలో చేరింది శివసేన. ఆ విధంగా ఏర్పడిందే మహా వికాస్ అఘాడీ. తర్వాత ఏక్‌నాథ్ షిండే రూపంలో శివసేనలో పుట్టిన ముసలం.. బీజేపీకి ఊతమిచ్చింది. తర్వాత ఎన్సీపీలో కూడా చీలికలొచ్చి మహా పాలిటిక్స్‌ని మరింత రసవత్తరంగా మార్చేశాయి. కూటమి వర్సస్ కూటమిగా మారిన మహారాష్ట్రలో పాగా వేయడం ఎన్డీఏ ముందున్న అతిపెద్ద సవాలు. మహారాష్ట్రలో తగ్గిన ఉపాధి అవకాశాలు, గ్రామీణ రైతాంగంలో పెరిగిన అసంతృప్తి, పార్టీల్లో చీలికల తర్వాత ఉద్ధవ్-శరద్ పవార్‌లపై ఏర్పడ్డ సానుభూతి..ఇవన్నీ ఎన్డీఏ కూటమికి ఇబ్బందిగా మారాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లే దక్కినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్ని తేలిగ్గా తీసుకోవద్దని భావిస్తోంది ఎన్డీఏ కూటమి. మహారాష్ట్రతో పాటే ఎన్నికలు జరుగుతున్న జార్ఖండ్‌లో పోయిన అధికారాన్ని తిరిగి తెచ్చుకోవడం కూడా బీజేపీకి ఛాలెంజ్‌గా మారింది. 2014 ఎన్నికల్లో 37 సీట్లను గెల్చుకున్న బీజేపీ.. 2019 ఎన్నికల్లో మాత్రం ఓటమిపాలయింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-జేఎంఎం ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి పంచ్ ప్రాణ్ పేరుతో వాగ్దానాలు చేసింది బీజేపీ. మరి పంచకుల వేదికగా జరిగిన ఎన్డీఏ నేతల భేటీ ఎంతవరకూ సక్సెస్ అయిందో తెలియాలంటే.. రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ ఆగాల్సిందే.

# యాదగరిగుట్ట లడ్డూకు వాడే నెయ్యి స్వచ్ఛమైనది

**విశ్వంభర, యాదగిరి గుట్ట:** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ-లక్ష్మీ నరసింహా స్వామి లడ్డూ తయారీకి వినియోగిస్తున్న నెయ్యి స్వచ్ఛమైనదేనని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. లడ్డూ తయారీకి వాడుతున్నమదర్ డెయిరీ నెయ్యి నమూనాలను ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించామని ఆయన వివరించారు. అక్కడి ప్రయోగశాలలో పరీక్షలు జరిపి నెయ్యి స్వచ్ఛమైనదిగా నిర్ధారించారని వెల్లడించారు. భక్తులు ఎవరూ ఇక నుంచి లడ్డూ ప్రసాదాలను తీసుకోవడానికి సంకోచించవలసిన అవసరం లేదని, శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి లడ్డూ ప్రసాదం పవిత్రమైందని తెలిపారు.



**కిలో నెయ్యి రూ.609**
కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూ ప్రసాదం తయారు చేశారన్న వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నెయ్యి నమూనాలను పరీక్షకు పంపిందని కార్యనిర్వహణధికారి భాస్కర్ రావు తెలిపారు. ఆ నివేదిక సైతం దేవస్థానానికి అందిందని అన్నారు. కిలో రూ.609కు కొనుగోలు చేస్తున్న నెయ్యి నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉన్నట్లు వెల్లడించారు. ప్రసాదాల తయారీకి రోజుకు 1000 కిలోల నెయ్యిని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిలో సుమారు రూ.15 కోట్ల నెయ్యిని మదర్ డెయిరీ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రక్రియ అంతా టెండర్ విధానంలో గత 40 ఏళ్లుగా కొనసాగుతోందని ఈవో భాస్కర్‌రావు వివరించారు.

**లడ్డూ తయారీకి విజయ డెయిరీ నెయ్యి**
శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూ తయారీకి విజయ డెయిరీ నెయ్యి వాడాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాల మేరకు ఇక ముందు దేవుడి లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యిని విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తామని ఈవో చెప్పారు. అయితే ప్రస్తుతం పాత టెండర్ కొనసాగుతున్నందున వచ్చే మార్చి నెలాఖరు వరకు మదర్ డెయిరీ నెయ్యినే వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు.

# నేడు మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

### సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వివరణ

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంపై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మూసీపై శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని తెలిపారు. మూసీపై బీఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులు, మూసీ పునరుజ్జీవనం కోసం చేసిన ప్రయత్నాలు, ప్రణాళికలు వివరిస్తామన్నారు.గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విపక్ష నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని స్పష్టం చేశారు. కొందరు మెదళ్లలో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారని, మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ‘‘మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి’’ అని సీఎం సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ స్పందించారు.

### రేవంత్ లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులకు ఇబ్బందులు

**బీఆర్ ఎస్ విద్యార్థి విభాగం ప్రతినిధులతో కేటీఆర్**

**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పరీక్షలు రాస్తామో, రాయలేమోనన్న బాధలో వారున్నారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ ఎస్ విద్యార్థి విభాగం ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ ప్రభుత్వ విధానాలతో రైతులు, యువకులతో పాటు అందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నవంబర్ 5న ధర్నా చేస్తున్నామని ఆటో డ్రైవరు చెప్పారన్నారు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తున్నారని కొంతమంది వచ్చి ఫిర్యాదు చేశారని కేటీఆర్ తెలిపారు.

## షేక్ హసీనాపై అరెస్టు వారెంట్

**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు.ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది.

## సుప్రీంకోర్టు తదుపరి సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

**ఢిల్లీ:** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి సీజేగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యే అవకాశం ఉంది. ఈమేరకు తన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ ఖన్నా నియమితులు కానున్నారు. నిబంధనల ప్రకారం.. ఈ ప్రతిపాదనను ప్రస్తుత సీజేఐ లేఖ రూపంలో కేంద్ర న్యాయశాఖకు పంపుతారు. ఆ లేఖను కేంద్ర న్యాయశాఖ.. ప్రధానమంత్రి పరిశీలన కోసం పంపనుంది. ఆయన ఆమోదం తర్వాత రాష్ట్రపతికి చేరుకుంటుంది. అంతిమంగా రాష్ట్రపతి అనుమతితో తదుపరి ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపడతారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు సుప్రీంకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం ఈ ఏడాది నవంబరు 11తో ముగియనుంది. ఆ మరుసటిరోజున అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు.

## బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గొంతుక

(మొదటి పేజీ తరువాయి)


అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# మేం చెప్పిందే నిజమైంది

- ఆ హత్య కేసులో ఆధారాలు లేవు
- ఎప్పటినుంచో ఇదే చెబుతున్నాం
- కెనడా ప్రధానికి భారత్ స్ట్రాంగ్ కౌంటర్



**ఢిల్లీ:** ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో తమ వద్ద పక్కా ఆధారాలేవీ లేవంటూ కెనడా ప్రధాని ట్రూడో చేసిన వ్యాఖ్యలకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. తాము ఎప్పటినుంచో ఇదే చెబుతున్నామంటూ భారత విదేశాంగ శాఖ స్పందించింది. ప్రధాని ట్రూడో తీరుపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనను విడుదల చేశారు. 'నిజ్జర్ హత్య కేసు గురించి మేం ఎప్పటి నుంచో చెబుతున్న విషయమే ఇప్పుడు రుజువైంది. మన దౌత్యవేత్తలపై చేస్తున్న ఆరోపణలకు మద్దతిచ్చేలా కెనడా ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలను చూపించలేదు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు ఇంత తీవ్రస్థాయిలో దిగజారడానికి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోనే పూర్తి బాధ్యుడు' అని జైశ్వాల్ అన్నారు.

**'నిఘా సమాచారం మాత్రమే ఉంది'**

నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందని ఆరోపణలు చేసినప్పుడు తనవద్ద నిఘా సమాచారమే తప్ప పక్కా ఆధారాలేవీ లేవని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అంగీకరించారు. కెనడా ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థల్లో విదేశాల జోక్యంపై విచారణ నిర్వహిస్తున్న కమిటీ ముందు ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఇదే విషయాన్ని జీ20 సదస్సు ముగింపు సమయంలో భారత ప్రధాని మోదీ దృష్టికీ తీసుకెళ్లినట్లు ట్రూడో పేర్కొన్నారు. అయితే, కెనడాలో భారత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక మంది మాట్లాడుతున్నారని, వారిని అరెస్ట్ చేయాలని ప్రధాని మోదీ తనతో చెప్పారన్నారు. కానీ, తమను విమర్శించే ధోరణి భారత్ అవలంబిస్తోందన్న విషయం జీ20 నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాతే అర్థమైందని ట్రూడో అన్నారు.

**'నేరగాళ్ల ముఠాలకు కెనడియన్ల సమాచారం'**

అయితే, ఈ సందర్భంగా భారత్‌పై కెనడా ప్రధాని ట్రూడో మరోసారి అభ్యంతరకర ఆరోపణలు చేశారు. భారత ప్రధాని మోదీ నేతృత్వంలోని సర్కారుతో విభేదించే కెనడా వారి వివరాలను ఇక్కడి భారత దౌత్యవేత్తలు సేకరించి, ఉన్నతస్థాయిలోని వారికి, లారెన్స్ బిష్ణోయ్ వంటి నేరగాళ్ల ముఠాలకు చేరవేస్తున్నారని ఆరోపించారు.






## రూ.1200 కోట్ల కుంభకోణం

# దర్యాప్తులో కుట్ర

- మహిళా ఐపీఎస్‌పై సీబీఐ ఫోర్జరీ కేసు
- దర్యాప్తులో అవకతవకలకు పాల్పడిన అధికారి
- ప్రధాన నిందితుడిపై కొనసాగుతున్న విచారణ

**ముంబయి:** మహారాష్ట్రలోని ఓ మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. రూ. 1200 కోట్ల కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు వ్యవహారంలో ఆమె ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ తాజాగా వెల్లడించింది. జల్‌గావ్ జిల్లాలోని భైచంద్ హీరాచంద్ రైసోనీ క్రెడిట్ సొసైటీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో అనేకమందిని మోసం చేసింది. రూ. 1200 కోట్లకు పైగా కుంభకోణానికి పాల్పడింది. ఈ కుంభకోణం 2015లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు 2020లో సీబీఐకి బదిలీ అయింది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులను దర్యాప్తు చేసిన సిట్‌కు ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టకే నేతృత్వం వహించారు. ఈ క్రమంలోనే ఆమె దర్యాప్తులో ఎన్నో అవకతవకలకు పాల్పడినట్లు సీబీఐ పేర్కొంది. ఒకే రోజు ఒక్క నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం.. కేసు కోసం హాజరుకాకుండానే ఫిర్యాదుదారుల సంతకాలను ఫోర్జరీ చేయడంలో అధికారిణి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ విచారణలో తేలింది. దీంతో ఆమె నేరపూరిత కుట్రకు పాల్పడినట్లుగా దర్యాప్తు సంస్థ ఫిర్యాదులో ప్రస్తావించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. 2020లో ఈ వ్యవహారానికి సంబంధించి కంపెనీ డైరెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. మరుసటి ఏడాది ప్రధాన నిందితుడు జితేంద్ర కందారేను పుణె పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై విచారణ కొనసాగుతోంది.

### ఇండస్ట్రీ ప్రముఖుల ప్రేమ, నమ్మకమే

## నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి


**కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన సమంత..**

**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాంశమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి రిపోర్టర్ అడగ్గా.. సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. ఇండస్ట్రీకి చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను స్వీకరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు.




# కమలాహారిస్ అధ్యక్షురాలు కావాలి

- కోరుకుంటున్న చైనా
- ట్రంప్ హయాంలో క్షీణించిన ద్వైపాక్షిక సంబంధాలు
- చైనా జాతీయ సలహా సంఘం వెల్లడి



**బీజింగ్:** అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. ఈ ఎన్నికలపై చైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. అందుకు కారణాలను కూడా తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాలను దృష్టిలో ఉంచుకుని హారిస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు చైనా జాతీయ సలహా సంఘం తాజాగా వెల్లడించింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలపై వ్యాఖ్యలు చేయడానికి ఆసక్తి లేదని జాతీయ సలహా సంఘం చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జియా కింగ్‌గో తెలిపారు. సీపీపీసీసీ చైనా రాజకీయ సంస్థ కూడా. ఎన్నికల్లో అధ్యక్ష పదవివిపై తమ పౌరుల అభిప్రాయాన్ని సర్వే చేసిన అనంతరం చైనా తమ అభిప్రాయాన్ని ప్రకటించింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికాతో చైనా ద్వైపాక్షిక సంబంధాలు బాగా క్షీణించాయని పేర్కొంది.

''ట్రంప్ హయాంలో రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించడంతో పాటు తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఆయన చైనాపై తప్పుడు ఆరోపణలు చేశారు. ఇప్పటికీ మాకు బైడెన్ ప్రభుత్వంతో విభేదాలు ఉన్నాయి. అయితే.. ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు చైనాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల ప్రభావం బైడెన్ ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. అయినప్పటికీ బైడెన్ నేతృత్వంలో చైనా పట్ల అమెరికా విధానం స్థిరంగా ఉంది. ఇరు దేశాల నేతలు భేటీ అవుతున్నారు. సమస్యల పరిష్కారంపై చర్చలు జరుపుతున్నారు'' అని జియా కింగ్‌గో పేర్కొన్నారు.

**చైనా ఆందోళన అదేనా..?**

''ట్రంపా, హారిసా అనే విషయంలో చైనా పౌరుల ఉద్దేశాలు వేర్వేరుగా ఉండొచ్చు. నా వరకు హారిస్ వస్తే బాగుంటుంది. ట్రంప్‌తో ఇది వరకే చేదు అనుభవం ఉంది. మరోసారి ఆ పరిస్థితిని కోరుకోవడం లేదు'' అని పేర్కొన్నారు. కాగా.. కరోనా మహమ్మారి చైనా నుంచే పుట్టుకొచ్చిందంటూ నాడు ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలను చైనా ఖండించింది. చైనా నుంచి దిగుమతులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. బైడెన్ యంత్రాంగం అవే సుంకాలను కొనసాగిస్తోంది. అయితే.. మరోసారి అధికారం చేపడితే.. చైనా వస్తువులపై మరింత సుంకాన్ని విధిస్తామని ట్రంప్ పేర్కొనడంపై డ్రాగన్ ఆందోళన చెందుతున్నట్లు అవగతం అవుతోంది. ఈ క్రమంలోనే కమలాహారిస్ విజయం సాధించాలని ఆశిస్తోంది.



# కవి ఊహకు కాదేది అనర్హం

కవి ఊహకు, కవి వేగానికి హద్దులుండవు, అంతుండదు అందుకే "ఆకులో ఆకునై పువ్వులో పువ్వునై ఈ అడవి దాగిపోనా" అంటాడు, చెట్టైనా, పుట్టైన అన్నీ తానై ఊహిచుకుంటాడు, దేనికి అతీతుడు కాడు కాలేదు కూడా. మహాకవి "కాదేదీ కవిత కనర్హం" అన్నట్లు అన్నీ కవిత వస్తువులే అది "అగ్గిపుల్ల" కావచ్చు, "సబ్బు బిళ్ల" కావచ్చు, చిన్న పిల్లాడిలాగా, పండు ముసలిలాగా, యవ్వనంతో తొణికిసలాడే పడుచు యువతిలా-గా కన్నెపరువాలు ఒలకబోస్తు ప్రియుడి కోసం వలపులు తలపులు అన్నీ తనే ఊహించుకుంటూ "నువ్వేం మాయ చేశావో గాని ఓ మనసా చెప్పమ్మ నిజాన్ని" అంటాడు. మరోచోట "సిరి మల్లెపువ్వా సిరి మల్లె పువ్వా చిన్నారి చిలమ్మ నా వాడు ఎవడే నాతోడు ఎవడే"? అంటూ ప్రశ్నిస్తాడు. మరోచోట ప్రకృతిని, రుతువులను, నదీ, నదాలను, ఏర్లను, సెలయేర్లను వర్ణిస్తూ "తరలిరాద తనే వసంతం తన దరికిరాని వనాల కోసం, గగానాల దాక అల సాగకుంటే మేఘాల రాగం ఇల చేరుకోద" అంటాడు. "వసంతం" వనాల దగ్గరికి వస్తుంది కానీ వసంతం "వనం" దగ్గరికి వెళ్ళదు అనే వాస్తవిక దృశ్యాలతో అవాస్తవిక దృశ్యాన్ని సందర్భాన్ని బట్టి ఊహించి అక్షరూపం ఇస్తాడు. ప్రియుడి వేదనకు, ఆవేదనకు అక్షర రూపం ఇచ్చే క్రమంలో తానే ఆ విరహ వేదనను అనుభవిస్తునట్లుగా తాద్యాత్మీకరణం చెంది "ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం చేసినాను ప్రేమ సాగర మధనం మింగినాను హలాహలం" అంటూ వర్ణిస్తాడు. మరోచోట "పల్లవించవా నా గొంతులో పల్లవి కావా నా పాటలో" అంటూ ప్రేమ పల్లవిని అందుకుంటాడు. ప్రియురాలు దూరమైనప్పుడు ఆ విరహ వేదనను తట్టుకోలేక మేఘ సందేశం పంపుతూ "ఆకాశదేశాన ఆషాఢ మాసాన మెరిసేటి ఓ మేఘమా, మెరిసేటి మేఘమా విరహమో, దాహమో విడలేని మోహమో వినిపించు నా చెలికి మేఘ సందేశం" అంటూ "మేఘ సందేశం" పంపుతాడు. తనలో వైరాగ్యం ఆవహించినప్పుడు "ఆగదు ఏ నిమిషం నీ కోసము" అంటూ కాలం విలువను, గతం గొప్పతనాన్ని వివరిస్తాడు", అదే మరోచోట ఓటమి ఎదురైనప్పుడు "ఎప్పుడు ఒప్పుకో వద్దురా ఓటమీ" అంటూ గెలుపు కోసం "తలుపు" తెరిచే వుంది ప్రయత్నం చేయమంటూ స్ఫూర్తిని రగిలిస్తాడు. నువ్వు ఎంత ఎదిగినా ఒదిగి వుండాలని, "మౌనంగానే ఎదుగమని మొక్క నీకు చెబుతుంది ఎదిగిన కొద్ది ఒదగమని అర్థమందులో వుంది" అంటూ నిగూఢమైన అర్థాన్ని బోధిస్తాడు గురువులా. అన్నదమ్ముల అనుబంధాలు మనీ బంధాలుగా మారుతున్న ఈరోజుల్లో సెంటు భూమి కోసం వంద రూపాయల దగ్గర కూడా ఆస్తి గొడవలు హత్యలు, ఆత్మహత్యలు నిత్యం మనం ఎక్కడో చోట చూస్తూనే వున్నాం. అలాంటి వారికి గుణపాఠం చెప్పటానికి "నేనున్న గర్భంలోనే ఏడాది నువ్వున్నావు తమ్ముడా, ఇప్పుడు నువ్వాడ నేనీడ మనకెందుకు అడ్డుగోడ తమ్ముడా? అంటూ ప్రశ్నిస్తాడు. బంధాలు, బంధుత్వాలు ఈ జన్మలోనే భౌతికంగా ఎవరు ఎవరి నుండి దూరమైనా కంటికి కంపించరు, బతికి ఉన్నప్పుడే కలిసిమెలిసి వుండాలని ఆస్తి పంపకాలు, అంతస్థుల అంతరాలు పక్కన పెట్టాలని బోధిస్తాడు ఇందులో. అలాగే తల్లిదండ్రులను పిల్లలు పెరిగి పెద్దైన తర్వాత మాకు ఏం ఆస్తులు ఇచ్చారని అడగవద్దంటూ "ఏమిచ్చావని ఏమిచ్చావని నింధించకురా నాన్నను" అంటూ హెచ్చరిస్తాడు. నాన్నైనా, అమ్మయినా నీకు విలువైన జీవితాన్ని ఇచ్చారు. ఇంత కన్నా కావాల్సింది ఏముంది? నీలో ప్రతిభ వుంటే నువ్వే సంపాదించుకోవాలి కానీ తల్లిదండ్రులను నిందించవద్దు అంటూ సున్నితంగా మందలిస్తాడు. తండ్రి ప్రేమకు దూరమై పెరిగి పెద్దవాడైతే ఆ తండ్రి ప్రేమ ఎంత గొప్పదో "నాన్న నువు నా ప్రాణం అనినా సరిపోదట ఆ మాట నాన్న నీకై ప్రాణం ఇవ్వనా ఇదిగో నా మాట" అంటూ నాన్న గొప్పతనం గూర్చి వివరిస్తాడు. సమస్య వచ్చినప్పుడు దానికి జవాబు కూడా నీ వద్దనే వుంటుందని "నీ ప్రశ్నలు నీవే ఎవ్వరూ బదులివ్వరుగా, నీ చిక్కులు నీవే ఎవరూ విడిపించరుగా, పది నెలలు తనలో నిన్ను మోసిన అమ్మయినా అప్పుడో ఇపుడో కననే కనను అంటుందా"? అంటూ ప్రశ్న నీదే సమాధానం కూడా నీ దగ్గరే ఉంటుంది వెతకుతూ ముందుకు సాగాలని సూచిస్తాడు.

వెంటనే తేరుకొని పదహారు సంవత్సరాల పడుచుప్రాయంలోకి వెళ్ళి మరీ "పదహారేళ్ళ వయస్సు పడిపడి లేత మనసు పట్టుకో పట్టుకో పగ్గమేసి పట్టుకో" అంటూ యవ్వనంలోని మాధుర్యాన్ని కళ్ళెం వేసి పట్టుకోమంటాడు. వెళ్ళిపోతే తిరిగి రానిది యవ్వనం అంటూ మరోచోట "నిండు జాబిల్లీకై నా వుంది మచ్చ నీకు లేనందుకే వచ్చా" అంటూ ప్రియురాలిని బుట్టలో వేసుకోవడానికి పొగడుతూ "నెల్లూరి నెరజాణ నే కుంకుమల్లే మారిపోనా" అని తన్మయత్వం చెందుతూ "నీ నవ్వు చెప్పింది నాతో నేనెవ్వరో ఏమిటో" అంటాడు. మరో చోట "నిదురరాని పడకిళ్ళు బ్రహ్మచారి పొదరిళ్లు" అంటూ బ్రహ్మచారి గూర్చి వివరిస్తాడు. వృద్ధాప్యంలోకి వచ్చినప్పుడు బాల్య స్నేహితుడు కనిపిస్తే "ఆనాటి ఆ స్నేహ మానంద-గీతం ఆ జ్ఞాపకాలన్ని మధురతిమధురం .ఈనాడు ఆ హాయి రాదేల నేస్తం ఆ రోజులు మునుముందిక రావేమిరా లేదురా సుఖం రాదురా ఆ గతం ఏమిటో జీవితం" అంటూ గతం గుర్తు చేసుకొని బాధపడతాడు. ఇలా రాసుకుంటూ పోతే మనిషి జీవితంలో బాల్యం నుండి వృద్ధాప్యం వరకు మనిషి పొందే ఉద్వేగాలు, అనుభూతులు, సంఘటనలు చూడటం లేదా తను స్వయంగా అనుభవించి ప్రతి స్పందిస్తాడు. ఒక కవికి మాత్రమే అన్ని రకాల స్పందలను తన స్పందనగా తనకు తానుగా సంఘర్షించుకొని సన్నివేశంలోకో, సంఘటనలోకో, సందర్భంలోకో పరకాయ ప్రవేశం చేసి చిన్న పిల్లవాడిగా, యువకుడిగా, యువతిగా, సరిహద్దులను కాపాడే సిపాయిగా, పండు ముసలిగా దేశంలో జరిగే నేరాలు, ఘోరాలు, అవినీతి అక్రమాలు చూసి చిటికలో స్పందిస్తాడు. "నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని మారదు లోకం అంటాడు. రామబాణం ఆపిందా రావణ కాష్టం? కృష్ణగీత ఆపిందా నిత్యకురుక్షేత్రం" అంటూ ఆవేశంగా ఊగిపోతూ "అర్థ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్ర మందామా? స్వర్ణోత్సవాలు చేద్దామా"? అని ప్రశ్నిస్తూ "సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని సుఖనమనలేని వికాసమెందుకని" ఆలోచించమంటూ "తెలుగు వీర లేవరా దీక్ష భూని సాగరా దేశమత స్వేచ్ఛ కొరకు తిరుగుబాటు చేయరా" అంటూ పరాయి పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటుని ప్రకటిస్తాడు, అంటే ఇక్కడ కవి స్పందన, కవి కల్పన సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని ఓ పాత్ర ద్వారా హెచ్చరిక పంపిస్తాడు, అంటాడు.

నేటికి ప్రపంచవ్యాప్తంగా ఏదో మూలన ఘర్షణలు జరుగుతూనే వున్నాయ్ మనుషుల మధ్య విభజన రేఖలు గీసిన మత గ్రంథాలు వాటిని మనిషి సరిగ్గా అర్థం చేసుకోకపోవడం ఫలితంగా స్వార్థ రాజకీయ నాయకులు అధికారం కోసం ప్రజల మధ్య కులాల కుంపట్లు, మతాల మంటలు రాజేస్తున్నారు అంటాడు. "వాక్యం రసాత్మకం కావ్యం" అంటాడు విశ్వనాధుడు. రాసిన వాక్యం ఏదైన రసాత్మకంగా వుంటే అది పాఠకులకు, ప్రేక్షకులకు, వీక్షకులకు చేరి ఆలోచింపజేస్తుంది. అది ఒక్క కవికి మాత్రమే దైవ వరంగా లభించింది. రాసే వాక్యం ఏదైనా కావచ్చు. ఒక మనిషిని ఇంతలా కదిలించగలిగే శక్తి కేవలం సాహిత్యానికే వుంది, అది "అక్షరానికి" మాత్రమే వుంటుంది. అందుకే "విశ్వశ్రేయం కావ్యం" అన్నారు పెద్దలు. కవి స్పందనను ఊహించటం, కవి వేగానికి మీటర్లు పెట్టి లెక్కించడం సాధ్యం కాదు. కవి ఏవిధంగానైనా స్పందించగలడు. బాధితుల వైపు బాధ్యుల వైపు నిలబడగలడు, కవికీ కవితా వస్తువు ఏది నిషేధం కాదు, అందుకే కవి కల్పనకు అంతుండదు. అవధులు అంతకన్నా వుండవు. కవి నిత్య చిరంజీవి, "రాజు జీవించు రాతి విగ్రహముల యందు కవి జీవించు ప్రజల నాలుకల యందు" అన్న ఓ కవి అక్షరాలు అక్షర సత్యాలు. కవికి ఇంత కన్నా ఏం కావాలి. ఇది చరిత్ర చెప్తున్న సత్యమే కదా...!



-డాక్టర్ మహ్మద్ హసన్
సాహిత్య విమర్శకుడు
9908059234.

## గీతకార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా సాగిన
# 67ఏళ్ల గీత పనివారల సంఘం ప్రస్థానం

లక్షలాది మంది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి జీవిస్తున్న వృత్తి కల్లుగీత వృత్తి, కల్లు ప్రకృతి పానీయం. పురాణాలు, ఇతిహాసాలలో సురాపానం పేరు ఉంది. దేవతలు సేవించడం వల్లనే కల్లుకు సురాపానం అనే పేరు వచ్చింది. తాటి, ఈత వనం నుంచి గీత కార్మికులు కల్లు ను లేదా నీరా తీసి విక్రయిస్తూ స్వయం ఉపాధిని పొందుతున్నారు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ అడివిలో చెట్లు గీసే గీత కార్మికుల బతుకు గాలిలో దీపం లాంటిది. ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టుమీద నుంచి పడితే మరణించడమో, శాశ్వత వికలాంగులు కావడమో జరిగేది. కుటుంబాలు అనాథలుగా రోడ్డున పడే పరిస్థితులు కలిగేవి. స్వాతంత్రోద్యమం, ఆర్యసమాజ్, ఆంధ్రమహాసభ, కమ్యూనిష్టు ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటున్న బొమ్మగాని ధర్మభిక్షం గీత కార్మికుల పరిస్థితుల పట్ల చలించిపోయారు. గీతకార్మికుల జీవన పరిస్థితులు మెరుగుపరచడంకోసం, వాళ్ళహక్కుల సాధనకోసం నడుం బిగించారు. ఆంధ్రప్రాంతంలో గుర్తింపు పొందిన గౌతు లచ్చన్న, తెలంగాణలో ధర్మబిక్షం కృషితో 1955లో హైద్రాబాదులో గౌడ సంఘం ఏర్పడింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి సంఘం అంటూ ఏర్పడకపోయినప్పటికి గీత సంఘం, గీతకార్మిక సంఘం, గీతపరివారల సంఘం అనే పేర్లతో ఉద్యమాలు నడుస్తుండేవి. 1956 నవంబర్1వ తేదిన ఉభయప్రాంతాల తెలుగు ప్రజలతో భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతాలలో మద్య నిషేధానికి వ్యతిరేకంగా ఉద్యమాలు సాగుతుండగా తెలంగాణ ప్రాంతంలో సాయుధరైతాంగ పోరాట స్ఫూర్తితో దున్నేవాడిదే భూమి , గీసే వాడిదే చెట్టు అంటూ ఉద్యమ నినాదం ఊపందుకుంది. ఈ తరుణంలో ఉభయప్రాంతాల గీత కార్మికులను ఏకం చేసి వారి హక్కుల సాధనకు సంఘాన్ని స్థాపించే కార్యక్రమానికి ధర్మబిక్షం శ్రీకారం చుట్టారు. ఉభయ ప్రాంతాల గీత కార్మికులకు అనువుగా ఖమ్మం జిల్లా గార్లలో 1957 లో మహాసభను సంపెట రామారావు, గార్ల కొమరయ్య, వంటి గీత సంఘ నాయకుల సహకారంతో గీత పనివారల మహాసభను, సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ గీతపనివారల సంఘంగా ఏర్పాటు చేశారు. దీన్ని ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు పార్లమెంటు సభ్యులు బద్దం ఎల్లా రెడ్డి ప్రారంభించారు. ఎస్.ఆర్.దాట్ల ధర్మబిక్షం అద్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. 1975లో సూర్యాపేటలో ధర్మబిక్షం అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ గీత పనివారల సంఘం ద్వితీయ మహాసభ గీత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఈ మహా సభలో ధర్మబిక్షం







విజ్ఞప్తి మేరకు నాటి రాష్ట్ర ఎక్సైజ్ శాఖమాత్యులు పురుషోత్తం రెడ్డి చెట్టుపై నుంచి పడి మరణించిన గీతకార్మికులకు రూ.1500, వికలాంగుడైతే రూ.1000 ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఈ మహాసభ ధర్మబిక్షంను అధ్యక్షులుగా , పి. రామారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. శాసనసభ్యులు నిమ్మల రాములు, మాచర్ల జగన్నాథం తదితరులను నూతన కమిటీలో తీసుకున్నారు గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియోను గీతపనివారల సంఘం సాధించిపెట్టింది. 1977లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం మద్యనిషేధం ప్రకటించగా ధర్మబిక్షం నాయకత్వంలో లక్షలాది మంది గీత కార్మికులు రాష్ట్రంలో ఉద్యమబాట పట్టారు. 1983లో తెలుగుదేశం అధికారం చేపట్టి రాష్ట్రంలో మద్యనిషేదం తమ మేనిఫెస్టోలో ఎన్.టి. రామారావు ప్రకటించగా దాన్ని నిరసిస్తూ గీత పనివారల సంఘం నిరసనలను చేపట్టింది. 1991-92సం॥లో నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి కల్లీ పేరుతో కల్లును నిషేధించాలని చూడగా గీత పనివారల సంఘం అధ్యక్షులు , పార్లమెంట్ సభ్యునిగా ధర్మబిక్షం చొరవతో గౌతు లచ్చన్న అధ్యక్షతన వృత్తిసంఘాల సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వం విధించిన మద్యనిషేదాన్ని రద్దుచేయించడానికి ఆంధ్రప్రదేశ్ గీతవృత్తి రక్షణ పోరాట సంయుక్త సమితి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ గీత పారిశ్రామిక సంఘం నేత బి.ఎస్.వి.స్వామి ప్రతిపాధించగా ఆంధ్రప్రదేశ్ గీత పనివారలసంఘ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్‌ను కన్వీనరుగా , గీత పారిశ్రామిక సంక్షేమ సంఘం అధ్యక్షులు బండినర్స గౌడును కో. కన్వీనరుగా ఎన్నుకొన్నది. వీరి నాయకత్వాన రాష్ట్రవ్యాప్తంగా కల్లునిషేదాన్ని తొలగించాలనే ఉద్యమాలను నిర్వహించి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర గీతపనివారల సంఘం 2010 సెప్టెంబర్ 25,26 తేదీలలో హైద్రాబాదులో ..9వ మహాసభ సందర్భంగా జరిగిన పెద్ద బహిరంగ సభకు ధర్మబిక్షం అధ్యక్షత వహించి మహాసభలో మాట్లాడుతూ చెట్లు గీసే చివరి కార్మికుడు ఉన్నంతవరకు వారి హక్కులను కాపాడే బాధ్యతను సంఘం తీసుకొంటుందన్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రసంఘాలు తమ తమ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. తెలంగాణ గీత పనివారలసంఘం హైద్రాబాద్ పీర్జాదిగూడలో ద్వితీయ మహాసభను నిర్వహించుకొంది. నాడు జరిగిన బారీ బహిరంగసభలో అప్పటి ఎక్సైజ్ శాఖమాత్యులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ధర్మబిక్షం ఆశించిన నీరా ప్రాజెక్టు కలను తమప్రభుత్వం సాకారం చేసినట్లు వెల్లడించారు. 67సంవత్సరాల సుదీర్ఘపోరాట చరిత్రలో సంఘం ఎన్నెన్నో ఆటు పోట్లను చవిచూసింది. సంతలో పశువులను అమ్మినట్లు కల్లు వృత్తిని వేలంవేసి పాడుకోవలసిన దుస్థితి నుంచి కాపాడి సంఘం టి.ఎఫ్.టిలను కల్లుగీత సహకార సంఘాలను సాధించిపెట్టింది. రాష్ట్రస్థాయిలో గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థను సాధించింది. చెట్ల పెంపకానికి 10ఎకరాల భూమిని పొందేహక్కును కల్పించి జీ.వోను సాధించింది. నీరా ప్రాజెక్టులను సాధించింది. గీత వృత్తి నేడు ఇంటా బయటా అనాదరణకు గురౌతున్నది. వృత్తి పన్ను రద్దుచేసి ప్రభుత్వాలు గీతవృత్తికి మేలు చేశాం అని చెప్పుకుంటున్నారేగాని నామమాత్రం పన్నైనా కట్టందే చెట్టుపై యాజమాన్యపు హక్కు కోల్పోతామనే వాస్తవం నేడు తెలిసొస్తుంది. గీత వృత్తిని అభివృద్ధి చేయాల్సిన తరుణం నేడు మరింత పెరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా గీతవృత్తి పట్ల సానుకూలంగా స్పందించి సేఫ్టీకిట్స్ లేఔట్లలో ఈత, తాటి వనంపెంచాలని ,రోడ్ల వెంట ప్రభుత్వ భూముల్లో గ్రీనరీ కింద తాటి వనం పెంచాలని ప్రోత్సహించడం శు భసూచకం. నీరా, బెల్లం, చాకెట్లు ముఖ్యంగా క్యాన్సర్ నిరోధక గుణాలు కల్లులో ఉన్నాయని శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. దీనిపై మరింత పరిశోధనకు, ఉపాధి, వృత్తి శిక్షణకు ప్రభుత్వం ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీలో గీతవృత్తి దారులకు, గౌడ బిడ్డలకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడంలో ముఖ్యమంత్రి చొరవచూపాలని గీతపనివారల సంఘం అభిలషిస్తోంది.



-బి. నాగభూషణం
రాష్ట్ర కేంద్ర కో-ఆర్డినేటింగ్ సెక్రటరీ
తెలంగాణ రాష్ట్ర గీతపనివారల సంఘం

# జలమే జగతికి ఆధారం

## నీరు ఉంటేనే మన ఉనికి, మనుగడ.. దేవుడు ప్రాణికోటికి ఇచ్చిన ఓ అద్భుతమైన వర ప్రసాదం



నమస్త్రిపథగామిన్యై విశ్వమూర్త్యై నమో నమః " ఇలా సాగుతూ ఉంటుంది గంగాప్రార్థన. గంగ అంటే కేవలం ఒక్క గంగానదినే తీసుకోకూడదు. గంగను నీరు అనే అర్థంలో వాడుతున్నారు కదా! నీరు జీవనాధారానికి మూలం. నీరు ప్రాణికోటికి ప్రాణాధారం అందుకే చాలామంది నీటికి "ప్రాణధారాయైనమః"అని నమస్కరిస్తుంటారు. నీరు, ఉదకం, జలం, జలకం, సలిలం, తోయము, అంబువు, వారి, అపస్, మేఘజం, పానీయం, అమృతం అనే పర్యాయపదాలుగా చెబుతుంటారు. వాటర్, పానీ, తన్నీర్, అంటూ ఇతర భాషలలో పిలుస్తుంటారు. జలమే జగతికి ఆధారం. జలమే జగతికి మూలం. అటువంటి జలాన్ని "పృధివ్యాపస్తేజోవాయురాకాశః" పంచభూతాలలో ఒకటని ఆర్యులు చెప్పారు కదా! మనం కూడా అనాది కాలం నుండి పూజిస్తునే వున్నాం కదా! సాధువుల నుంచి సామాన్యుల వరకూ ప్రతీ నిత్యం పర్వదినాలలో సముద్రాలు, నదులలో, కాలువలలో నీటి వనరులున్న చోట స్నానాలు చేసి భగవంతునికి అర్ఘ్యం ఇస్తుంటారు కదా! అదే విధంగా మన ఇండ్లలో ఏదైనా పూజా పునస్కారాలు చేసేటప్పుడు ఒక చిన్న పాత్రలో నీరు తీసుకుని "గంగేచ యమునేచైవ నర్మదా సింధు కావేరి జలేస్మిన్ " అంటూ మంత్రం చెప్పుకొంటూ ఆ నీటికి పైన చెప్పిన నదుల పవిత్రతను ఆపాదించుకొంటున్నాం కదా ! అంటే మన వీధి చెరువులలోంచి మున్సిపాలిటీ పంచాయితీ కుళాయిల ద్వారా వచ్చే నీటిని మనం ఆ విధంగా పవిత్రంగా భావిస్తున్నాం కదా! చూసారా! మన సనాతన ధర్మం ఎంత గొప్పదో? ఎంత ఆచారమైనదో? మనం చేసే ప్రతి పనికి పవిత్రత ఆపాదించుకొంటున్నాం. అదే కదా! సంప్రదాయం అంటే? ప్రాణులకు జీవశక్తినిచ్చే నీటికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో కదా! అటువంటి నీరు మూడు రకాలుగా ఘన రూపంలో (మంచు), ద్రవ రూపంలో (సముద్రాలు, నదులు, కాల్వలు), వాయు రూపంలో (మేఘాలు,ఆవిరి) లభిస్తోంది.

ద్రవరూపాలుగా (సముద్రాలు, నదులు, కాల్వలు, చెరువులు, నీటి కుంటలలో వున్న నీరు సూర్యరశ్మి వలన వేడెక్కి ఆవిరి రూపంలో పైకి వెళ్ళి మేఘాలుగా, మబ్బులుగా మారిపోతుంది. మరలా చల్లని గాలులకు మేఘాలు, మబ్బులు కరిగి వర్షంలా కురిసి నీరులా మారుతోంది కదా! దీనిని నీటి చక్రం అంటారని సైన్స్ చెబుతోంది కదండీ! ఇది నిరంతరాయంగా ప్రకృతిలో సహజసిద్ధంగా జరిగే చర్య. ప్రకృతి మనకు సహజ సిద్ధంగా ఉచితంగా అందించే జీవనాధారమైన వనరులలో అతి ముఖ్యమైనది నీరు. కాదంటారా? ఎవరైనా? నీరు దేవుడు ప్రాణికోటికి ఇచ్చిన ఓ అద్భుతమైన వర ప్రసాదం. అవునా? కాదా? చెప్పండి. నీరు తాగటానికి, వివిధ రకాల గృహావసరాలకు, వాడుకోవడానికి, సాగు చేసుకోటానికి ఉపయోగించే అమూల్యమైన వనరు. నీరు ఉంటేనే మన ఉనికి, మనుగడ. ప్రాణికోటి సమస్తానికి జీవాన్ని, బలాన్ని, తేజస్సును, ఓజస్సును ఇచ్చేది నీరే కదా!

సైన్సు లో నీటిని సాంకేతిక నామంగా "హెచ్ 2 ఓ" అంటారు. సమస్త చరాచర జీవకోటికి ప్రాణాధారమైన నీరు వుండే ప్రాంతాలలోనే ప్రగతి, నాగరికత కనిపిస్తుంటాయి ఎడారి భూముల్లో, బీడు వారిన చౌడు నేలల్లో మొక్కలు ఏం మొలుస్తాయి? ఏ పశువులు తిరుగుతాయి? చెప్పండి. మీరు గమనించండి. చరిత్రలో మనం చదువుకున్న సింధు నాగరికత, హరప్పా నాగరికత, విజయనగర సామ్రాజ్య వైభవాలు, మొదలైన నాగరికతలు ఇవన్నీ నదీతీర ప్రాంతాలలోనే విలసిల్లినవి కదా! ఎన్నో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, కళా, వారసత్వ సాంప్రదాయాలను, నాగరికతలను మానవ ప్రగతికి అందించినవి

నదీ తీరప్రాంతాలే కదా! మరి అలనాటి సంప్రదాయాన్ననుసరించే నేటికీ గంగ, గోదావరి, కృష్ణ, మొదలైన నదీమతల్లులకు నిత్యం హారతులు ఇవ్వటం, పుష్కరాలు, కుంభమేళాలు నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నేటి సమాజానికి అందిస్తున్నారు. అటువంటి నీటి వనరులను నేటి కాలంలో ఎలా దుర్వినియోగపరుస్తున్నారో చూడండి. వివిధ రకాల కాలుష్యాలు, చెత్తా చెదారాలు, వ్యర్థాలు, ఒక్కటేమిటి అన్నిటినీ నీటి వనరులలో పారేయడం, ఫ్యాక్టరీలు, పారిశ్రామిక సంస్థలు మొదలుగా హోటళ్ళు , థియేటర్స్, మొదలైన జన సముదాయాలు, ఇళ్ళు, సాగుబడి చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలు, ఇంకా ఇతర పశువుల, జంతువుల కేంద్రాల వారు ఒకటేమిటి? ఇంచుమించుగా అందరూ అన్ని విధాలా వాడకం నీటిని నదులలో, కాలువలలో, చెరువులలో వదిలేస్తున్నారు. అదీ కాకుండా మిగిలిన పోయిన, కుళ్ళిపోయిన ఆహార పదార్థాలు, కూరగాయల, ఒకటేమిటి? మనకు వ్యర్థమైన వాటితో పాటు జంతు కళేబరాలు, చెత్తా చెదారాలు, ప్రతీ రోజూ అదే పనిగా కాలువలలో పారేయడం అలవాటు అయిపోయింది. అంతే కాకుండా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, క్యారీ బాగులు రకరకాల రూపాల్లో వివిధాలుగా ఉపయోగించేసుకున్న ప్లాస్టిక్ ను నీటి వనరులు ప్రవాహాల్లో విచ్చలవిడిగా పారేస్తున్నారు. ఇలా మంచినీటి వనరులను మురికి కూపాలుగా మార్చేస్తున్నారు మానవులు తమ వికృత చేష్టలతో తాగే నీటి ప్రవాహాలను ఈవిధంగా వ్యర్థాల మురికి గుంటలుగా తయారుచేసేస్తుంటే బలవర్ధక పోషకాలు, సరైన లవణాలు, హానిరహిత ఆరోగ్యకరమైన మంచినీరు ఎక్కడినుంచి దొరుకుతుంది చెప్పండి? భూమండలం మీద 71 శాతానికి పైగా ఆవరించి ఉన్న మంచినీరు ఈరోజుల్లో తాగటానికి ఒక్క మంచినీటి బిందువు సరిగా దొరకటం లేదు అని చెప్పుకోవచ్చు. జీవుల్లో జీవ రసాయన ప్రక్రియలన్నీ దోహదపడే నీరు జంతువుల శరీరంలో సుమారుగా 70 నుంచి 90 వరకూ, మనిషి శరీరంలో 2/3 వంతుగా వున్న నీరు శరీరంలో రవాణా సౌకర్యాలు కలిగిస్తూ, శరీరంలో వుండే పనికిరాని చెత్తను, మలినాలను బయటికి పంపేస్తూ మన ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడే నీరు స్వచ్ఛంగా ఎక్కడ దొరుకుతోందో చెప్పండి? అసలు మనం తాగే ఒక లీటరు నీటిలో ఇనుము ఒక మిల్లీ గ్రాము శాతం కన్నా ఎక్కువ వుండకూడదు. అదే విధంగా లీటరు నీటిలో నైట్రైట్ కణాలు సున్నా శాతం, నైట్రేట్ వంద మిల్లీ గ్రాముల మించివుండకూడదంటూ, లీటరు నీటిలో రెండు వేల వరకూ వివిధ రకాల ఖనిజాలు వుంటే ఆ నీరు తాగటానికి మంచిదని ఆరోగ్య శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు కదా! గమనించండి ఏదైనా అనారోగ్య సమస్యలతో వైద్యుల దగ్గరకు వెళితే మనం తాగే నీటి గురించి ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారా లేదా? నీటి వలనే కదా సీజనల్ వ్యాధులు, హెపటైటిస్ మొదలైన ఎన్నో రకాల ఇబ్బందులు వస్తుంటాయని ఆరోగ్య సర్వేలు చెబుతున్నాయి కదా! అందుకనే నీటిని కాచుకొని తాగండి అని డాక్టర్లు చెబుతున్నారు కదా! జలమే కదా జగతికి ప్రాణాధారం, జలమే ప్రగతికి మూలాధారం. అటువంటి నీటిని వివిధ రకాలుగా తాగటానికి పనికిరాకుండా చేసేస్తున్నాం. వివిధ కారణాల మూలంగానే నీటిని కొనుక్కుని తాగుతున్నాం కదా! స్వచ్ఛమైన పచ్చదనాలు వెల్లివిరిసే పల్లెల్లో కూడా వాటర్ ప్లాంట్స్, వాటర్ ఫౌండేషన్స్ పేర్లతో నీటిని అమ్మేస్తున్నారు. ప్రతీ ఇంట్లో రివర్స్ ఆస్మోసిస్(ఆర్వో) నీళ్ళే తాగుతున్నారు కదా! చాలా విచిత్రమేమంటే ఇంట్లోంచి బయటకెళ్ళే ప్రతీ వ్యక్తి నీళ్ళు ఎవరూ పట్టుకెళ్ళడం లేదు కదా! నిజాయితీగా మాటాడుకుంటే నూటికి తొంభై శాతం మంది వాటర్ బాటిల్స్ కొనుక్కుని కొద్దిగా తాగేసి మిగిలిన నీటిని ప్లాస్టిక్ బాటిల్స్ తో సహితంగా పారేస్తున్నారు కదా! దీని వలన రెండు రకాల ఇబ్బందులు వున్నాయి జాగ్రత్తగా గమనించండి డ్రింకింగ్ వాటర్ పాకెట్స్, బాటిల్స్, కేన్స్ లో ఏ నీళ్ళు ప్యాక్ చేస్తారో? ఏ వాతావరణంలో ప్యాక్ చేస్తారో?


తయారు చేసిన తేదీలు, ఏ తేదీలోగా వాడాలి? అనే విషయాలు కూడా గమనించకుండా అదో ప్యాషన్ గా కొనుక్కోడం, తాగేయడం, పారేయడం చేస్తున్నారు. దాని వలన ఆరోగ్యం పాడవటమే కాకుండా నీటిని వృథా చేయడం కూడా జరుగుతోంది. ఇలా చేసుకొంటూ పోతుంటే సముద్రాలు, నదులు, కాలువలు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ పూడుకుపోయి, ప్రవాహాలు ఆగిపోయి, వరదలు, ముంపులు, వాటితో రకరకాల ఇబ్బందులు, అనారోగ్యాలు అన్నీ మనమే మన చేతులారా కొనితెచ్చుకుంటున్నాం కదా! ఒక్కసారి ఆలోచించండి మనం ఇంట్లో తాగే నీటిని మన కూడా పట్టుకెళ్ళడం వల్ల కొంతవరకూ ఇబ్బందులు తొలగించినవారమవుతాము కదా! ఇది మనందరి సామాజిక బాధ్యత కాదంటారా? అపార్ట్మెంట్ కల్చర్ లో బతుకుతున్నాం కదా! ఎన్ని నీళ్ళు వృథా అవుతున్నాయో ఎప్పుడైనా గమనించారా? సాధారణంగా ఆరోగ్యవంతుడైన మనిషి రోజుకి రెండు నుంచి మూడు లీటర్ల నీరు తాగాలనీ పరిశోధకులు చెబుతున్నారు. ఇంక స్నానాలకు, బట్టలు ఉతకటానికి, పాత్రలు శుభ్రం చేయడానికి ఇలాంటి తదితర గృహ అవసరాలకు సగటున నలుగురు ఉన్న కుటుంబానికి రోజుకీ సుమారుగా వంద లీటర్ల నీరు అవసరం వుండొచ్చని సర్వేలు చెబుతున్నాయి. ఈ విషయాలను బట్టి చూస్తే అపార్ట్మెంట్ లో వారు ఎన్ని నీళ్ళను అనవసరంగా వృథా చేస్తున్నారో గమనించగలరు. నేడు మీరు చేసే నీటి పొదుపే రేపటి మీ పిల్లలకు మీరిచ్చే పెద్ద ఆస్థి అవుతుంది గుర్తుంచుకోండి. భావితరాలకు మంచి నీళ్ళని ప్రాణాధారలుగా అందిద్దాం. వృథా నీటిని అరికడదాం మంచి నీటిని పొదుపుగా వాడుకుందాం. నీళ్ళ కోసం గొడవలు పడి కోర్టుల్లో నలుగుతున్న విషయాలు తెలుసుకోండి. నీటిని ప్రకృతి సహజ వనరుగా, దైవమిచ్చిన ఉచిత ప్రసాదంగా భావించి నీటిని పొదుపుగా వాడుకుందాం.

భగవద్గీత లో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన
"అన్నాద్భవంతి భూతాని
పర్జన్యాదన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో
యజ్ఞః కర్మసముద్భవః "అనే శ్లోకాన్ని ఒకసారి గమనిద్దాం. ప్రాణులు అన్నము వలన కలుగుచున్నవి. అన్నము మేఘము వలన కలుగుచున్నది. మేఘము యజ్ఞము వలన కలుగుచున్నది అని శ్లోకార్థం. అన్నం కావాలంటే పంటలు పండాలి. పంటలు పండాలంటే మేఘాలు, మేఘాలు వలన వర్షం, వర్షం నుంచి నీరు రావాలి. అలా వచ్చే స్వచ్ఛమైన నీరు ప్రాణులందరికీ లభించాలంటే ఇప్పటికైనా మేల్కొందాం. పొదుపుగా నీటిని వాడుకుందాం. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా చూద్దాం.

" కాలువలెల్లను చెత్తకు
నిలవరమగుటన్నదిలను నిజమౌ జూడన్
మలిన మనస్కుల పనులన
కలుషితమగుగాదె పంటకాల్వల నెన్నన్"

అంటూ ప్రముఖ పద్య కవి దేవరకొండ రమణారావు గారు చెప్పినట్లుగా నేటి కాలమున పంటబోదెలు, కాలువలు మలినములతో నిండి కలుషితం కావడం బాధాకరము. పంట కాల్వలను పరిశుభ్రముగా వుంచుట మనందరి కర్తవ్యమంటూ హితవు చెప్పిన దేవరకొండ రమణారావు గారి మాటలను గుర్తు చేసుకుందాం. ఆ దిశగా ఆచరిద్దాం.

చివరిగా సమస్త జీవరాశులకు ప్రాణాధారమైన నీటిని అందించే సర్వ నదీమతల్లులను స్మరిస్తూ, ఆ నదుల స్వరూపమైన గంగా మాతకు నమస్కరిద్దాం "గంగాయై నమః" అంటూ....



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 9989515300

# పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** చదువు బాధ్యత మీది ఫీజు బాధ్యత నాది అని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చదువుల్లో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలిచి వారి డాక్టర్ కలను నిజం చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడా లేని విధంగా ప్రజలు ఎన్నుకోబడిన ఒక శాసనసభ్యులు పేద ప్రజల పిల్లల చదువుకు తాను అండగా నిలుస్తానని, ఆర్థికంగా, అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తానని బండారి లక్ష్మారెడ్డి ముందుకు వచ్చారు. గురువారం చిల్కానగర్ డివిజన్ మల్లికార్జున్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వౌరుసు యాదమ్మ ఈదయ్యల కుమార్తె వి. నందిని ఇటీవల జరిగిన నీట్ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో ఎంబీబీఎస్ పరీక్షల్లో ర్యాంకు ర్యాంకు సాధించడంతో ఎంబీబీఎస్ లో సీటు పొందారు. నందిని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గురువారం నేరుగా నందిని ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడి ఎంబీబీఎస్ పూర్తయ్యేవరకు 5 సంవత్సరాలకు కావలసిన ఫీజు ఇరవై తొమ్మిది వేల రూపాయల చొప్పున ప్రతి సంవత్సరం తానే అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మొదటి సంవత్సరం ఇరవై తొమ్మిది వేల రూపాయల చెక్కును నందినికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద కుటుంబాల విద్యార్థులకు గవర్నమెంట్ కౌన్సిలింగ్లో ఎంబీబీఎస్ సీటు పొందిన ప్రతి ఒక్కరికి తాను ఆర్థికంగా అండగా నిలబడతానని వారికి కావలసిన ఐదు సంవత్సరాల ఫీజును తానే కడతానని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి కంటెస్టెంట్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, ఉద్యమ నాయకులు, మహిళా నాయకురాలు, మల్లికార్జున్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నందిని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ దళిత సంఘాల ఉమ్మడి నల్లగొండ జిల్లా జేఏసీ అధ్యక్షునిగా చిప్పలపల్లి ఉపేందర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ దళిత సంఘాల ఉమ్మడి నల్లగొండ జిల్లా జేఏసీ అధ్యక్షులుగా చిప్పలపల్లి ఉపేందర్‌ను తెలంగాణ దళిత సంఘాల రాష్ట్ర ఛైర్మన్ ఈదుల పరుషరాం నియమించారు. చిప్పలపల్లి ఉపేందర్ గత 20 సంవత్సరాల నుండి విద్యార్థి ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, అలాగే దళిత ఉద్యమాలలో తనదైన శైలిలో చురుకుగా పాల్గొన్నారని ఈదుల పరుషరాం తెలిపారు. చిప్పలపల్లి ఉపేందర్ ఉద్యమ చరిత్రను తెలుసుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా, సూర్యపేట నియోజకవర్గం ఇన్ చార్జ్‌గా నియమించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ఉత్తర్వులు నేటి నుండి చిప్పలపల్లి ఉపేందర్ బాధ్యతలకు వర్తిస్తాయని పరుషరాం తెలిపారు. ఇట్టి బాధ్యతలను ఎంతో నమ్మకంతో నాకు అప్పగించిన తెలంగాణ దళిత సంఘాల రాష్ట్ర ఛైర్మన్ ఈదుల పరుషరాం కు ఉపేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి సంఘాన్ని నిజాయితీతో ముందుకు తీసుకు పోతానని నూతన ఎన్నికైన తెలంగాణ దళిత సంఘాల జేఏసీ అధ్యక్షులు చిప్పలపల్లి ఉపేందర్ తెలిపారు.

## ఇందిరమ్మ కమిటీలలో ప్రాధాన్యం కల్పించాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని గ్రామాల్లో ఇటీవల నియమిస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తల పేర్లు మాత్రమే రాసుకుంటున్నారని, అన్ని పార్టీలు, అన్ని కులాల వారికి అవకాశం ఇవ్వాలని, కేవలం కాంగ్రెస్ పార్టీ వారే కమిటీలలో ఉంటే, నిజమైన పేదవాడికి అసలే ఇల్లు రావని రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు, బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు బొక్క మాధవ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీల వారికి, అన్ని కులాల వారికి ప్రాధాన్యమిచ్చి నిజమైన పేదలను గ్రామాల్లో గుర్తించి, అందరి సమక్షంలో మాత్రమే న్యాయం జరిగేవిధంగా చూడాలని పేదవాడికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాలని అన్నారు.

## దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టాపన



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో వేదమంత్రోచ్చరణలతో శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో గురుస్వామి గిరీషన్ నాయర్, కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, వెంకట్రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భగవంతుని నామస్మరణతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఈ సందర్భంగా గురుస్వామి గిరీషన్ నాయర్ తెలిపారు. అనంతరం స్వామివారిని అర్చకులు రవి శర్మ, సంతోష్ శాస్త్రి, సునీలా చార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించిన దాతలు ఈశ్వరప్ప, రేటికల్ చంద్రకాంత్, మేకల సత్యనారాయణ, మేకల రామచంద్ర రెడ్డి, మేకల దేవేందర్ రెడ్డి, పోతు రమేష్, పలబట్ల సత్యనారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానికులు, భక్తులు ఎడ్ల ప్రభాకర్, కాట లింగమప్ప, పోతు కృష్ణయ్య, కడియాల శివయ్య, వై ఢీ అమర్ నాథ్, విక్రంరెడ్డి, రోళ్ల అంజయ్య పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో గురువారం శ్రీ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీడీ గ్రౌండ్ వాటర్ వి. సురేష్, డీఎఫ్ఓ వీరన్న, కలెక్టరేట్ సూపరిండెంట్లు మదన్ గోపాల్, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ వర్కర్ నారాయణమ్మకు సన్మానం




**విశ్వంభర, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన జాతీయ కర్మచారి అవార్డు గ్రహీత, జీహెచ్ఎంసీ వర్కర్ నారాయణమ్మను వీ3 న్యూస్ ఛానల్ ఉద్యోగులు, నల్గొండకు చెందిన సత్య సాయి జ్ఞాన మండలి సభ్యురాలు హేమా రెడ్డి శాలువ మరియు పూలమాలతో సత్కరించారు. స్వతహాగా గాయకురాలైన నారాయణమ్మ వీ3 న్యూస్ ఛానల్‌లో పాటలు, పద్యాలను ఆలపించారు. ఆమె పాడిన పాటలు, పద్యాలకు ముగ్ధులైన వీ3 న్యూస్ ఛానల్ ఉద్యోగులు, సత్యసాయి జ్ఞాన మండలి సభ్యురాలుతో కలిసి నారాయణమ్మను సన్మానించారు. ఈ సన్మాన కార్య క్రమంలో వరలక్ష్మి,, యాంకర్ రమ్య శ్రీ, హేమలతా రెడ్డి పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే



**విశ్వంభర, కొంపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పేద ప్రజలకు ఇండ్లు అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఎంతోమంది పేద ప్రజలకు ఇండ్లు ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ అన్నారు. అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ఏ.ఎం.ఆర్ గార్డెన్ లో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల స్కీం పై సీనియర్ నాయకులు. కార్యకర్తలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలోని వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అనగా 2500 మహాలక్ష్మి, 500 గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, 4000 చేయూత, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి పథకాలను ప్రతి వార్డుల్లో నిజమైన నిరుపేదలకు అమలు పరిచ్చే విధంగా కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేయాలని అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మారీనా రాష్టంలో అధికారుల తీరు మారలేదని ఇతర పార్టీ నాయకుల కనుసైగల్లో పని చేస్తు ప్రజలను మభ్యపెడుతున్నారని, ఆ నాయకులతో కలిసి ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చెయ్యడం సరికాదని అగ్రహాం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ఎలాంటి అవకతవకలు లేవని, సరైన విధి విధానంలో ప్రజలకు వారధులుగా అధికారులు పని చెయ్యాలని వారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత–శివకుమార్ గౌడ్, మాజీ సర్పంచ్, మాజీ వార్డ్ మెంబర్ జెమ్మి దేవేందర్, పాక్స్ డైరెక్టర్ నరేందర్, మాజీ వార్డ్ మెంబర్లు కావాలి గోపాల్, సన్న శ్రీనివాస్. మాజీ కోప్షన్ మెంబెర్ ఇబ్రహీం, నాయకులు సుదర్శన్ రెడ్డి, మోహన్ రెడ్డి, నాగరాజ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీతో ప్రజల ప్రాణాలకు ముప్పు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నిర్మించబోయే ఆదాని అంబుజా కాలుష్య కారక సిమెంట్ ఫ్యాక్టరీకి రామన్నపేట మండల ప్రజానీకం సుముఖంగా లేరని, ఎట్టి పరిస్థితుల్లో ప్రజాభీష్టాన్ని కాదని ప్రభుత్వం ముందడుగు వేయొద్దని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోలు రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అయన మీడియాతో మాట్లాడుతూ రామన్నపేటలో డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు ఏర్పాటు పేరుతో రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చి, వారిని మోసగించి, 360 ఎకరాలు సేకరించి గుట్టుచప్పుడు కాకుండా ఇప్పుడు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామనడం సమంజసం కాదని ఆయన అన్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు చుట్టుపక్కల గ్రామాల చెరువుల నీటిని తీసుకుంటామని సంస్థ తెలపడం విడ్డురంగా ఉందని, ఓవైపు ధర్మారెడ్డి పల్లి కాలువ పూర్తిస్థాయిలో కంపెని సరిహద్దుల్లోకి వెళ్లిందని రామన్నపేట దిగువ మండలాలైన చిట్యాల, నార్కట్పల్లి చెరువులకు ధర్మారెడ్డిపల్లి కాలువ నీరు ప్రశ్నార్థకంగా మారునున్నదని, సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే పాడిపంటలకు తీవ్రనష్టం జరిగి రైతులు నష్టపోతారని, పశుగ్రాసం కూడా దొరికే అవకాశం ఉండదని, మండలంలో వేలసంఖ్యలో వృత్తిదారులైన చేనేత పరిశ్రమకు తీవ్ర నష్టం జరుగనున్నదని, ప్రజారోగ్యం పూర్తిస్థాయిలో దెబ్బతిని ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ పరిశ్రమను సైతం అంగీకరించబోమని అయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చి బోగస్ కంపెని పేరుతో భూములు సేకరించిన విషయంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి సిమెంట్ పరిశ్రమకు అనుమతులు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు.

## యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



**విశ్వంభర, వెల్దండ:** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిం చాలని వెల్దండ మండల కాంగ్రె స్ సీనియర్ నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో గురువారం ఏజీ రేడియం వర్క్ డిజైనర్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ యువత ఎవరిపై ఆధారప డకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆయా రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని అన్నారు. షాపు యజమాని యాదగిరి కుటుంబ సభ్యులు లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సిమ్మల తిరుపతిరెడ్డి, గుద్దటి ప్రభాకర్, శ్రీను, అన్యపు రామస్వామి, గరుసు పెంటయ్య, గుద్దటి కిష్టాలు, విష్ణు గౌడ్, మట్ట శివ, పుట్ట శివ, మల్లయ్య, చరణ్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికుదురు మండలం ఎస్బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న భవనం నందు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రములో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం, బంగారు తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మురళీ నాయక్‌కి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్ పీ పీ లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నెల్లికుదురు మండలం మహిళా నాయకులు, యూత్ నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు కాంగ్రెస్ పాల్గొన్నారు.



**కాంగార్ యూనియన్ అధ్యక్షులు శ్రీ మొగుళ్ళ రాజి రెడ్డి, యూనియన్ కార్యవర్గ సభ్యులు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని కలసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వ హెల్త్ కార్డ్స్, పెండింగ్లో ఉన్న ప్రొమోషన్స్ గురించి అశోక్ రెడ్డి వివరించారు. సానుకూలంగా స్పందించిన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. (విశ్వంభర, హైదరాబాద్)**

## గౌడన్నలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే కసిరెడ్డి



**విశ్వంభర, గడ్డి అన్నారం:** కల్వకుర్తి నియోజకవర్గ గౌడ యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యా దపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గౌడ జనాభా, కల్లు గీత కార్మికులు అధికంగా ఉన్నరని, లైసెన్స్ లేని వారందరికి లైసెన్స్‌లు అందజేయాలని, అలాగే కాట మయ్య రక్ష కిట్స్ రాని ప్రతి గీత వృత్తి దారునికి కిట్టు అందించాలని వినతిపత్రంలో కోరామని గౌడ యువజనసంఘం నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఎల్లవేళలా ప్రభుత్వం నుండి నానుండి సహకారాలు తప్పకుండా ఉంటా యని తెలిపారని వాం˘న్నారు. పీ ఎస్ సీ ఎస్ డైరెక్ట ర్, గౌడ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పుల జగన్ గౌడ్, పాలకుర్ల కరుణాకర్ గౌడ్, గజ్జ సత్యం గౌడ్, ఎరుకల శివ గౌడ్, జెల్ల రమేష్ గౌడ్, చుక్క వెంకటయ్య గౌడ్ ఉన్నారు.

# సదరం క్యాంపులకు డాక్టర్లు అందుబాటులో ఉండాలి

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, సాంఘిక సంక్షేమ హాస్టల్స్, సదరం క్యాంపుల నిర్వాహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపల్స్ నిత్యం పిల్లలను గమనిస్తూ ఉండాలని, వారికి కావాల్సిన వసతులు నిరంతర విద్యుత్ సరఫరా, రుచికరమైన భోజనం, హ్లాదకరమైన క్లాస్ రూములు, త్రాగునీరు సరఫరా కల్పించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పండగ సెలవులు ముగిసినందున విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరవుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్లో మైనర్, మేజర్, మీడియం, పనులు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని, నిత్యం పరిశుభ్రత పాటించాలని, వంట చేసే వారు, సానిటేషన్ పనులు చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, సూచించారు. షెడ్యూలు ప్రకారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి యొక్క వైద్య నివేదికను తయారు చేయాలన్నారు. వసతి గృహాల నిర్వహణ తనిఖీలపై జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని వారు షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించి నివేదికను సమర్పించి ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టల్‌లో మానసిక వికాసం కోసం ప్రత్యేక కౌన్సిలర్ ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ కౌన్సిలింగ్ నిర్వహించాలని, తద్వారా పిల్లలు మంచి అలవాట్లకు దగ్గరవుతారని తెలిపారు. పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించి వారి నుండి తగిన సూచనలు సలహాలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల సౌకర్యార్థం ప్రభుత్వ సూచనల మేరకు సదరం క్యాంపులు నిర్వహించాలని సంబంధిత విభాగం డాక్టర్లను అందుబాటులో ఉంచి స్లాట్ బుకింగ్ తదితర అంశాలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలో చదువుకుంటున్న పిల్లల యొక్క ఆరోగ్య పరిస్థితులను గమనిస్తూ ఉండాలని కంటిచూపు లోపం కలిగిన పిల్లలకు సదరన్ క్యాంపులలో చూపించాలన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, సానిటేషన్, తదితర ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ పీడీ మధుసూదన్ రాజు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురలీధర్, డాక్టర్ శ్రీనివాస్, డీఈవో, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని నర్మద, వసతి గృహాల ప్రిన్సిపల్ సంబంధిత సిబ్బంది ఉన్నారు.



## కలెక్టర్‌కు వినతిపత్రం



**విశ్వంభర, రామన్నపేట:** సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలో నిర్మిస్తున్న అంబుజా సిమెంట్ పరిశ్రమ అనుమతిని నిరాకరించాలని, ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని, రైతులు పండించిన దొడ్డు రకం వరి ధాన్యానికి బోనస్ 500 రూపాయలు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసి కొనుగోలు వేగవంతం చేయాలని అభ్యర్దిస్తూ, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాయ కృష్ణ, సీపీఎం నాయకులు గడ్డం వెంకటేష్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బోడ భాగ్య పాల్గొన్నారు.


# సీఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధికి కేటాయించాలి

### కలెక్టర్ వల్లూరి క్రాంతిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్

**విశ్వంభర, పటాన్‌చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల నుండి కేటాయించబడిన సీఎస్ఆర్ నిధులను స్థానిక గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరి క్రాంతితో ఎమ్మెల్యే జీఎంఆర్ కలిసి పలు అంశాలపై విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ప్రధానంగా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్ చేరు మండలాల పరిధిలో గల వందలాది పరిశ్రమలు తమ లాభాల్లో కొంత భాగాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కి కేటాయించి, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నిధులను స్థానిక అభివృద్ధికి కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కేటాయించడం మూలంగా, పరిశ్రమలు భూములకు అందించే కాలుష్యం మూలంగా ఇబ్బంది పడుతున్న స్థానిక గ్రామాల ప్రజలు అభివృద్ధికి దూరం అవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పరిశ్రమలు నెలకొల్పిన గ్రామాల పరిధిలోనే సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో



అభివృద్ధి పనులు చేపట్టి బిల్లులు రాక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నూతన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



దీపావళి సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం ట్రస్టీ శశికళ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆలయానికి ఆహ్వానించారు. కర్మన్ ఘాట్ ఆలయ మాజీ ధర్మకర్త మధు సాగర్ తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, ఎల్బీనగర్)

## నేడు వాహనాల వేలం

విశ్వంభర, ఎల్బీనగర్: వివిధ కారణాలతో పలు కేసుల్లో స్వాధీన పరుచుకున్న 4 మోటా ర్ కార్స్ వాహనాలను శుక్రవారం నాడు వేలం సరూర్ నగర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ నందు రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో ఉంటుందని సరూర్నగర్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వేలం పాట నందు పాల్గొనగలరు అని విజ్ఞప్తి చేశారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాలు, మారుమూల ప్రాంతాలలో గురువారం తెల్లవారుజామున నుండి గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామస్థులకు గుడుంబా వలన జరిగే నష్టాల గురించి, వాటితో పాటు కొత్త చట్టాలు, సైబర్ నేరాలు, ఆన్లైన్, ఆర్థిక మోసాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, కఠిన శిక్షల పైన మహబూబాబాద్ జిల్లా పోలీసులు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ దాడులలో జిల్లా పరిధిలో మొత్తం 338 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, 610 కేజీల నల్ల బెల్లం, 5,840 లీటర్ల బెల్లం, చెక్కర పానకాన్ని ధ్వంసం చేసి 33 మందిపై కేసులు నమోదు చేశారని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో డీఎస్పీలు, సీఐలు, ఎస్.ఐలు సిబ్బంది కలిపి 155 మంది పోలీసులు పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో గుడుంబా స్తావరాలపై అలుపెరగని యుద్ధం ప్రకటించామని, ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# సాయిబాబా మందిరంలో మాజీ కార్పోరేటర్ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన సద్గురు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి.ఈ సందర్భంగా సమర్థ సద్గురు సాయిబాబా మందిరానికి తమ స్వంత స్థలాన్ని విరాళంగా అందించిన బండపల్లి రీతా(అమల) సంతోష్ లని, బండపల్లి కుటుంబ సభ్యులను అభినందించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్వంత స్థలాన్ని మందిరానికి ఇవ్వడాన్ని అభినందించారు. గతంలో భూకబ్జాదారుల నుండి ఈ స్థలాన్ని కాపాడటంలో మాజీ కార్పోరేటర్ సురేఖ, స్థల యజమానులు, గ్రీన్ హిల్స్ కాలనీ అసోసియేషన్ వారు కృషి చేశారు. ఈ ప్రదేశంలో ఇంత మంచి మందిర నిర్మాణానికి దోహద పడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర (హైటెక్ రామ్), బండపల్లి కృష్ణ రావ్, దేవాలయ ఛైర్మెన్ దయాకర్ రెడ్డి, రవీందర్ సింగ్, ముప్పిడి లింగ స్వామి గౌడ్,రఘువీర్ రెడ్డి(రిటైర్డ్ న్యాయమూర్తి), సుదర్శన్ రెడ్డి, సురేష్, విజయ్, లక్ష్మి, పద్మజ, రమేష్, నాగేశ్వర్ రావ్, సహస్ర, సుధ, సౌమ్య, మనీష్, వరుణ్‌తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకలలో పాల్గొన్న గోలి శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టిఇప్పల పల్లి గ్రామంలో ఆదికవి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ హాజరై వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రేణురెడ్డి, మండల కృష్ణయ్య నూతనంగా ఏర్పాటు చేసిన భవాని రియల్ ఎస్టేట్స్ కార్యాలయాన్ని సందర్శించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జల మహేష్, మండల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప్ప సర్పంచ్ స్వామి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎదుల రాజు, నాయకులు మండల కృష్ణయ్య, రేణు రెడ్డి,గుజ్జుల మహేష్, రాజేందర్, అశోక్, శ్రీను, మచ్చేంధర్, అనంత రాములు, రమేష్, అంజయ్య,రాజు,రమేష్,శేఖర్,జీవ పాల్గొన్నారు.

## సీఆర్ఆర్ నిధులు రూ. కోటి మంజూరు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామం నుంచి కొత్తగూడెం గ్రామం వరకు సి.ఆర్.ఆర్ నిధులు కోటి రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. నిధులు మంజూరు కారణంగా రోడ్డు సర్వే నిర్వహించడం జరిగినదని రామన్నపేట డి.ఈ ఏ.శ్రీనివాస్ తెలిపినారు. సి.ఆర్.ఆర్ నిధులు మంజూరు పట్ల రెండు గ్రామాల ప్రజలు హర్షం వెలిబుచ్చారు. ఏఈ బి. గాలయ్య వర్క్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదుర్గా మాత విగ్రహ ప్రతిష్టాపన




**విశ్వంభర, పటాన్‌చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని భ్రమరాంబిక కాలనీలో శ్రీ కనకదుర్గ మాత ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి అమీన్ పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కనకదుర్గ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందారం రమేష్ గౌడ్, బోయిని బాలరాజ్, బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఇంద్రేశం జ్ఞానేశ్వర్, లింగం గౌడ్, భాస్కర్ రెడ్డి, సుధాకర్, దండు జ్ఞానేశ్వర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల రైతు భరోసా ప్రకటన పట్ల హర్షం



**విశ్వంభర, కడ్తాల్:** రైతు భరోసాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనకు కర్తాల్ మండల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర సేవాలాల్ సేన కార్యదర్శి లక్పతి నాయక్ హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రైతులకు శుభవార్త చెప్పారు. త్వరలోనే రైతు భరోసా రూ.7,500 ఇస్తామని త్వరలో బ్యాంకులో జమ అవుతుందని, ఈ నెలాఖరులోగా రూ.2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ కూడా పూర్తి చేస్తామని, వచ్చే నెల నుంచి రూ.2లక్షల పైబడి ఉన్నవారికి మాఫీ చేస్తామని శుభవార్త చెప్పినందుకు కడ్తాల్ మండల ప్రజల తరపున తుమ్మల నాగేశ్వరరావుకు లక్పతి నాయక్ ధన్యవాదాలు తెలియజేశారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను తప్పకుండా అమలు చేసి చూపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**వర్కింగ్ జర్నలిస్టులతో జాగ్రత్త : సుప్రీంకోర్టు, జర్నలిస్టులను కొట్టినా తిట్టినా రూ.50వేలు జరిమానా, 5 ఏళ్లు జైలు శిక్ష, సుప్రీంకోర్టు తీర్పుపై పలు జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. (విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం)**



# ఇండ్ల కూల్చివేతలపై భయాందోళనలు పడొద్దు

### కార్పొరేటర్ రంగ నరసింహ గుప్త



**విశ్వంభర, ఎల్బీనగర్:** చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసి పరివాహక ప్రాంత ప్రజలు ఇండ్ల కూల్చివేతలపై ఎలాంటి భయాందోళనలు పడవద్దని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా అన్నారు. మూసి పరీవాహక ప్రాంతం లో పర్యటించి మరిఒకసారి వారికీ భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. మూసి ఇండ్ల కూల్చివేత విషయంలో బయాఆందోళన లకు లోనై హాస్పిటల్ పాలైన లక్ష్మమ్మ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన సందర్భంగా పరామర్శించారు. అందరిని పలకరించి ధైర్యం చెప్పడం జరిగింది అని తెలిపారు.అక్కడి ప్రజలు స్టే తీసుకున్న విషయాన్ని పెద్దగా వ్రాయంచిన ఫ్లెక్సీ లును తమ ఇంటి కి కట్టుకున్నారు.

# సమస్యల పరిష్కారానికి సహకరించాలి

### బీహెచ్ఈఎల్ ఉన్నతాధికారులను కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం రామచంద్రాపురం ప్రజల సమస్యల పరిష్కారం,అభివృద్ధి పనుల విషయంలో సంపూర్ణ సహకారం అందించాలని బీహెచ్ఈఎల్ పరిశ్రమ ఉన్నతాధికారులకు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం బీహెచ్ఈఎల్ పరిశ్రమ ఈడి భరణి రాజాతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంలో బీహెచ్ఈఎల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఈడి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని ఎం ఐ జీ 2 పరిధిలో అంతర్గత మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు, ఎం ఐ జీ 2 ముఖ ద్వారం నుండి అన్నమయ్య కాలనీ మీదుగా బిమ్యాక్ వరకు గల రహదారిని మూసివేశారని వెంటనే ప్రారంభించాలని, అంతర్గత రహదారుల మరమ్మత్తు పనులకు అనుమతించాలని కోరారు. ఎస్టేట్ అధికారుల అభ్యంతరాల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు, అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన బెల్ ఈడీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

## గీతం ఛేంజ్ మేకర్స్‌లో పిలుపు నిచ్చిన కొల్లం ఎంపీ ఎన్.కె. ప్రేమచంద్రన్



**విశ్వంభర, పటాన్ చెరు:** జాతి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, రాజకీయాలను యువత సీరియస్ గా తీసుకోవాలని కొల్లం లోక్ సభ సభ్యుడు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్.కె. ప్రేమచంద్రన్ పిలుపునిచ్చారు. చేంజ్ మేకర్స్ పేరిట హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరివర్తన కార్యక్రమాలపై దృష్టి సారించి, నాయకత్వం, భారతదేశ భవిష్యత్తుపై తనకున్న లోతైన అవగాహనను గీతం విద్యార్థులతో పంచుకున్నారు. జాతి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, రాజకీయ వ్యవహారాల పట్ల యువత విముఖత చూపడం సరికాదన్నారు. రాజకీయ, పార్లమెంటరీ విషయాలలో వారికి అవగాహన కల్పించడం అవశ్యమని, అటువంటి చొరవ ఫలవంతమైన ఫలితాలను ఇస్తుందని, అంతిమంగా జాతి శ్రేయస్సు కోసం పార్లమెంటరీ, రాజకీయ వ్యవస్థలను బలోపేతం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. చర్చల ఆధారంగా పార్లమెంటులో ప్రైవేటు సభ్యుల తీర్మానం ప్రభుత్వ విధానాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరిస్తూ, తన స్వీయ అనుభవాన్ని ప్రేమచంద్రన్పంచుకున్నారు. రాజకీయ సంకల్పం, పట్టుదల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, పార్టీ బలంతో సంబంధం లేకుండా ప్రభావవంతమైన మార్పును సాధించవచ్చని పేర్కొన్నారు. వార్డు సభ్యుని స్థాయి నుంచి, ఎమ్మెల్యే, మంత్రిగా, ఐదుసార్లు ఎంపీగా తన మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ప్రేమచంద్రన్ తన విజయానికి కృషి, అంకితభావమే కారణమన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉండటం, వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఉండటం తప్పనిసరని, ఇది వారి గుర్తింపు, మద్దతును సంపాదించడానికి కీలకమన్నారు. పార్లమెంటు సభ్యునిగా తన రోజువారీ కార్యకలాపాలపై మాట్లాడుతూ, పార్లమెంటరీ ప్రసంగాల కోసం సమగ్ర పరిశోధన, వాటి తయారీ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. రాజకీయాలను సీరియస్ గా తీసుకోవాలని యువతరాన్ని ప్రోత్సహిస్తూ, అంకితభావంతో వారు గణనీయమైన ప్రభావాన్ని చూపగలరన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పర్యావరణ సమస్యలను, ముఖ్యంగా వాయనాడ్ కొండచరియలు విరిగిపడటం, పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ యొక్క తక్షణ అవసరాన్ని ప్రేమచంద్రన్ నొక్కి చెప్పారు. రాజకీయ కార్యనిర్వాహకులు అభివృద్ధి పేరుతో పర్యావరణ సమతుల్యతను విస్మరించడం పట్ల ఆయన నిస్పృహ వ్యక్తం చేశారు. రాజకీయ చర్చల్లో పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యత ఇవ్వాలని భవిష్యత్తు తరాలను కోరారు. కేరళలో తలెత్తిన కోకా-కోలా ప్లాంట్ వివాదంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, పర్యావరణ సమస్యలు పారిశ్రామిక ప్రయోజనాల కోసం తరచుగా రాజీ పడటం, ముఖ్యంగా అట్టడుగు వర్గాలను ప్రభావితం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయాన్ని ఫణంగా పెట్టి అభివృద్ధి చేయడం తగదని, సమతుల్యత పాటించాలని హితవు పలికారు. రాజకీయాల పట్ల యువతరానికి ఉన్న భ్రమలను ప్రస్తావిస్తూ, వారు దేశానికి సేవ చేసే రంగంగా రాజకీయాలను చూడాలని ప్రేమచంద్రన్ కోరారు. ప్రస్తుత ఓటు బ్యాంకు రాజకీయాలపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాజకీయ సంస్కరణల ఆవశ్యకతను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారతదేశంలో కమ్యూనిజం వైఫల్యం గురించి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ, చారిత్రక అవలోకనాన్ని ప్రేమచంద్రన్ అందించారు. ఈ ఉద్యమం భారతదేశ ప్రత్యేక రాజకీయ, సామాజిక, భౌగోళిక సందర్భాన్ని తగినంతగా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మనదేశ చరిత్రలో (క్విట్ ఇండియా ఉద్యమం) కీలక ఘట్టాలలో ప్రధాన స్రవంతి జాతీయ రాజకీయాల నుంచి కమ్యూనిజం వేరుపడడం, దాని ప్రాభవాన్నికోల్పోవడానికి దారితీసిందన్నారు. కృత్రిమ మేధస్సు, సమాచార సాంకేతికత పెరుగుదలతో సహా మారుతున్న ప్రపంచ దృశ్యానికి అనుగుణంగా మారడంలో కమ్యూనిజం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డీ.ఆర్.పీ. చంద్రశేఖర్ సమన్వయంగా చేయగా, గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్ వందన సమర్పణ చేశారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావుతో కలిసి ఆయన అతిథిని సత్కరించారు. కేరళలోని అత్యంత నిజాయితీ గల నాయకులలో ప్రేమచంద్రన్ ఒకరని శ్రీభరత్ కొనియాడారు. ఆయన సుదీర్ఘ సేవ, రాజకీయ వర్గాలలో ఆయనకు లభిస్తున్న గౌరవాలను ఎత్తిచూపారు. విలువైన విషయాలను గీతం విద్యార్థులతో పంచుకోవడానికి సమయం ఇచ్చిన ప్రేమచంద్రన్ కు శ్రీభరత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం శంకర కొండ తండాకు చెందిన నేనావత్ శ్రీకాంత్ కాన్పూర్ లో ఐఐటీ సీటు సాధించారు. మొదటి సెమిస్టర్ పూర్తిచేసుకుని రెండో సెమిస్టర్ కు ఫీజు చెల్లించ లేక ఇబ్బంది పడుతున్నాడని ప్రముఖ అనన్య రియల్ ఏస్టేట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మండ్లీ రాములు తెలుసుకుని శ్రీకాంత్ కుటుంబ సభ్యులను తన కార్యాలయంలో కలిసి తన వంతుగా 40 వేల రుపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందని తెలియజేశారు. ఆమనగల్లు పట్టణ అధ్యక్షులు వస్సుల మనయ్య, అంజనేయులు, పత్య, రాజారెడ్డి, జగ్గురామ్, చంద్రునాయక్ పాల్గొన్నారు.

# ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి షావ ఊరేగింపు



**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని సాయిరాం నగర్ కాలనీ ఫేస్ 1లో కాలనీ అధ్యక్షులు రాకేష్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి షావా ఊరేగింపులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఇటీవల సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన యావత్ హిందూ సమాజాన్ని కలిచివేసిందని, ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం ఒక వర్గానికి కొమ్ము కాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాలలోకి వచ్చారు రేపు మన ఇంట్లోకి కూడా చొరబడతారు, హిందువులంతా సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైందని, అమ్మవారికి శాంతి జరిగేలా ఈ శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని అమ్మవారి ఆలయాలలో ఆడపడుచులు, అన్నదమ్ములు హిందూ బంధువులు అందరూ కలిసి మహా శాంతి హారతి నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ప్రధాన పూజారి నరసింహ, కాలనీవాసులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయాలి

## సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం కోరారు. గురువారం ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ల గ్రామం మార్కెట్ యార్డులో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వరి ధాన్యాన్ని తీసుకువచ్చి మార్కెట్ యార్డులో పోశారని వర్షాలు వస్తుండడంతో రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన వరి ధాన్యం మార్కెట్ యార్డులో తడిసి రైతు నష్టపోయే అవకాశం ఉందని గతంలోనే వర్షాలు పడి ధాన్యం తడవడంతో రైతులు ఆ ధాన్యాన్ని అమ్మడం కోసం అనేక ఇబ్బందులు పడి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకనే ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు తక్షణమే ప్రారంభించి కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మాది రైతు ప్రభుత్వం అని అనేక మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు సన్న ధాన్యానికి మాత్రమే 500 రూపాయలు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరైనది కాదని దీని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని రైతు పండించిన ప్రతి గింజ వరి దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేస్తున్న సందర్భంలో ఎక్కడ కూడా రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు చేసే సందర్భంలో రైతులకు కోత విధించకుండా సరైన ధరను ఇస్తూ క్వింటాలుకు ధాన్యాన్ని ఏమాత్రం తరుగు తీసేయకుండా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ మర్రిపల్లి మల్లయ్య, భాష బోయిన బుగ్గయ్య, మారుపాక సత్తయ్య, ఆవనగంటి సోమయ్య, బండ బీరయ్య, నిమ్మనగోటి మల్లయ్య, కూరెళ్ళ నాగయ్య, మారుపాక ఉప్పలయ్య పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

## రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలు..!

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతోందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ్య దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడుతాయని ఐఎండీ అంచనా వేసింది.

# విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎంపీ కొండా



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి శ్రీ విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో హాజరై ఇద్దరు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శ్రీరాములు హాస్పటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ బరిగల హేమలత రాజు గౌడ్, స్థానిక కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, రాజమోని రాజు ముదిరాజ్, జపాల భావన సుధాకర్, బాకీ విలాస్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, శ్రీధర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షులు బరిగల రాకేష్ గౌడ్, లవకుమార్, బాలరాజ్ పాల్గొన్నారు.

# సీఐని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్ హెచ్ ఓగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సోలోమన్ రాజుని బీఆర్ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, బీ ఆర్ ఎస్ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్, మాజీ రైతు బంధు జిల్లా డైరెక్టర్ కోరే భిక్షపతి, బీఆర్ఎస్ పల్లెర్ల గ్రామశాఖ అధ్యక్షులు సామా నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ యువజన విభాగం కార్యదర్శి జెన్నపాల శేఖర్, పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే

**విశ్వంభర, భూపాలపల్లి:** విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు , సింగరేణి జి.యం, వైద్య కళాశాల కాంట్రాక్టర్ లతో , ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.వైద్య కళాశాల లో 120 మంది బాలికలు, 80 మంది బాలురు చదువుతున్నారని సింగరేణి అధికారులతో మాట్లాడి అదనంగా రామప్ప కాలనిలో ఒక బ్లాక్, 14 క్వార్టర్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి వైద్య కళాశాల భవన నిర్మానికి పెండింగ్లో ఉన్న బకాయిలను ఇప్పిస్తామని అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాన్ని సంవత్సరం కాలంలో పూర్తి చేయిస్తామని అన్నారు.రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులకు అవసరమయ్యే ప్రాక్టికల్ ల్యాబ్, లెక్చర్ల హాల్ ను 20 రోజులలో అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. విద్యార్థులు కళాశాల నుండి జిల్లా ఆసుపత్రికి వెళ్ళడానికి 2 బస్సులు ఏర్పాటు చేస్తామని ఈ నెల 21 నుండి రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం తరుపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు పూర్తి కాగానే క్లాసులు ప్రారంభించాలని విద్య కళాశాల ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం రామప్ప కాలనిలో మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం కేటాయించిన క్వార్టర్ల ను సింగరేణి జీయం తో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా ప్రధాన ఆసుపత్రి సుపరిండెంట్ నవీన్ కుమార్, సింగరేణి జీ ఎం హబీబ్ హుస్సేన్, వైద్య కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం నిరుపేదలకు అందాలి




**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన నిరుపేదలకు అందాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్ అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే లతో కలసి అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో నిర్లక్ష్యం జరిగితే అధికారులపై డిసిప్లీనరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని, అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. రుణాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో సబ్సిడీ మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విడతల వారీగా సబ్సిడీ మంజూరు చేయడం వల్ల లబ్ధిదారులకు ఆర్థికభారం అవుతుందని ఆయన తెలిపారు. సకాలంలో సబ్సిడీ జమ కాకపోవడం వల్ల సిబిల్ స్కోర్ తగ్గిపోయి లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ పథకం వల్ల పేదల కుటుంబాలకు మేలు జరుగుతుందని అన్నారు. కోపరేటివ్ లేబర్ సొసైటీలు ఐదు ఉండగా ఒకటి ఎస్సీ, ఒకటి ఎస్టీకి ఉన్నదని, ఎలాంటి కొలెట్రాల్ సెక్యూరిటీ లేకుండా ఎస్సీలకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆయన తెలిపారు. బ్యాంకు రుణాలు మంజూరు చేసేందుకు అన్ని బ్యాంకుల కంట్రోలర్లు చర్యలు తీసుకోవాలని ఎల్డీఎంను ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కులో స్థల కేటాయింపులో ఎస్సీలకు రోస్టర్ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో పేద కుటుంబాలకు చెందిన చిన్నారులు ఉంటారని వారందరికీ పోషకాలతో కూడిన ఆహారం అందించాలని తెలిపారు.మరుగుదొడ్లు లేని ఎస్సీ కుటుంబాలను గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేయాలని, ఆరుబయట మల విసర్జన చేయడం సామాజిక నేరమని ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి వినియోగించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విచారణ పేరుతో కాలయాపన చేయొద్దని ఆయన తెలిపారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదులో ఎలాంటి విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎస్సీ కమిషన్ డిసిప్లీనరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అన్ని శాఖల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు అమలుతీరును సమీక్షించిన ఆయన జిల్లా కలెక్టర్ ను, ఎస్పీ, అధికారులను అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు డా సునీల్ కుమార్ బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మిఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీఓ మంగిలాల్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన మెరుగు కృష్ణ చిన్న కుమారుడు నరేష్ మరణించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ కేహెచ్ఛ్ఆర్ ఫౌండేషన్ సహకారంతో 5000 ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బీ ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షులు ఆత్మకూరు(ఎం)మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, మండల సెక్రెటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్, జిల్లా నాయకులు కోరే బిక్షపతి, సీనియర్ నాయకులు నాతి రాజు గౌడ్, మల్గ బీరయ్య, ఎండీ అజిమోద్దీన్, పాశం శేఖర్, నాతి బిక్షపతి, పొన్నగాని జహంగీర్ గౌడ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల విజయ్ పాల్గొన్నారు.

# బీసీ ఆడబిడ్డపై బ్రహ్మాస్త్రాల ప్రయోగం

## కొండా సురేఖ రాజకీయ జీవితానికి చరమగీతం పాడాలని కుట్రలు ఆమెకు బీసీలు అండగా నిలబడాలి

### బడుగుల ఆడబిడ్డకి అండగా నిలవాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ... ప్రత్యేక తెలంగాణలోనూ రాజకీయాలు పూర్తిగా కొన్ని కులాల ఆధిపత్యం,కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయి.. 50 శాతంపైగా జనాభా ఉన్న బీసీలకు పట్టుమని పది శాతం సీట్లు దక్కడం లేదు. ఇంతటి ప్రతి కూల పరిస్థితుల్లోనూ బీసీ వర్గానికి, అందులోనూ మహిళగా ఉన్న కొండా సురేఖ రాజకీయాల్లో తన దైన పట్టు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు బీసీ వర్గం నుంచి ఏడు సార్లు శాసనసభకు పోటీ చేసిన చరిత్ర కొండా సురేఖకు మినహా మరొకరికి లేదు. అందులో తీవ్ర భావోద్వేగంతో జరిగిన ఒక ఉప ఎన్నిక, మరో సాధారణ ఎన్నిక మినహా అయిదుసార్లు ఆమె గెలుపొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను గుప్పిట పెట్టుకున్న ఓ అగ్రకుల నేతకువ్యతి రేకంగా మడమతిప్పని పోరు చేస్తున్న నాయకు రాలు కొండా సురేఖ ఆమె రాజకీయ పతనానికి ఆ అగ్ర కులం నేత, సినీ జనం ఏకమై సాగిస్తున్న దండయాత్రను బలహీన వర్గాల ప్రజలు తిప్పికొట్టాలి. ఇక్కడ కురుక్షేత్ర నీతిని పాటించాలి. ఆమెతో మనకు ఇబ్బంది ఉంటే కచ్చితంగా ఆమెపై బిసి సంఘాలు పోరు చేయాలి. ఇప్పటికైనా మన మంతా ఐక్యమై, ఈ బలహీనవర్గాల నాయకులు సురేఖ వంటి నేతలందరినీ కాపాడాకోవాల్సిన అవసరం కచ్చితంగా ఉన్నదని గుర్తించాలి.



కొద్ది రోజులుగా అందరి నోళ్లలో నానుతున్న పేరు కొండా సురేఖ. సుమారు 30 ఏళ్ల క్రితమే ఉద్యమాల గడ్డగా పేరొందిన వరంగల్ జిల్లాలోని గ్రామ స్థాయి రాజకీయాల్లో అడుగుపెట్టి నాలుగేళ్లు తిరగక ముందే ఎమ్మెల్యేగా ఎన్నికైన నాయకురాలు.. నిఖార్సైన బీసీ ఆడ బిడ్డ. రాజకీయాల్లో అంత అనుభవం ఉన్న సురేఖను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ స్పాన్సర్డ్ సోషల్ మీడియా చేస్తున్న విష ప్రచారం చేస్తోంది. ఏ అంశంలో అయినా ఎదురుగా నిలిచి పోరాడే తత్వమున్న కొండా సురేఖకు ఈ విష ప్రచారాన్ని హ్యాండిల్ చేయడం ఎలాగో తెలియలేదు. ఇటీవల జరిగిన పరిణామాల వల్ల కొన్ని విషయాలపై నోరుజారింది. తాను అలా మాట్లాడడం పొరపాటని ఆమె గుర్తించే సరికి భారీ నష్టం జరిగిపోయింది. ఆ వెంటనే ఆమె తన మాటలు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. కానీ ఆమె రాజకీయ జీవితాన్ని, ఓ బడుగు మహిళ రాజకీయ జీవితానికి చరమగీతం పాడాలని కాచుకు కూర్చున్న కొందరు ఆమెపై బ్రహ్మాస్త్రాల ప్రయోగం మొదలుపెట్టారు. అంతేగాకుండా ఎంతటి విపత్తులోనూ.. ఎంతటి విషాదంలోనూ నోరు విప్పని సోకాల్డ్ అగ్ర నటుల నుంచి మొదలుకొని క్యారెక్టర్ ఆర్టిస్టుల వరకు విమర్శలు, విసుర్లు, హితవులు పలకడం మొదలుపెట్టారు. అందరూ కొండా సురేఖ మాటలను ఖండించారు. ఏళ్లకు ఏళ్లు సినిమా పరిశ్రమలో ఎన్నో సందర్భాల్లో మహిళా నటులకు అన్యాయం జరిగిన సమయంలోనూ తెరవని నోళ్లు... వినిపించని గళాలు ఇప్పుడు సింహగర్జనలు చేస్తున్నాయి. తొలి నుంచి దూకుడుతో పాటు ఓ వైపు వామపక్ష తీవ్రవాద రాజకీయాలకు.. మరో వైపు అందుకు విరుద్ధమైన పచ్చి మితవాద రాజకీయాలకు కేంద్రమైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ రెండింటికి భిన్నమైన కాంగ్రెస్ నుంచి సురేఖ రాజకీయ ప్రస్థానం మొదలైంది.ప్రజా సేవలో అలుపెరగని ఆవేశానికి మారుపేరుగా సురేఖకు గుర్తింపు ఉంది. కొన్ని సందర్భాల్లో పొరపాట్లు చేయడమనేది సహజం. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న రాజకీయవేత్తలు కూడా కొన్ని సందర్భాల్లో నోరుజారిన సందర్భాలున్నాయి. కానీ, కొండా సురేఖ విషయంలో భూతద్దంలో పెట్టి చూస్తున్నాయి. కొండా సురేఖ ఎంపీటీసీ సభ్యురాలిగా, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలోనే ఎదిగారు. మొదట కాంగ్రెస్ పార్టీలో ఉన్న సురేఖ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్, రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం పదేళ్ల క్రితం ఆమెను పార్టీలోకి ఆహ్వానించి లబ్ధిపొందిన బీఆర్ఎస్ అగ్ర నాయకులు తర్వాత ఆమెకు సముచిత స్థానం ఇవ్వక పోగా కరివేపాకుగా మార్చి ఆమెను మనోవేదనకు గురి చేశారు.ఒక బీసీ మహిళ ఎన్నికల్లో నిలబడి గెలవాలంటే ఎంత కష్టమో రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిందే. అడుగడుగునా పార్టీలో అవమానాలపాలు చేశారు. దాంతో ఆమె అయిదేళ్ల క్రితమే కాంగ్రెస్‌లో చేరారు.ఒకరకంగా చెప్పాలంటే ఆమె చివరకు తిరిగి సొంతగూడు కాంగ్రెస్‌కు చేరుకున్నారు. మొన్నటి ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మహిళలు కొండా సురేఖ, సీతక్కకు మంత్రి పదవులు ఇచ్చారు. వీరిలో ఒకరు బలహీన వర్గాలకు చెందిన వారు కాగా.. మరొకరు గిరిజన మహిళ బలహీనవర్గాల నుంచి మంత్రి పదవి పొందిన మహిళ సురేఖ. ఇప్పుడు సురేఖకు మంత్రి పదవి రావడంతో తెలంగాణ రాజకీయాలను పదేళ్లుగా శాసిస్తున్న బీఆర్ఎస్ పాలక కుటుంబానికి, ఓర్చుకోలేని పరిస్థితి మారింది. ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో ఉమ్మడి మెదక్ జిల్లా పర్యటనకు ఇటీవల కొండా సురేఖ వెళ్లారు.. అక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో స్థానిక ఎంపీ, బీజేపీకి చెందిన రఘునందన్‌రావు పద్మశాలీల కుల ఆచారం ప్రకారం ఆమె మెడలో నూలు దండ వేశారు. సురేఖను అక్కగా పేర్కొంటూ తాను ఆమె తమ్ముడినంటూ ఎంపీ చెప్పారు... అంత మంచి వాతావరణాన్ని సైతం అధినేతల నుంచి ఆదేశాలు రావడమే ఆలస్యం ముందువెనుకా చూడకుండా..బీఆర్ఎస్ స్పాన్సర్డ్ సోషల్ మీడియా అసహ్యకరంగా మార్చివేసింది. అక్కా తమ్ముళ్ల బంధానికి పెడార్థాలు అంటగడుతూ తమ స్పాన్సర్డ్ వికృత సైన్యంతో విపరీతమైన దుష్ప్రచారం చేసింది.. విషాదమేమంటే ఈ వికృత సైన్యంలో అత్యధికులు బడుగు బలహీనవర్గాల వారే కావడం దురదృష్టకరం. కేటీఆర్ పై జన సామాన్యంలో ఉన్న అనేకానేక ఆరోపణలు, విమర్శలను ఏకంగా ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ, కేటీఆర్ తనపై మాట్లాడిన మాటలకి ఆవేశంలో గట్టి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ కి కొంతమంది సినీ పరిశ్రమలో ఉన్నవారితో సంబంధాలపై మాట్లాడారు. అయితే, అవతలి వైపు ఓ సినీ నటి.. ఓ అగ్ర నటుని కుటుంబం ఉండడం.. అన్నింటికి మించి కేటీఆర్‌తో ముడిపడి ఉండడంతో అది రాష్ట్రంలో ఎన్నడూలేనంత రచ్చకు దారి తీసింది.అయితే కొండా సురేఖ, తాను చేసిన వ్యాఖ్యలు పొరపాటని గ్రహించి మంత్రి వెంటనే ప్రకటన విడుదల చేశారు. తన మాటలను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ అటు బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, చోటామోటా లీడర్లు, ఇటు సినీ రంగానికి చెందిన అగ్ర నటుడు మొదలు చిన్నచితకా ఆర్టిస్టుల వరకు సురేఖపై మూకుమ్మడి దాడి చేశారు. మంత్రి సురేఖ క్షమాపణ చెప్పినా ఆమెను లక్ష్యంగా చేసుకొని నిరంతరం దాడులు చేస్తున్నారు. సురేఖ క్షమాపణ చెప్పినందున ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సినిమా నటులకు విజ్ఞప్తి చేశారు. అయినా వారి నుంచి స్పందన కనిపించడం లేదు.. సినిమా నటుల ఈ తరహా ప్రతిస్పందన యావత్ తెలంగాణ సమాజాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఎంతటి విపత్తు సంభవించినా.. రాష్ట్రంలో ఎన్ని ఘోరాలు జరిగినా కడుపులో చల్ల కదలకుండా నిమ్మళంగా ఉండే సినీ నటులు మిన్నువిరిగి మీద పడినట్లు గగ్గోలు పెట్టడం ప్రతి ఒక్కరిని విస్తుగొల్పింది. టిక్కెట్ల ధర, ఇతర విషయాలపై పొరుగు రాష్ట్రం ముఖ్యమంత్రిగా చేసిన నాయకుడు అగ్ర నటుడు మొదలు ముఖ్య సినీ నటులను ఘోరంగా అవమానించినప్పుడు.. అగ్ర కథానాయకుడు పవన్ కళ్యాణ్ మాతృమూర్తిపైనా, ఆయన వ్యక్తిగత జీవితంపైనా పొరుగు రాష్ట్రంలోని నాటి అధికార పక్షం వికృత వ్యాఖ్యలు చేసినప్పుడు సినీ నటులు ఒక్కరంటే ఒక్కరూ పెదవి విప్పలేదు. కొండా సురేఖ విషయంలో మాత్రం అంతా అతి ఎందుకు చేశారు? ఒకప్పుడు ఇదే సినీ నటుడు నాగార్జునను ఆయన గ్రీకు వీరుడు కాదు... గీకుడు వీరుడు అని కేసీఆర్ అన్నప్పుడు ఒక్క సినీ నటుడు నోరు మెదపలేదు ఎందుకో గీకుడు వీరుడు అంటే ఏమిటో నిజంగా సినీ జనానికి తెలియదా లేక గీకుడు ముచ్చట నిజమేనని అంగీకరించారా అదే నాగార్జున ఎన్ కన్వెన్షన్ అక్రమ కట్టడమంటూ కేసీఆర్ హయాంలో దానిపైకి బుల్డోజర్లు పంపారు. తర్వాత సర్దుకున్నారు.. ఆ సర్దుబాటు వెనుక రహస్యం ఏమిటి..? ఇప్పుడు మాత్రమే సినీ నటులు చెలరేగిపోవడానికి కారణమేమిటో వారు చెప్పాలి.



మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,
సెల్: 9550844433

# హయత్‌నగర్, వనస్థలిపురంలో జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు

### ప్రజల అవస్థలు తీర్చేందుకు అధికారుల ప్రణాళికలు




**విశ్వంభర, హైదరాబాద్:** జాతీయ రహదారుల సంస్థ ఎన్‌హెచ్-65పై చేపట్టిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం స్థానికులను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కోటి జనాభా ఉన్న నగరంలో 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తుండటంతో.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల మధ్య గోడ కట్టినట్లయింది. రహదారికి రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయడంతో రోడ్డు దాటేందుకు ఉద్యోగులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సిటీ బస్సు ఎక్కాలన్నా, దిగాక కాలనీ రోడ్డుకు చేరుకోవాలన్నా కి.మీ. మేర నడవాల్సి వస్తోంది. ఇల్లు ఓ వైపు, పాఠశాల మరో వైపుంటే.. పిల్లలను తీసుకెళ్లడం తల్లిదండ్రులకు కత్తిమీద సాములా మారింది. పాత కల్వర్టులు విస్తరించకపోవడం, కాలనీ రోడ్లకు పదడుగుల ఎత్తున ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, కనుచూపు మేరలో యూటర్న్‌లు లేకపోవడం వంటి సమస్యలతో ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవు తుండటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భాగ్యలత కమాన్ సమీపంలో, లెక్చరర్స్ కాలనీ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసేందుకు గురువారం సాయంత్రం సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ నవీన్‌రెడ్డి, సీఐలు గట్టు మల్లు, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారులు.. జాతీయ రహదారి నిర్మాణ సంస్థ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ కమిటీ ప్రతినిధులు, స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ .. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు సమాచారం.

## రాజమహేంద్రవరం జైలుకు బోరుగడ్డ అనిల్



**విశ్వంభర, గుంటూరు:** రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అరెస్టు చేసిన పోలీసులు గురువారం కోర్టులో హాజరుపర్చారు. అనిల్‌కు ఈ నెల 29 వరకు రిమాండ్ విధిస్తూ ఐదో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అతన్ని రాజమహేంద్రవరం కారాగారానికి తరలించారు.. 2021లో కర్లపూడి బాబుప్రకాష్‌ను రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

## విశాఖలో బెట్టింగ్ యాప్ ముఠా గుట్టు రట్టు



**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖలో బెట్టింగ్ యాప్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశాఖ కేంద్రంగా బెట్టింగ్ యాప్ నిర్వహిస్తు న్నట్టు సమాచారం తెలుసుకున్న పోలీసులు సోదాలు నిర్వహించి.. వందల సంఖ్యలో డెబిట్ కార్డులు, చెక్ బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ నుంచి వచ్చిన సమాచారంతో విచారణ చేపట్టామని విశాఖ సీపీ తెలిపారు. సైబర్ నేరస్థులకు చైనాతో సంబంధాలున్నాయని, రకరకాల పేర్లతో బెట్టింగ్ యాప్‌లు నిర్వహిస్తున్నారని వివరించారు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా ఈ ముఠా యాప్ నిర్విస్తోందన్నారు. బెట్టింగ్ యాప్ సొమ్మును చైనా, తైవాన్‌కు పంపుతున్నట్టు దర్యాప్తులో గుర్తించామన్నారు. నిందితుల నుంచి 10 ల్యాప్‌టాప్‌లు, 8 డెస్క్‌టాప్‌లు, కారు, బైక్, 800 చెక్‌బుక్‌లు, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పా.

## భూ సర్వేలో లోపాలున్నాయి: మంత్రి అనగాని



**విశ్వంభర, అమరావతి:** గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూ సర్వేలో లోపాలున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు కేంద్ర భూ వనరుల శాఖ కార్యదర్శి మనోజ్ జోషికి వివరించారు. వీటన్నింటినీ సవరించి భూ రికార్డులను సరి చేస్తున్నామని తెలిపారు. మంత్రి అనగాని, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సర్వే సెటిల్మెంట్స్ డైరెక్టర్ శ్రీకేష్ బాలాజీతో కేంద్ర కార్యదర్శి మనోజ్ జోషి సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన భూ రీసర్వే, భూ రికార్డుల డిజిటలీకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించే అంశంపై మనోజ్ జోషి కొన్ని సూచనలు చేశారు. మరోవైపు రీసర్వే ప్రక్రియతో పాటు భూ రికార్డుల డిజిటలీకరణ కోసం కేంద్రం విడుదల చేసిన నిధులకు అదనంగా అవసరం అవుతాయని మంత్రి తెలిపారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

### రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలు..!

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతోందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ్య దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడుతాయని ఐఎండీ అంచనా వేసింది.

## ట్రాన్స్‌జెండర్‌తో ప్రేమ వివాహం!

### రెండేళ్లు ప్రేమించి,,, కుటుంబసభ్యులను ఒప్పించి ఒక్కటైన జంట

### జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లో ఘటన



**విశ్వంభర, జగిత్యాల:** ఒక ట్రాన్స్ జెండర్‌ను ప్రేమించడమే కాకుండా.. తన కుటుంబ సభ్యులను ఒప్పించి మరీ వారందరి సమక్షంలో వివాహం చేసుకున్నయువకుడి గాథ ఇది. సాధారణంగా ట్రాన్స్?జెండర్?తో పెళ్లి అంటే ఏ కుటుంబ సభ్యులైనా ఒప్పుకోరు. కానీ ఈ అబ్బాయి కుటుంబసభ్యులు మాత్రం కుమారుడి ఇష్టాన్ని గౌరవించి, అతడి మనసుకు నచ్చిన వ్యక్తి(ట్రాన్స్?జెండర్?)ని ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. ఈ పెళ్లికి జగిత్యాల జిల్లా వేదికైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్? గ్రామానికి చెందిన శ్రీనివాస మల్యాల, అదే మండలానికి చెందిన మ్యాడంపల్లికి చెందిన ట్రాన్స్?జెండర్? కరుణాంజలిని వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి చివరికి వివాహం వరకు దారి తీసింది. అయితే ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిపోయిన శ్రీనివాస్?, అక్కడి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తన కుటుంబ సభ్యులకు ప్రేమ వ్యవహారం చెప్పాడు.ట్రాన్స్?జెండర్?ను చేసుకోవడం ఏంటని తొలుత కుటుంబ సభ్యులు ప్రశ్నించగా, వారికి సర్ది చెప్పి కుటుంబ సభ్యులను ఒప్పించాడు. దీంతో వారిద్దరి పెళ్లికి అడ్డంకులన్నీ తొలగినట్లైంది. యువకుడి కుటుంబసభ్యులు, ట్రాన్స్?జెండర్ల సమక్షంలో వీరి వివాహం వైభవంగా జరిగింది. సాధారణ వివాహం ఎలా జరుగుతుందో, వీరికీ అదే రీతిలో, అంతే ఘనంగా పెళ్లి జరిపించారు. అంతా సంతోషంగా వివాహ వేడుకను జరిపించారు. పెళ్లి సందర్భంగా ఊరేగింపులో ట్రాన్స్?జెండర్లు నృత్యాలు చేస్తూ అందరినీ అలరించారు.

## 'దయచేసి.. నా తండ్రి హత్యను రాజకీయం చేయకండి'



**ముంబయి:** ఎన్సీపీ (అజిత్ పవార్ పక్షం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్యకు గురికావడం రాజకీయంగా సంచలనం సృష్టిస్తోంది. తన తండ్రి హత్యపై సిద్ధిఖీ తనయుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్ధిఖీ తొలిసారి స్పందించారు. తమ కుటుంబానికి న్యాయం కావాలని.. ఈ విషయాన్ని రాజకీయం చేయొద్దంటూ విజ్ఞప్తి చేశారు. "నా తండ్రి ప్రజలను కాపాడుతూ ప్రాణాలు కోల్పోయారు. పేదల గృహాల నిర్మాణం కోసం పోరాడారు. ఆయన మరణంతో మా కుటుంబంలో తీవ్ర విషాదం నిండుకుంది. మాకు న్యాయం చేకూర్చండి. దయచేసి నా తండ్రి హత్యను రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను" అని జీషన్ సిద్ధిఖీ అభ్యర్థించారు. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు బాబా సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు.ఆయనను హత్య చేసింది తామేనని ఇప్పటికే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. బాబా సిద్ధిఖీ హత్యకు నిందితులు వరుసగా 10సార్లు ప్రయత్నించారని విచారణలో వెల్లడైంది.

## హైదరాబాద్‌లో పలుచోట్ల ఐటీ సోదాలు

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో పలుచోట్ల ఆదాయపన్నుశాఖ అధికారులు సోదాలు చేపట్టారు. అన్విత గ్రూపు కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నారు. పలు దస్త్రాలను వారు పరిశీలిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్, రాయదుర్గం, కొల్లూరు, సంగారెడ్డిలో ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

## మధుసూదన్ రెడ్డికి శుభాకాంక్షలు



**విశ్వంభర, మహేశ్వరం:** బడంగ్ పేట గ్రంథా లయంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రమాణ స్వీకా రోత్సవం ఘనంగా జరిగింది. ఈ స్వీకా రోత్సవా నికి కందుకూరు మాజీ జెడ్పీటీసీ బొక్క జంగా రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి హాజరై మధుసూదన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# హర్యానా నూతన సీఎంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకారం



**చండీగఢ్:** హరియాణాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం రాష్ట్రనూతన ముఖ్యమంత్రిగా నాయబ్‌సింగ్ సైనీ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ బండారు దత్తాత్రేయఆయన తో ప్రమా ణం చేయించారు. దీనికి ముందు ఆయన వాల్మీకి ఆలయంలో పూజలు చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం వేగంగా ముందుకువెళ్తుందని చెప్పారు. పంచకులలో జరిగినఈ కార్యక్రమానికి ఎన్డీయేకూటమినేతలు హాజర య్యారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీనడ్డా, నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, మనోహర్ లాల్ ఖట్టర్, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్‌షిండే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులుపాల్గొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ.. బీజేపా అనూహ్య విజయాన్నినమోదు చేసింది. 90 మంది సభ్యులు ఉన్న అసెంబ్లీకి బీజేపీ నుంచి 48 మంది ఎన్నికయ్యారు. అనంతరం సీఎం ఎంపికపై జరిగిన చర్చల్లో.. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చిన నాయబ్ సింగ్ సైనీవైపే అంతా మొగ్గు చూపారు. బుధవారం జరిగిన భాజపా శాసనసభా పక్ష భేటీలో ఈమేరకు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సీనియర్ నేత అనిల్ విజ్ ఆయన పేరును ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనేపథ్యంలో నేడు ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది.

# సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర కేసులో మరో వ్యక్తి అరెస్ట్





**చండీగఢ్:** బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. హర్యానాలోని పానిపట్ లో అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వ్యక్తిని సుఖాగా పోలీసులు గుర్తించారు. అతడిని ఇవాళ కోర్టు ముందు ప్రవేశపెట్టనున్నట్లు నవీ ముంబై పోలీసులు తాజాగా వెల్లడించారు. 1998 కృష్ణ జింక కేసు నుంచి సల్మాన్ ఖాన్.. లారెన్స్ బిష్ణోయ్ గాంగ్ టార్గెట్ జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఈ గ్యాంగ్ నుంచి సల్మాన్ అనేక సార్లు హత్య బెదిరింపులు ఎదుర్కొన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద కాల్పుల ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సల్మాన్ ఇంటి ముందు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఇక ఈ కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జూన్‌లో మరోసారి సల్మాన్ హత్యకు కుట్ర జరిగింది. పన్వేల్ ఫామ్‌హౌస్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో సల్మాన్‌పై దాడి చేయాలని ఈ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులోనే తాజాగా అరెస్ట్ జరిగింది. ఇక ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సల్మాన్ హత్యకు బిష్ణోయ్ గ్యాంగ్ పక్కా ప్లానింగ్‌తో వ్యవహరిస్తోందని పోలీసులు ఛార్జిషీట్‌లో ప్రస్తావించారు. పంజాబీ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య తరహాలోనే కారులో సల్మాన్‌ను హత్య చేయాలని నిర్ణయించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.25 లక్షల ఒప్పందం ప్రకారం సల్మాన్‌ను హత్య చేయాలనుకున్నారని, ఆగస్ట్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు నెలల పాటు ఈ హత్య ప్రణాళికను రూపొందించారని పోలీసులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.నటుడి హత్యకు మోడ్రన్ వెపన్స్ కొనుగోలుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిందితుల ముఠా ఏకే-47, ఎం16, ఏకే-92 తుపాకులు, హై-కాలిబర్ ఆయుధాలను వంటి అధునాతన మారణాయుధాలను పొరుగు దేశం పాకిస్థాన్ నుంచి కొనుగోలు చేయాలని భావించారని పోలీసులు పేర్కొన్నారు. సల్మాన్ హత్య కుట్రలో భాగంగా సల్మాన్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలు, బాంద్రాలోని నివాసం సహా షూటింగ్ ప్రదేశాల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సుమారు 70 మంది రెక్కీ నిర్వహిస్తూ.. నటుడి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు విచారణలో తేలింది.

# జాతీయ పతాకానికి సెల్యూట్, భారత్ మాతాకీ జై నినాదాలు చేయాలి

## నిందితుడికి హైకోర్టు ఆదేశం



**భోపాల్:** పొరుగుదేశం పాక్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిల్ మంజూరు సందర్భంగా మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అతడిలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కేసు విచారణ ముగిసేవరకు పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేయాలని, 'భారత్ మాతాకీ జై' అని నినాదాలు చేయాలనిఆదేశించింది. నెలలో రెండుసార్లు ఇలా చేయాలంటూ జస్టిస్ డీకే పలివాల్ నేతృత్వంలోని ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఫైజల్ అలియాస్ ఫైజాన్ ఈ ఏడాది మే నెలలో పాక్ అనుకూల నినాదాలు చేశారన్న కారణంతో పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌ను అగౌరవపరుస్తూ.. పాక్ అనుకూల నినాదాలు చేస్తున్న వీడియో ఆధారంగా ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద వర్గాల మధ్య చిచ్చు, దేశ సమగ్రతను దెబ్బతీసేలా వ్యవహరించడం వంటి అభియోగాలను మోపారు. తాజాగాఈ కేసు విచారణ సందర్భంగా రూ.50వేలు పూచీకత్తుపై ఫైజాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరుచేసింది.బెయిల్ షరతుల్లో భాగంగా ఫైజాన్ ప్రతినెలా తొలి, నాలుగో మంగళవారం భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని కోర్టు ఆదేశించింది. విచారణ ముగిసేవరకు ఈ ప్రక్రియ కొనసాగాలంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారీ జాతీయజెండాకు 21 సార్లు సెల్యూట్ చేయాలని, భారత్ మాతాకీ జై అని రెండు సార్లు నినదించాలని ఆదేశాలిచ్చింది. తాను పుట్టి, పెరిగిన దేశాన్ని గౌరవించాలన్న ఉద్దేశంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున లాయర్ బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. గతంలోనూ అతడిపై 14 కేసులు ఉన్నాయని వాదించారు.

# ఏపీలో పెట్టుబడులకు ఇదే మంచి సమయం

**చండీగఢ్:** పెట్టుబడిదారులకు ఏపీ స్వర్గధామం అని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. హరియాణా సీఎం నాయబ్ సింగ్



సైనీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు కొత్త అత్యుత్తమ విధానాలతో ఆహ్వానం పలుకుతోందన్నారు.ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రమని చెప్పారు. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించామన్నారు."వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యా వరణ వ్యవస్థనునిర్మిస్తున్నాం.అభివృద్ధికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతను తీసు కుంటుంది. దేశంలో, ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయాణంలో మాతో సహకరించండి. వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరంవిస్తరించుకునే అవకాశమిది. ఏపీలో నూతన పెట్టుబడులు కోసం ఎదురుచూస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# బాబా సిద్ధిఖీపై 10సార్లు హత్యాయత్నం..!



**ముంబయి:** మహారాష్ట్ర ఎన్సీపీపవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీ హత్యకు నిందితులు వరుసగా 10సార్లు ప్రయత్నించారని దర్యాప్తు బృందంలోని అధికారి వెల్లడించారు. కానీ, చివరి నిమిషంలో వేర్వేరు కారణాలతో అవి వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు హరీశ్‌కుమార్ నిషాద్‌ను నిన్న పోలీసులు యూపీలో అదుపులోకి తీసుకొన్నారు. ఇప్పటికే గుర్మైల్ సింగ్, ధర్మరాజ్ కశ్యప్, ప్రవీణ్ లోంకర్ అనే యువకులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సిద్ధిఖీహత్య సమయంలో తమవద్ద మందుగుండు తగ్గకూడదని గుర్మైల్ సింగ్, ధర్మరాజ్ దాదాపు 65 తూటాలను సిద్ధం చేశారు. అక్టోబర్ 12న హత్య సమయంలో ఆరింటిని కాల్చారు. ఈ ఘటన అనంతరం అధికారులు వీరిని అరెస్టు చేసి ఆస్ట్రియాలో తయారైన తుపాకీని 28 తూటాలను స్వాధీనం చేసుకొన్నారు. హత్య జరిగిన ప్రదేశానికి కొంత దూరంలో ఓ నల్లటి బ్యాగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దీనిలో తుర్కియేలో తయారైన 7.62 బోర్ పిస్తోల్, మరో 30 తూటాలున్నాయి. శివకుమార్ గౌతమ్ పేరిట ఆధార్ కార్డు కూడా దొరికింది. అతడిఫొటోతోనేసుమిత్‌కుమార్ పేరిట మరోఆధారం అందులో ఉంది.

### బైక్ యాక్సిడెంట్‌తో హత్యాయత్నం వాయిదా..

తొలుత బైకుపై వెళ్లి బాబా సిద్ధిఖీని కాల్చి చంపి వేగంగా తప్పించుకోవాలని నిందితులు ప్లాన్ వేశారు. ఇందుకోసం పుణెలో తుక్కు దుకాణం నిర్వహించే నిషాద్‌కు ప్రవీణ్ నుంచి రూ.60,000 సొమ్ము బదిలీ అయింది. సెకండ్ హ్యాండ్ బైక్‌ను కొనుగోలుచేసిన అతడు.. స్వయంగా ముంబయి తీసుకెళ్లి నిందితులకు అప్పగించాడు.కానీ, నింది తుల్లో ఇద్దరు ప్రయాణిస్తున్న బైకు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఈ ప్లాన్‌ను పక్కన పడేశారు. చివరికి ఆటో రిక్షాలో వెళ్లి కాల్పులు జరిపి.. ఆ తర్వాత దుస్తులు మార్చుకొని పారిపోవాలని నిర్ణయించుకొన్నారు.

### శుభం లోంకర్‌పై లుకౌట్ నోటీసులు..

ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు శుభం లోంకర్ కోసం పోలీసులువేటను తీవ్రం చేశారు. ఇప్పటికే లుకౌట్‌నోటీసులు జారీ చేశారు. అతడు నేపాల్ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఆ సరిహద్దుల్లో అతడి ఫొటోలను అన్ని ప్రదేశాలకు పం పించారు. హత్యకు మూడ్రోజుల ముందువరకు అతడు సోషల్ మీడి యాలోను యాక్టివ్‌గా ఉన్నాడు. అతడి సోదరుడు ప్రవీణ్‌ను ఇప్పటికే అరెస్టు చేశారు.

### ముంబయి అపార్ట్‌మెంట్‌లో షూటింగ్ ప్రాక్టీస్..

నిందితులు తుపాకులు వినియోగించడాన్ని ముంబయిలోని అపార్ట్‌మెంట్‌లో నేర్చుకొన్నట్లు పోలీసులు చెబుతున్నారు. యూట్యూబ్‌లో వీడియోలు చూసి.. తూటాలను లోడ్, అన్‌లోడ్ చేయడం, ఆయుధాన్ని వినియోగించడంనేర్చుకొన్నారు.వీరున్న కుర్లాలోని అపార్ట్‌మెంట్‌లో తక్కువ స్థలం ఉండటంతో 'డ్రైప్రాక్టీస్' డ్రిల్స్ మాత్రమే చేసినట్లు అధికారులు తెలిపారు. గన్స్‌తో రిహార్సల్స్ కూడా చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల్లో ఒకడైన శివ్‌కుమార్ గౌతమ్‌కు మాత్రం తుపాకులు వినియోగం వచ్చు. అతడు గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన వేడుకల్లో గాల్లోకి కాల్పులు జరిపిన సందర్భాలున్నాయి. అతడే ఈ కేసులో ప్రధాన షూటర్‌గా భావిస్తున్నారు. కశ్యప్, సింగ్‌కు అతడే శిక్షణ ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు. వీరు ముగ్గురు స్నాప్‌ఛాట్, ఇన్‌స్టా ద్వారా తరచూ సంభాషించుకొన్నట్లు అధికారులు గుర్తించారు. హత్య ప్లాన్ అమలుచేసేందుకు కొన్ని యాప్స్ కూడా వాడినట్లు తేలింది.

# రైలులో ప్రయాణికుడి బ్యాగు చోరీ..

## రైల్వేశాఖకు రూ.4.7లక్షలు జరిమానా!



ఢిల్లీ: రైలులో రిజర్వ్ చేసిన కోచ్‌లలో ప్రయాణికులకు సంబంధించిన వస్తువులకు రైల్వేశాఖ భద్రత కల్పించాలని జాతీయ వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్ పేర్కొంది. 2017లో చోరీకి గురయిన ఓ వ్యక్తి బ్యాగుకు రైల్వేశాఖ బాధ్యత వహిస్తుందని పేర్కొంటూ.. బాధితుడికి రూ.4.7లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. దిలీప్ కుమార్ చతుర్వేది అనే వ్యక్తి 2017 మేలో అమర్‌కంట్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుగానే రిజర్వ్ చేసుకొని తన కుటుంబసభ్యులతో కలిసి ప్రయాణించారు. ఆ సమయంలో ఆ కోచ్‌లోకి బయటి వ్యక్తులు రావడంతో అతని బ్యాగు చోరీకి గురయ్యింది. అందులో రూ.9.3లక్షలు విలువైన వస్తువులు, నగదు ఉన్నాయి. ఘటన అనంతరం చతుర్వేదీ ఫిర్యాదు చేశారు. ఈ చోరీకి టీటీఈ నిర్లక్ష్యమే కారణమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా దీనిపై విచారించిన ఎన్సీడీఆర్సీ ఈ చోరీకి రైల్వేశాఖ బాధ్యత వహిస్తుందని తీర్పునిచ్చింది. అయితే.. రైల్వే చట్టంలోని సెక్షన్ 100 ప్రకారం.. ప్రయాణికుల వస్తువులకు తాము బాధ్యత కాదని రైల్వేశాఖ వాదించింది. ఈ వాదనలను ఎన్సీడీఆర్సీ తోసిపుచ్చింది. రిజర్వ్ చేసుకున్న కోచ్‌లలో ప్రయాణికులు, వారి వస్తువులకు రైల్వేశాఖ బాధ్యత వహించాలని పేర్కొంది. అదేవిధంగా ఈ చోరీకి రైల్వే అధికారులు ముఖ్యంగా టీటీఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపింది. అనంతరం బాధితుడికి పరిహారంగా రూ.4.7లక్షలు జరిమానా విధించాలని తీర్పునిచ్చింది.

# కల్తీ మద్యం ఘటనలో 32 కి చేరిన మృతులు

పట్నా: సంపూర్ణ మద్య నిషేధం అమల్లో ఉన్న బిహార్ రాష్ట్రంలో మరోసారి కల్తీ మద్యం కాటేసింది. సివాన్, సారణ్ జిల్లాల్లో ఈ కల్తీ మద్యం కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 20కి పెరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేసి నట్లు సివాన్ ఎస్పీ అమితేశ్ కుమార్ గురు వారం వెల్లడించారు. కల్తీ మద్యం విక్రయా లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్ల క్ష్యంగావ్యవహరించినందుకు గానూ పంచా యతీ బీట్ పోలీసు అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.అక్టోబరు 15న సివాన్, సారణ్ జిల్లాలకు చెందిన కొందరు కల్తీ మద్యం తాగి తీవ్ర అనారోగ్యానికి గుర య్యారు. వీరిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పో యారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. బిహార్‌లో మద్యం వినియోగం, విక్రయా లపై 2016 ఏప్రిల్ లోనే పూర్తిగా నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయినప్ప టికీ ఇక్కడ అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తు న్నాయి. ఇక, కల్తీ మద్యం కారణంగా కొన్నే ళ్లుగా వందల మంది ప్రాణాలు కోల్పో తున్నారు.

# భర్త ఆగ్రాలో.. భార్య దిల్లీలో..


## ఒకే రోజు ఆర్మీ దంపతుల ఆత్మహత్య..!

**దిల్లీ:** భారతసాయుధ దళాల్లో పని చేస్తున్న ఓ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఐఏఎఫ్, ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్న వారిద్దరూ.. వేర్వేరు నగరాల్లో ఒకేరోజు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..దీన్ దయాళ్ దీప్ (32) ఆగ్రా లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐఏఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంట్‌గా పని చేస్తున్నారు. అదే నగరంలోని సైనిక ఆస్పత్రిలో అతడి భార్య రేణు తన్వర్ ఆర్మీలో కెప్టెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే.. ఇటీవల తన్వర్ తన తల్లి, సోదరుడితో కలిసి వైద్య చికిత్స కోసం దిల్లీకి వెళ్లారు. ఇంతలో ఏమైందో తెలియదు. ఒకేరోజు ఈ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీప్ మరుసటి రోజు బయటకు రాకపోవడం తో సహోద్యోగులు తలుపు పగలగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.భోజన సమయంలో దీప్ తమతో సరదగానే మాట్లాడారని.. అప్పుడు అతడి ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించలేదని సహోద్యోగుల్లో ఒకరు వెల్లడించారు. ఉదయం ఎంతసేపటికీ బయటికి రాకపోవడంతో అనుమానంతో తలుపులు పగలగొట్టి చూసేసరికి దీప్ విగతజీవిగా కనిపించారని పోలీసులకు తెలిపారు. మరోవైపు.. అదేరోజు తన్వర్ కూడా దిల్లీ కంటోన్మెంట్‌లోని అధికారుల మెస్ హాల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

### ఆయనతో పాటే నాకూ దహన సంస్కారాలు చేయండి..

అక్కడున్న సిబ్బంది సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఆమె మృతదేహం పక్కన సూసైడ్ నోటును స్వాధీ నం చేసుకున్నారు. తన భర్త మృతదేహంతో కలిపి తనకూ దహన సంస్కారాలు నిర్వహించాలని ఆమె కోరారు. తన్వర్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె తల్లి, సోదరుడు ఆస్పత్రిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. దీప్ వద్ద ఎలాంటి సూసైడ్ నోటు లభ్యం కాలేదు. దీంతో అతడి మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ముందస్తు టికెట్ బుకింగ్‌పై రైల్వేశాఖ కీలక నిర్ణయం..!



**ఢిల్లీ:** భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకున్నది. రైల్వే టికెట్ల అడ్వాన్స్ టికెట్ రిజర్వేషన్ వ్యవధిని తగ్గింది. ఇప్పటి వరకు ముందస్తు రిజర్వేషన్‌కు 120 రోజుల గడువు ఉన్నది. దీన్ని 60 రోజులకు తగ్గించింది. ఈ కొత్త నిబంధన నవంబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. అంతకు ముందు చేసుకున్న టికెట్ల బుకింగ్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని రైల్వేశాఖ ప్రకటించింది. అక్టోబర్ 31 వరకు చేసిన అన్ని బుకింగ్స్ అలాగే ఉంటాయని చెప్పింది. విదేశీ పర్యాటకులకు 365 రోజుల పరిమితిలో ఎలాంటి మార్పు ఉండబోదని రైల్వే మంత్రిత్వ శాఖ పేర్కొంది. రైల్వేశాఖ ప్రకటన నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో ఐఆర్‌సీటీసీ పతనమయ్యాయి. 2.2శాతం తగ్గి రూ.867.60 వద్ద ట్రేడవుతున్నాయి. తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని.. ముందస్తు రిజర్వేషన్ ఇప్పటికే తక్కువ కాల పరిమితి ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. దేశంలోనే అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థ భారతీయ రైల్వే. నిత్యం లక్షల మంది రైల్వేలో ప్రయాణిస్తుంటారు. ఏటా 30 నుంచి 35కోట్ల మంది రైల్వేలో ప్రయాణిస్తుంటారని అంచనా. టికెట్ ధర తక్కువ, భద్రతను దృష్టిలోపెట్టుకొని ఎక్కువమంది రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారంతా ముందస్తుగా టికెట్లను రిజర్వేషన్ చేసుకుంటారు. ప్రస్తుతం 120 రోజుల వరకుముందస్తుగా టికెట్‌బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం దీన్ని 60 రోజులకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది.

# డీజే మ్యూజిక్‌కు బాలుడు బలి..

## డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో మృతి

**భోపాల్:** డీజే మ్యూజిక్‌కు బాలుడు బలయ్యాడు. డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోయాడు. హాస్పిటల్‌కు తరలించగా గుండెపోటుతో మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయం తెలిసి ఆ బాలుడి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక వేడుక సందర్భంగా పెద్ద శబ్దంతో డీజే ప్లే చేశారు. ఆ మ్యూజిక్‌కు అనుగుణంగా కొందరు వ్యక్తులు డ్యాన్స్ చేయడాన్ని 13 ఏళ్ల సమర్ బిల్లోర్ గమనించాడు. ఉత్సాహం ఆపుకోలేక ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అక్కడున్న వారితో కలిసి అతడు కూడా డ్యాన్స్ చేశాడు.కాగా, పెద్ద శబ్దంతో కూడిన డీజే మ్యూజిక్‌తో డ్యాన్స్ చేస్తున్న సమర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఇది చూసి బాలుడి తల్లి ఆందోళన చెందింది. స్థానికులతో కలిసి హాస్పిటల్‌కు తరలించారు. అయితే గుండె వైఫల్యం వల్ల ఆ బాలుడు చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపుతమ కుమారుడికిగుండె జబ్బు ఉందని, అయితే ఇప్పటి వరకు ఆరోగ్యంగానేఉన్నాడని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు.డీజే సౌండ్ పట్లతానుఎన్నిసార్లు హెచ్చరించినా వారు పట్టించుకోలేదని బాలుడి తండ్రి ఆరోపించాడు. తమ అబ్బాయి ప్రాణం పోయినా కూడా డీజే సందడినివారుఆపలేదని ఆవేదనవ్యక్తం చేశాడు.కాగా,ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'పౌరసత్వ చట్టం 1953 సెక్షన్ 6ఎ'ను సమర్థించిన రాజ్యాంగ ధర్మాసనం



**ఢిల్లీ:** పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6ఎ రాజ్యంగ బద్ధతను సుప్రీంకోర్టు రాజ్యంగ ధర్మాసనం నేడు సమర్థించింది.సీజేఐ డీవై చంద్రచూడ్,జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం నేడు 4:1 మెజార్టీతో తీర్పును వెలువరించింది. న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్థీవాలా మాత్రమే ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.ఈసందర్భంగా చంద్రచూడ్ మాట్లాడుతూ.."అక్రమ వలసలకు అస్సాం అకార్డ్ ఓ రాజకీయ పరిష్కారం. అదే సమయంలో సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గం. ఈ నిబంధనలు రూపొందించడానికి మెజార్టీతో కూడిన పార్లమెంటుకు శక్తి ఉంది. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు.. స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత ఈ సెక్షన్‌కు ఉంది. ఇక దీనిలోని కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసింది. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని ఇది చెబుతోంది. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపు కోలేదు.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదు" అని పేర్కొన్నారు.


పౌరసత్వ చట్టం-1955 సెక్షన్6ఎ ప్రకారం.. 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అస్సాంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ నిబంధనను 1985లో అస్సాం అకార్డ్ తర్వాత తీసుకొచ్చారు. అస్సాంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకొన్న ఒప్పందమే ఇది. దీని చట్టబద్ధతపై అస్సాంలోని కొన్ని స్థానిక గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. ఇది రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనగా పేర్కొంటూ రాజకీయ హక్కులను హరించడమేనని వాదించాయి.

# ఎంజీఆర్ నాకెప్పుడూ స్ఫూర్తి: పవన్ కల్యాణ్



**విశ్వంభర, అమరావతి:** అన్నాడీఎంకే పార్టీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్)ఈ పార్టీనిస్థాపించి తమిళనాడులో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగారన్నారు. పేదలు, అన్నార్థులకు సాయం చేశారని.. వారికి హుందాగా జీవించే హక్కును కల్పించారని కొనియాడారు. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేపట్టారని..తమిళనాడును దేశంలో సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు."ప్రజల వర్తమాన అవసరాలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక భవిష్యత్తు, స్థిరాభివృద్ధికోసం ఎంజీఆర్ గొప్ప పునాది వేశారు.ప్రజల అవసరాలను గుర్తించడంతో పాటు భావితరాల బాగు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంజీఆర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకున్నానని అన్నారు. ప్రజలు, పాలన పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చూసి నేను స్ఫూర్తి పొందా. ఎంజీఆర్ తర్వాత ఆయన ఆశయాలు, నాయకత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారు. ఎంజీఆర్ వారసత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారని తెలిపారు. ఎంజీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజల చేత 'అమ్మ'గా గౌరవాన్ని అందుకున్నారు. పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే..ఎంజీఆర్ విలువల్ని ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆ పార్టీ తమిళనాడు ప్రజల గొంతుకగా ఉంది. ఇదంతా ఆ పార్టీ విలువల వల్లే సాధ్యమైంది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.తమిళనాడు ప్రజలకు సేవ చేయడం, ఎంజీఆర్ ఆశయాలను నెరవేర్చడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం , రాష్ట్రాన్ని అభివృద్ధి , సంక్షేమంలో ఉన్నత శిఖరాల వైపు పార్టీని నడిపించాలని కోరారు. తమిళ భాష, సంస్కృతి పట్ల నాకున్న గౌరవం, తమిళుల అలుపెరగని పోరాట పటిమంటే నాకు ఎప్పటినుంచో గౌరవమని అన్నారు.

## నష్టాల్లో సూచీలు..
## 24,750 దిగువకు
## నిఫ్టీబజాజ్ ఆటో 13% డౌన్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల నిధుల ఉపసంహరణ కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇప్పటికే వెలువడిన త్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్‌ను మెప్పించకపోవడం మరో కారణం. దీంతో సూచీలు రెండు నెలల కనిష్ఠానికి చేరాయి.బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా బజాజ్ ఆటో షేర్లు గురువారం 13 శాతం మేర కుంగాయి. సెన్సెక్స్ ఉదయం 81,758.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,501.36) లాభాల్లో ప్రారంభమై కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 80,905.64 కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 494.75 పాయింట్ల నష్టంతో 81,006.61 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 221.45 పాయింట్ల నష్టంతో 24,749.85 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.07గా ఉంది. సెన్సెక్స్‌లో నెస్లే ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎల్‌అండ్‌టీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.57 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2696.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బజాజ్ ఆటో షేర్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఈలో 13.11 శాతం క్షీణించి రూ.1523 నష్టంతో రూ.10,093.50 వద్ద ముగిశాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.1,385 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.2,020 కోట్లతో పోలిస్తే ఇది 31% తక్కువ. దీంతో బ్రోకరేజీ సంస్థలు బజాజ్ ఆటో షేరు టార్గెట్ విలువను తగ్గించడంతోషేర్లుభారీగా కుంగాయి.

## పీఎస్‌లు, ఉపాధి హామీ
## ఏఫ్‌ఏలతో సమీక్ష సమావేశం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకి, ఉపాధి హామీ సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకి ఎంపీడీఓ రాములు నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లా డుతూ గ్రామాలలో పచ్చదనం -పరిశుభ్రత ప్రతి రోజు నిర్వహించాలని కార్యదర్శులకి, ఫీల్డ్ అసిస్టెంట్లకి ఆదేశాలు జారీ చేశారు. అదేవిదంగా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే గురించి, ఎల్ఆర్ఎస్ సర్వే గురించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇంచార్జి ఎంపీఓ ఎల్మినేటి లోకేశ్వర్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ బి రమేష్, ఈసీ ఎస్ శ్రీనివాస్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఏ మల్లేశం, డి శ్రీశైలం, జె యాదిరెడ్డి, డినిర్మల, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరైన సజ్జల



## టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నోటీసులిచ్చిన మంగళగిరి పోలీసులు

**విశ్వంభర, అమరావతి** : ఏపీలోని టీడీపీ ప్రధానకార్యాలయంపై దాడి చేసిన కేసులో వైసీపీ కీలక నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కు విచారకు హాజరయ్యారు. ఈ కేసులో సజ్జల 120వ నిందితుడిగా ఉన్నారు. పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని రెండురోజుల క్రితం మంగళగిరి పోలీసులు సజ్జల కు నోటీ సులు అందజేశారు. గురువారం విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సజ్జల వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు బ్రహ్మారెడ్డి, అప్పిరెడ్డిలు ఉన్నారు. అయితే న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని లోనికి అనుమతించకపోవడంతో ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు సజ్జల ఒక్కరే విచారణకు లోనికి వెళ్లారు. మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు సజ్జలను విచారించారు.కాగా సజ్జల విచారణకు వచ్చిన సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేసులో ఇప్పటికే అప్పిరెడ్డి, తలశిల రఘురాం, అవినాష్, నందిగంసురేష్‌ను పోలీసులు విచారించారు.

## నిందితులకూ హక్కులు ఉన్నాయి: పొన్నవోలు

సజ్జల రామకృష్ణారెడ్డికి న్యాయస్థానం ఈనెల 24 వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే 10న లుక్‌ఔట్ నోటీసులు ఎలా ఇస్తారని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దాడి జరిగిన రోజు సజ్జల మంగళగిరికి 500 కి.మీ దూరంలో ఉన్నట్టు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పించామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్టు.. నిందితులకూ హక్కులు ఉన్నాయన్నారు. తెదేపా కార్యాల యంపై దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.వైసీపీ అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు టీడీపీ కేంద్ర కార్యాల యంపై దాడికి పాల్పడ్డాయి.దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైసీపీ నేతలను పోలీసులు విచారించారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యా లయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవి నాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే ఫలు దఫాలుగా పీఎస్‌కు పిలి పించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలను విచారిస్తున్నారు.

# విప్రో లాభంలో 21% వృద్ధి

## ఒక్కో షేరుకు బోనస్ షేరు




**ముంబయి:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.3,209 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,646 కోట్లతో పోలిస్తే 21 శాతం వృద్ధి నమోదైంది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం రూ.22,516 కోట్ల నుంచి రూ.22,302 కోట్లకు తగ్గినట్లు విప్రో తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. తఅర్హులైన వాటాదారులకు ఒక షేరుకు ఒక బోనస్ షేరుగా ఇవ్వాలని కంపెనీ బోర్డు ఈ సందర్భంగా నిర్ణయించింది. అంటే రికార్డు డేట్ నాటికి ఎవరి ఖాతాలో విప్రో షేర్లు ఉంటాయో వారికి ఒక షేరు బోనస్‌గా లభిస్తుంది. రికార్డు తేదీని మాత్రం కంపెనీ వెల్లడించలేదు. గతంలోనూ విప్రో ఐదుసార్లు బోనస్ షేర్లను జారీ చేసింది. సమీక్షా త్రైమాసికంలో 3.56 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు అందుకున్నట్లు విప్రో ఈ సందర్భంగా తెలిపింది. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు విలువ 0.65 శాతం క్షీణించి రూ.528.7 వద్ద ముగిసింది.

**ఎల్‌టీఐ మైండ్‌ట్రీ రూ.20 బోనస్‌ఫ** మరో ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఏకీకృత నికర లాభంలో 8 శాతం వృద్ధిని నమోదు చేసింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.1251 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఇదే త్రైమాసికంలో ఆదాయంలో 6 శాతం వృద్ధితో రూ.9,433 కోట్లు వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఎల్‌టీఐ బోర్డు రూ.20 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. అక్టోబర్ 25న రికార్డు డేట్‌గా నిర్ణయించింది. నెల రోజుల్లో చెల్లింపులు చేస్తామని కంపెనీ ప్రకటించింది.

## వాల్మీకి సందేశాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం


**విశ్వంభర, భూపాలపల్లి:** వాల్మీకి సందేశాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మహర్షి వాల్మీకి జయంతి సంద ర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావుతో కలిసి జిల్లా కలెక్టర్ రాహు ల్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ వాల్మీకి సందేశాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మహర్షి వాల్మీకి యొక్క సందేశాలు సమాజాన్ని సద్గుణ మార్గంలో నడిపే విధంగా ఉంటాయని అన్నారు. వాల్మీకి జీవితం, సాహిత్య సేవలు, సమాజానికి ఎంతో ఆచరణాత్మకమని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లా డుతూ వాల్మీకి, ప్రాచీన భారతీయ సంస్కృతి, సాహిత్యంలో ప్రముఖ వ్యక్తి అని అన్నారు. రామాయణం వంటి మహా కావ్యాన్ని రచించి, సామాన్య ప్రజలకు నైతికత, ధర్మం, జీవన సారాన్ని నేర్పించారన్నారు. వాల్మీకి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శైలజ, వివిధ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి మెట్టు మార్గాన్ని మూసివేసిన టీటీడీ



**విశ్వంభర, తిరుమల:** భారీవర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలతో తితిదే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీవారి మెట్టు కాలినడక మార్గాన్ని తితిదే మూసివేసింది. కొండచరియలపై నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటోంది. భక్తుల దర్శనాలు, వసతికి ఇబ్బంది కలగకుండా తితిదే ఏర్పాట్లు చేసింది. మరోవైపు వాయుగుండం తీరం దాటాక వర్షాలు లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## డా.గజల్ శ్రీనివాస్ రామాయణం, భారతం, భాగవతాల గానం ఆడియోల ఆవిష్కరణ



విశ్వంభర, తిరువనంతపురం: డా.గజల్ శ్రీనివాస్ స్వరపరచి, గానం చేసిన పలు ఆడియోలను ఉత్తరాఖండ్ జ్యోతిర్ మఠ్ శంకరాచార్య శ్రీ అవి ముక్తేశ్వరానంద సరస్వతి స్వామి ఆవిష్కరించారు. పోతన విరచిత భాగవతంలోని ముఖ్యమైన 108 పద్యాలు, కవిత్రయం రచించిన ఆంధ్ర మహాభారతంలోని ముఖ్య 108 పద్యాలు, డా.ముకుంద శర్మ వ్రాసిన గేయ రామాయణాల ఆడియోలను తిరువనంతపురం (కేరళ) శ్రీ పద్మనాభస్వామి వారి ఏకాంత దర్శనానంతరం వేల మంది భక్తుల సమక్షంలో విడుదల చేశారు. మన సనాతన ధర్మంలో అతి ముఖ్యమైన రామాయణ, భారతం, భాగవతాల తెలుగు ఆడియోలను ఒకే రోజు ఆవిష్కరించడం అతి గొప్ప ధార్మిక కార్యక్రమమని, వీటిని స్వరపరచి సందర్భ, తాత్పర్య సహితంగా అందరికీ అర్థమయ్యేలా గానం చేసిన డా.గజల్ శ్రీనివాస్ అభినందనీయుడని శ్రీ శంకరాచార్య ప్రశంసించారు. ఆడియో తొలి ప్రతులను శ్రీ సి.ఎల్.రాజం దంపతులకు, మిజోరం పూర్వ గవర్నర్ కుమ్మనం రాజశేఖర్‌లకు స్వామి వారు అందించారు.

## పులులు, ఏనుగులను తరలిస్తున్న ట్రక్కు బోల్తా

### రోడ్డుపై పడిన మొసళ్లు



పట్నా: పులులు, ఏనుగులు వంటి జంతువులను తరలిస్తున్న ఓ ట్రక్కు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అందులోని ప్రాణులన్నీ సురక్షితంగా బయటపడ్డాయి. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది.బీహార్ రాజధాని పట్నా లోని సంజయ్‌గాంధీ జాతీయ జూ పార్కు నుంచి వివిధ రకాల జంతువుల్ని రెండు వాహనాల్లో బెంగళూరులోని బన్నేర్‌గట్ట జాతీయ పార్కు కు తరలిస్తున్నారు. వీటిల్లో ఎనిమిది మొసళ్లు, రెండు తెల్ల ఏనుగులు, రెండు తెల్ల పులులు సహా ఇతర జంతువులు ఉన్నాయి. అయితే, నిర్మల్ జిల్లా మామడ మండలం మొండిగుట్ట గ్రామానికి చేరుకోగానే ఓ ట్రక్కు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి సిమెంట్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. దీంతో వాహనం రోడ్డు పక్కకు బోల్తాపడిపోయింది. ఈ ఘటనలో మొత్తం ఎనిమిది మొసళ్లలో రెండు బయటపడ్డాయి.సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. రోడ్డుపై పడిపోయిన మొసళ్లను తిరిగి పట్టుకున్నారు. అనంతరం మరో వాహనాన్ని ఏర్పాటుచేసి అన్నింటినీ బెంగళూరు తరలించారు.

## నటి జెత్వానీ కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్ రిమాండ్ పొడిగింపు



**విశ్వంభర, విజయవాడ:** ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో నిందితుడు, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ రిమాండ్ పొడిగించారు. విజయవాడ నాలుగో ఏసీఎంఎం కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో ఆయన ఏ1గా చేర్చారు. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# యెమెన్ గగనతలంపై

## గర్జించిన అమెరికా బి-2 బాంబర్లు

### హూతీ రెబల్స్‌పై తీవ్రస్థాయిలో దాడి

### రక్షణ మంత్రి లాయిండ్ ఆస్టిన్ వెల్లడి



**సనా:** యెమెన్‌లో హూతీ రెబల్స్‌పై అమెరికా తీవ్రస్థాయిలో దాడి చేసింది. ఏకంగా బి-2 స్టెల్త్ బాంబర్లను రంగంలోకి దించింది. గురువారం తెల్లవారుజామున యెమెన్‌పై దాడులు చేసింది. ఈవిషయాన్ని రక్షణ మంత్రి లాయిండ్ ఆస్టిన్ స్వయంగా వెల్లడించారు. మొత్తం ఐదు అండర్‌గ్రౌండ్ ఆయుధ డిపోలను బి-2 స్టెల్త్ బాంబర్లు ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఎర్ర సముద్రంలో పౌర నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి హూతీలు వినియోగించే ఆయుధాలను భద్రపర్చే డిపోలని ముగ్గురు అమెరికా అధికారులు సీఎన్ఎన్‌కు వెల్లడించారు. "మా నుంచి తప్పించేందుకు వీలుగా శత్రువులు తమ ఆయుధాలను ఎంత లోతుగా దాచినా వదిలిపెట్టమన్న విషయం ఈ దాడితో నిరూపితమైంది. ఇక మా వాయుసేన బీ-2 స్టెల్త్ బాంబర్ వినియోగంతో.. అవసరమైనప్పుడు ప్రపంచ వ్యాప్తంగా దాడి చేయడంలో మాకున్న సామర్థ్యం ఏమిటో చెప్పినట్లైంది. హూతీల సామర్థ్యాన్ని కుప్పకూల్చాలని అధ్యక్షుడు జోబైడెన్ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాల మేరకే ఈ దాడిని చేపట్టాం. వారు భవిష్యత్తులో చేసే దాడులకు తీవ్ర పరిణామాలుంటాయని మేము హెచ్చరి స్తున్నాం" అని లాయిడ్ ఆస్టిన్ వ్యాఖ్యానించారు. హూతీలపై అమెరికా తొలిసారి బి-2 వాడినట్లైంది. సాధారణ ఫైటర్ జెట్లతో పోలిస్తే ఈ యుద్ధవిమానం అత్యంత శక్తిమంత మైంది. సుదూర లక్ష్యాలను కూడా అవలీలగా ఛేదిస్తుంది. అంతేకాదు.. అత్యంత భారీ బాంబులను ఇది మోసుకెళ్లగలదు. ఇప్పటివరకు అమెరికా కేవలం సాధారణ ఫైటర్ విమానాలనే హూతీలపై వాడింది. ఇప్పటికే పశ్చిమాసియాలోయా ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పతాకస్థాయిలో ఉన్న వేళ అమెరికా సైనికదళాలు అక్కడ కాలు మోపనున్నాయి. థాడ్ గగనతల రక్షణ వ్యవస్థను కూడా అమెరికా అక్కడ మోహరిస్తోంది. యెమెన్‌లో హూతీని దెబ్బతీసేందుకు ఈ దాడి జరిగింది. గాజాలో యుద్ధం మొదలైన నాటినుంచి హూతీ రెబల్స్ ఎర్ర సముద్రంలోని నౌకలపై దాదాపు 100 వరకు డ్రోన్, క్షిపణి దాడులను నిర్వహించారు.

# నెమ్మదిగా వెళ్లాలన్నందుకు దాడి

- వృద్ధుడిని కొట్టి, తోసేసిన బైకర్
- చికిత్స పొందుతూ 15 రోజుల తరువాత మృతి
- అల్వాల్‌లో దారుణం



**విశ్వంభర, సికింద్రాబాద్:** కాస్త నెమ్మదిగా వెళ్లాలని చెప్పిన పాపానికి ఒక వృద్ధుడు బలయ్యాడు. గత నెల సెప్టెంబర్ 30న అల్వాల్ పీఎస్? పరిధిలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఆంజనేయులు రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో బైక్?పై వేగంగా ఓ యువకుడు, యువతితో కలిసి ఆంజనేయులు పక్కనుంచి వెళ్లారు. ఆ వేగానికి భయపడ్డ ఆంజనేయులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. ఆ మాటకే ఆగ్రహం చెందిన యువకుడు బైక్ ఆపి వచ్చి ఆంజనేయులుపై దాడి చేశాడు. యువకునితో పాటు ఉన్న యువతి ఆపేందుకు యత్నించినా ఆగలేదు. కోపంతో ఆంజనేయులను తోసేయడంతో కింద పడిపోయాడు. తరువాత ఆ యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆంజనేయులు కిందపడ్డప్పుడు రాయికి తగలడంతో తలకు బలమైన గాయమైంది.

**మృత్యువుతో పోరాడుతూ మృతి**

విషయం తెలిసిన కుటుంబసభ్యులు ముందుగా ఆ వృద్ధుడిని కేర్? హాస్పిటల్?కు తీసుకెళ్లారు. తరువాత అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. 15 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆంజనేయులు ఈనెల 14న చనిపోయాడు. ఈ ఘటనపై మృతుని కుమారుడు గురువారం అల్వాల్ పోలీస్? స్టేషన్?లో నిందితునిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

**సీసీటీవీ కెమెరాలో రికార్డైన ఘటనా దృశ్యాలు**

దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయి ఉన్నాయి. వాటి ఆధారంగా పోలీసులు నిందితుని కోసం గాలిస్తున్నారు. నిందితుడు తెలుగు వాడు కాదని ఘటన జరిగినప్పుడు చూసిన ప్రత్యక్షసాక్షులు చెప్పినట్లు మృతుని కుమారుడు చెబుతున్నాడు. ఏదేమైనా నెమ్మదిగా వెళ్లాలని చెప్పినందుకే వృద్ధుడిపై చేయి చేసుకొని అతని చావుకు కారణమవడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇలా రాష్ డ్రైవింగ్ చేసేవారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం- ఎమ్మెల్యే కసిరెడ్డి

### సీఎం చొరవతో నియోజకవర్గానికి 204 కోట్ల మంజూరు

### రహదారులకు 189 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు 15 కోట్లు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో కడ్తాల్, మాడుగుల, ఆమనగల్లు, తలకొండపల్లి కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గానికి ఎం డీ ఆర్ ప్రణాళిక కింద సీఎం చొరవతో 189 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే తెలిపారు. కల్వకుర్తి- మాధారం-కడ్తాల్ రహదారి నాలుగు లేన్ ల వరకు విస్తరించి అభివృద్ధి చేయడం కోసం 30 కోట్లు, వెల్దండ నుండి సిర్సనగండ్ల వరకు సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్డు విస్తరించడం మరియు బలోపేతం చేయడం కోసం 40 కోట్లు, జూపల్లి నుండి వంగూర్ గేట్ రోడ్డు విస్తరణ మరియు పటిష్ట కొరకు 9 కోట్లు, కోనాపూర్ నుండి మాడుగుల వరకు సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ అభివృద్ధి కోసం 45 కోట్లు, దేవరకొండ-మాడ్గుల రహదారి కొరకు 30 కోట్లు, కల్వకుర్తి-మాధారం-కడ్తాల్ రహదారిని విస్తరించడం మరియు బలోపేతం చేయడం కోసం 35 కోట్లు, మొత్తంగా 189 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని, అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి మాడుగుల మండలానికి అండర్ డ్రైనేజీల కోసం దాదాపు ఏడు కోట్ల 80 లక్షల రూపాయలు ఇచ్చి అన్న మాట నిలుపుకున్నారని నియోజకవర్గంలో వంతెనలు రోడ్ల కోసం మరో ఏడున్నర కోట్ల రూపాయలను మంజూరు చేశారని తొందరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని దాదాపు 2004 కోట్లను ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి నిధులు మంజూరు కావడం కల్వకుర్తి చరిత్రలోనే లేదని తాను చేసి చూపించానని , కల్వకుర్తి అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తానని కొందరు నాయకులు గత ప్రభుత్వంలో పూర్తి చేసిన పనులు ప్రారంభిస్తున్నానని అనడం ఎంతవరకు సమంజసమని, తాను నిధులు తేకుంటే పనులు పూర్తి ఎలా అయ్యాయని ఆమనగల్లు ప్రభుత్వ వైద్యశాల పనులు ఎలా కొనసాగుతున్నాయని మండిపడ్డారు. ఏది ఏమైనా కల్వకుర్తి అభివృద్ధి తన లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ సింగ్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఆమనగల్ మండల అధ్యక్షుడు జగన్ మాజీ ఎంపీపీ అనిత విజయ్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, పిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, హనుమాన్ నాయక్, బిఛయ నాయక్, ఐ ఎన్ టీ యూ సీ జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్, మండల నాయకులు అప్పం శీను, కృష్ణ నాయక్, వసవుల శ్రీశైలం, బాబా, రహీం, సురేష్, కర్తాల్, తలకొండపల్లి, మాడుగుల, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో మాజీ చైర్మన్ గుండెపోటుతో మృతి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం రామన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామన్నపేట సింగిల్ విండో మాజీ చైర్మన్ రంగా సంపత్ కూమార్ హైదరాబాద్ లో గుండెపోటుతో మృతి చెందారు. రంగా సంపత్ స్వర్గీయ మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తమరెడ్డికి సన్నిహితులు. కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గం నాయకులుగా పనిచేశారు. రంగా సంపత్ 1995 లో రామన్నపేట సహకార సంఘం చైర్మన్ గా 2006 వరకు పనిచేశారు. రంగా సంపత్ కూమార్ జనంపల్లి పేరున ఉన్న సహకార సంఘాన్ని రామన్నపేట సహకార సంఘంగా మార్పు చేశారు. ఆయన సహకార సంఘం అభివృద్ధిచేసి, జిల్లాలోనే రామన్నపేట వ్యవసాయ సహకార సంఘానికి పేరు తీసుకొచ్చారు. రామన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రంగా సంపత్ కూమార్ రైతులకు ఋణాలు, యూరియా, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచేవారు. కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, రంగా సంపత్ కూమార్ ప్రజలకు ఎంతగానో సేవలు చేశారని పలువురు ఆయన సేవలను కొనియాడారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### బోయిని విద్యాకర్

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం అధ్యక్షులు బోయిని విద్యాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాకర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు మహబూబ్ నగర్ వేదికగా టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో, ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల ప్రచార సభలో హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నాలు, ఆ విధమైన చర్చలు జరగలేదని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో బోయలను ఎస్టీలుగా పరిగణిస్తున్నారు. అదేవిధంగా మరికొన్ని కొన్ని చోట్ల కూడా పరిగణిస్తున్నారు. తెలంగాణలోనూ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సంఘం అధ్యక్షులు భూపని గణేష్, గుజ్జుల మునయ్య, మాజీ ఉపాధ్యక్షులు మండల సత్తయ్య, కిష్టం బాలయ్య, బోయిని వెంకటేశం, బోయిని సుధాకర్, కిష్టం దుర్గయ్య, భూపని గోపాల్, భూపాల్ శంకరయ్య పాల్గొన్నారు.

# దక్షిణ కొరియా శత్రు దేశమే!

### రాజ్యాంగంలో మార్పులు చేసిన కిమ్

### రెండు దేశాల మధ్య కీలక ఒప్పందం రద్దుకు నిర్ణయం

### ఇది అనివార్యమైన చర్యగా పేర్కొన్న సర్కారు



**పాగ్యాంగ్:** ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య శత్రుత్వం గురించి ప్రపం చమంతటా తెలిసిందే. ఇరు దేశాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉత్తర కొరియా కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగణిస్తూ తమ రాజ్యాంగంలో మార్పులు చేపట్టినట్లు ఉత్తర కొరియా తాజాగా వెల్లడించింది. 1991లో ఉత్తర- దక్షిణకొరియా దేశాల మధ్య జరిగిన కీలక ఒప్పందాన్ని కిమ్ సర్కారు రద్దు చేసుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా తమ రాజ్యాంగంలో న్యాయపరమైన సవరణలు చేయల్సి ఉందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది ప్రారంభంలో వ్యాఖ్యా నించారు. అధ్యక్షుడి ఆదేశాల మేరకే రాజ్యాంగంలో మార్పులు చేసిన ట్లు పాగ్యాంగ్ వెల్లడించింది. దక్షిణ కొరియాను శత్రుదేశంగా పరిగ ణించడం అనివార్యమైన, న్యాయపరమైన చర్యగా కిమ్ సర్కార్ పేర్కొంది. అయితే ఈ రాజ్యాంగ సవరణలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెల్లడికావాల్సి ఉంది. ఇటీవల ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. మే చివరివారం నుంచి దక్షిణ కొరియా గగనతలం పైకి వేల సంఖ్యలో చెత్త బెలూన్లు పంపుతోంది. ఈక్రమంలోనే దక్షిణ కొరియాతో తమకున్న సరిహద్దును పూర్తిగా మూసివే స్తున్నట్లు కిమ్ సర్కారు నిర్ణయించింది. అందులో భాగంగా ఇరు దేశాలను కలిపే రోడ్లు, రైల్వే మార్గాలను ఉత్తర కొరియా బాంబులతో పేల్చివేసింది. అయితే.. ఈ రోడ్లు, రైల్వే మార్గాల తొల గింపును సైన్యం దశలవారీగా పూర్తిచేస్తుందని వెల్లడించింది. మరోవైపు ఉత్తర కొరియా సరిహద్దుల వెంబడి తన సైన్యాన్ని పటిష్టం చేస్తోంది.

## ఇరాన్‌పై దాడి చేస్తే.. తీవ్ర పరిణామాలు

- దాడులు చేసి ఎవరూ సురక్షితంగా ఉండలేరు
- ఇజ్రాయెల్ బలహీనతలు మాకు బాగా తెలుసు
- ఐఆర్‌జీసీ చీఫ్ హెచ్చరిక



ఇరాన్‌పై ప్రతిదాడి చేస్తే ఆ తర్వాత చోటు చేసుకొనే పరిణామాలకు ఇజ్రాయెల్ బాధపడాల్సి ఉంటుందని ఐఆర్‌జీసీ చీఫ్ హసన్ సలామీ హెచ్చరించారు. ఇటీవల ఇజ్రాయెల్ దాడిలో చనిపోయిన జనరల్ అబ్బాస్ నీలోఫర్సన్ అంత్యక్రియల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పొరబాటున కూడా ఈ ప్రాంతంలో లేదా ఇరాన్‌పై గానీ దాడి చేస్తే.. మేము కచ్చితంగా తీవ్రంగా సమాధానం చెబుతాం" అని సలామీ పేర్కొన్నారు. అమెరికా పంపించిన థాడ్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ ఏమాత్రం ఆధారపడదగినది కాదని సలామీ విమర్శించారు. తమపై దాడులు చేసి ఎవరూ సురక్షితంగా ఉండలేరన్నారు. ఇజ్రాయెల్ బలహీనతలు తమకు బాగా తెలుసని పేర్కొన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ దాడులను దౌత్యపరంగా కూడా ఎదుర్కొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చి పశ్చిమాసియా దేశాల్లో పర్యటిస్తూ మద్దతు కూడగడుతున్నారు. తాజాగా ఆయన నేడు కైరోకు చేరుకొన్నారు. ఈజిప్ట్ ఉన్నతాధికారులతో చర్చలు మొదలుపెట్టారు. అక్టోబర్ 1వ తేదీన ఇరాన్ భారీ బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. వీటిల్లో కొన్ని లక్ష్యాలకు అత్యంత సమీపంలో పడ్డాయి. మిగిలిన వాటిని ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. ఇరాన్ దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. చివరి క్షణంలో ఏమైనా మార్పులు చేర్పులు జరిగితే తప్ప.. ఇరాన్‌లో ఏయే లక్ష్యాలను ధ్వంసం చేయాలన్న అంశంపై ఇప్పటికే ఒక స్పష్టమైన ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్ష్యాల జాబితాను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్).. ప్రధాని నెతన్యాహుకు, రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌కు సమర్పించినట్లు ఛానల్ 12 న్యూస్ పేర్కొంది. "లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. ఎప్పుడు దాడి చేయాలన్నదే నిర్ణయం కావాలి" అని కాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కూడా ఓ కథనం ప్రచురించింది.

## గాలికుంటు వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గణేష్ పల్లి గ్రామంలో జిల్లా పశు వైద్య శాఖ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో 42 ఆవులు, ఎద్దులు, 20 గేదెలకు గాలికుంటు వ్యాధులు సోకకుండా ఉచితంగా టీకాలు వేసి, పశువులకు ఇతర వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించినట్లు మొగుళ్ళపల్లి మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాకేష్ తెలిపారు. అనంతరం ఆయన పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజులపాటు కొనసాగిస్తామని, కావున మండలంలోని పశువులు ఉన్న పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర శ్రీనివాస్, ఓ ఎస్ తిరుపతి, పాడి రైతులు పాల్గొన్నారు.

### అక్రమ గంజాయి రవాణాపై సంగారెడ్డి జిల్లా

# పోలీసుల ఉక్కు పాదం

- నిషేదిత 40 కిలోల ఎండు గంజాయి, 50 గ్రాముల హష్ ఆయిల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రూపేష్

**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ గురువారం ఉదయం 10:00 గంటల సమయంలో మనూర్ ఎస్ఐ (ఎస్ నాబ్) సిబ్బందితో కలిసి మనూర్ మండలం, డవూర్ %శ% రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నాగలగిద్ద వైపు నుండి నారాయణఖేడ్ వైపు వస్తున్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారు నెంబర్ %ఖూ29చీ%1640 గల వాహనాన్ని తనిఖీ చేయగా కారు డిక్కీలో ప్లాస్టిక్ కవర్ లో 40 కిలోల ఎండు గంజాయి లభ్యం అయింది. ఆ కారు డ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా భాల్కి టౌన్ బిరదేవ్ కాలనీ బసవేశ్వర్ చౌక్ కు చెందిన మల్లగొండ (31). కార్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నానని విచారణలోతేలింది. నిందితుడు మల్లగొండ దొంగతనం కేసులో బీదర్ జైలులో ఉండగా, అక్కడ మల్కాన్గిరి, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ చక్రవర్తి పరిచయమై అతను గంజా కేసులో బీదర్ జైలులో ఉన్నానని, నువ్వు కూడా గంజా సరఫరా చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అని చెప్పి, భాల్కికి చెందిన మల్లేష్ గతంలో కూడ గంజా సరఫరా చేసి జైలుకు వెళ్లాడని, అతను కూడా ఇదే జైలులో ఉండేవాడు కొన్ని రోజుల క్రితమే జైలు నుండి విడుదలైనాడని, నువ్వు అతనిని కలువు అని చెప్పాడు. అత్యాశతో జైలు నుండి విడుదలైన వెంటనే మల్లేష్ ను కలిసి ఒడిస్సా, ఛత్తీస్ ఘడ్ లనుండి గంజాయి తీసుకువచ్చి, అమ్మి అధిక డబ్బులు సంపాదింస్తున్నామని, గత సెప్టెంబర్ నెలలో చిరాగ్ పల్లి పోలీసులు స్వాదీన పరుచుకున్న 140 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్స్ తమవే నని, అప్పుడు పోలీసులకు దొరకకుండా తప్పించుకొని వెళ్ళిన డిజైర్ కారు నాదే అని ఒప్పుకున్నాడు. తన కారులో ఉన్న 40 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా గురువారం రోజు ఉదయం నిందితుని పట్టుకొని మనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల**

మల్లేష్ జాదవ్, దాదా పాటిల్, రాహుల్ చక్రవర్తి లు పరారీలో ఉన్నారు. అమీన్ పూర్ హష్ ఆయిల్ భీరంగూడ వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ముగ్గురు వ్యక్తులు నిషేదిత హష్ ఆయిల్ (గంజాయి సంభందిత)వినియోగిస్తున్నారని సమాచారం అందిన అమీనపూర్ పోలీసులు ఎస్ఐ విజయ్ రావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా అఖిలేష్, ప్రేమ్ మరియు సాయి శివ ముగ్గురు నిందితులు చదువుకునే రోజుల నుండి కళాశాలలో హష్ ఆయిల్ తాగుటకు అలవాటుపడి బిలాల్, నివాసం సంగారెడ్డి మరియు శంకర్, లింగంపల్లి ల వద్ద కొనుగోలు చేసి తాగే వారు అని, అరకులో సుబ్బారావు అనే వ్యక్తి వద్ద హష్ ఆయిల్ లభిస్తుందని తెలుసుకొని, వీళ్ళు వినియోగించుకోగా మిగిలిన హష్ ఆయిల్ అమ్మి డబ్బులు సంపాదించుకోవాలని దురుద్దేశంతో నిందితుడు సాయి అరకు వెళ్లి 50 గ్రాముల హష్ ఆయిల్ ను తీసుకొని వచ్చి బీరంగూడ వెంకటేశ్వర టెంపుల్ వద్ద 11 చిన్న, చిన్న డబ్బాలలో నింపి గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించడానికి వేచి చూస్తూ ఉండగా, అమీన్ పూర్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని హష్ ఆయిల్ స్వాధీన పర్చుకొని, కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలలోకి వెళ్తే ముత్తంగి గ్రామం కిర్బి కాలనీకి చెందిన దాసు సాయి శివ (26), భట్లూరు గ్రామం సత్తెనపల్లి మండలం, గుంటూరు జిల్లాకు చెందిన కోయిలకండ్ల అఖిలేష్ (26), ప్రస్తుత నివాసం, లక్ష్మీ సాయి మేడోస్, అమీన్ పూర్, శంకరంపేట గ్రామం మెదక్ జిల్లా మంద్రగుట్టి ప్రేమ్ (27) ప్రస్తుత నివాసం: దుర్గా ప్రావిన్స్ కాలనీ, అమీన్‌పూర్ సైదాపురం గ్రామం, గూడూరు మండలం, నెల్లూరు జిల్లా: సుబ్బారావు నివాసం అరకు వ్యాలీ,శంకర్ నగర్ లింగం పల్లి,జాయ్ మరియు బిలాల్. జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడం జరిగిందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా (ఎస్ - నాబ్) నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని, వివరాలు తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డ్ లు ప్రకటించారు. ఈ పత్రిక సమావేశంలో పటాన్ చెర్ డీ ఏస్ పీ రవీందర్ రెడ్డి, (ఎస్ నాబ్) సీఐ రమేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ విజయ్ కృష్ణ అమీన్పూర్ సీఐ నాగరాజు, నారాయణ్ ఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, సిసియస్ ఎస్పీ శ్రీకాంత్, మనూర్ ఎస్ఐ రాజశేఖర్ సీసీఎస్, సిబ్బంది పాల్గొన్నారు.



# నిండైన మనసుతో పాపకు ప్రాణం పోశాడు



మెగాస్టార్ చిరంజీవి నటనలోనే కాదు, సాయం చేయడంలోనూ, సేవా కార్యక్రమాల్లో ముందుండే మంచి మనిషి. అందుకే ఆయన్ను అన్నయ్య అని, ఆపద్బాంధవుడు అని అభిమానులు పిలుచుకుంటారు. ఆయన దార్లోనే తనయుడు గ్లోబల్‌స్టార్ కూడా నడుచుకుంటారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటారు. గుప్త దానాలు చేస్తుంటారు. చదువుకోవాలనే తపన ఉండి.. చదువుకోలేని వారికి చదువు చెప్పిస్తుంటారు. అయితే ఇవన్నీ పెద్దగా బయటకు తెలియని విషయాలు. రామ్ చరణ్ చేసిన ఓ సాయం గురించి ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. తాజాగా ఆయన ఓ చిన్నారికి ప్రాణదాతగా నిలిచారు రామ్‌చరణ్ . అసలు విషయంలోకి వెళ్తే.. ఆగస్టు 22న మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు అన్న విషయం తెలిసిందే. మెగా అభిమానులకు ఆ రోజు ఓ పండగ లాంటిది. అదే రోజు ఒక ఫోటో జర్నలిస్టు కుటుంబంలో పాప జన్మించింది. కానీ ఆ పాపకి గుండె సంబంధిత పల్మనరీ హైపర్ టెన్షన్ అనే సమస్య ఉన్నట్టుగా వైద్యులు గుర్తించారు. అంతేకాకుండా పాప బతికే అవకాశం చాలా తక్కువ ఉందని డాక్టర్లు చెప్పారు. దీంతో చికిత్స కోసం ఆ పాపని అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ఈ చికిత్సకి లక్షలు ఖర్చు అవుతుందనే విషయం తెలిసింది. కానీ సదరు జర్నలిస్టుకి అంత భారీ బడ్జెట్‌తో కూతురికి చికిత్స చేసే ఆర్థిక స్థోమత లేదు. ఇదే విషయం రామ్ చరణ్ దృష్టికి వెళ్ళింది. పాప ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న చరణ్ ఆ చిన్నారికి చికిత్స అందించే బాధ్యతను తీసుకున్నారు. ఆగస్టు 24న ఆ పాపను హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. ఆ రోజు నుంచీ డిశ్చార్జ్ అయ్యేదాకా ఎప్పటికప్పుడు ఈ చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటూ కావాల్సిన సాయం అందిస్తూ వచ్చారు. పాపకు అవసరమైన బ్లడ్, ప్లేట్లెట్స్ వంటివి చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నుంచి అందించారు. ఎట్టకేలకు 53 రోజుల తర్వాత అంటే అక్టోబర్ 16న ఆ చిన్నారి పూర్తిగా కోలుకుంది. 'ఇక లేదు' అనుకున్న పాప ఆరోగ్యం కుదుటపడటంతో ఆ జర్నలిస్ట్ ఇంట ఆనందం అవధులు లేకుండా ఉంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో రామ్‌చరణ్‌ను ప్రశంసిస్తున్నారు. నటనలోనే కాదు మంచి మనసులోనూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు చరణ్ అంటూ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

ప్రస్తుతం రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' సినిమాలో నటిస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రం తర్వాత చరణ్ సానా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్నారు.

## ఒకే రోజు రెండు సినిమాలు




నిధి అగర్వాల్ ప్రస్తుతం టాలీవుడ్‌లో ఇద్దరు అగ్ర హీరోల సరసన నటిస్తోంది. పవన్ సరసన 'హరిహర వీరమల్లు' , ప్రభాస్‌తో 'రాజా సాబ్' చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. అభిమానుల్లో జోష్‌ల్ నింపేలా ఈ రెండు చిత్రాల నుంచి అప్‌డేట్ వచ్చింది. ఈ మేరకు నిధీ అగర్వాల్ ఓ ఆసక్తికర విషయం ట్వీట్ చేశారు. ఒకే రోజు రెండు షూటింగ్‌లోఓ్‌ల పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు. 'ఆర్టిస్టుల జీవితం ఎప్పుడూ సర్‌ప్రైజ్‌లతో నిండి ఉంటుంది. కొన్ని బ్లెస్సింగ్స్ ఎంతో గొప్పగా ఉంటాయి. అవి మర్చిపోలేని అనుభూతినిస్తాయి. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్ ఇండియా సినిమాలు 'హరిహరవీరమల్లు', 'రాజా సాబ్' చిత్రాల్లో నేను భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఒకేరోజు ఈ రెండు సినిమాల చిత్రీకరణలో పాల్గొవడం మరింత సంతోషాన్నిచ్చింది. అది కూడా ఒక సినిమా షూటింగ్ ఆంధ్రాలో, మరొకటి తెలంగాణలో. మా వర్క్‌ని మీ ముందుకు తీసుకురావడం కోసం వేచి చూస్తున్నా. ఈ సినిమాలు కచ్చితంగా పండగ వాతావరణాన్ని నింపుతాయి' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌పై దర్శకుడు మారుతి స్పందించారు. 'అంకితభావంతో పని చేస్తున్నారు. ఆల్ ది బెస్ట్' అని రిప్లై ఇచ్చారు. నిధీ అగర్వాల్ చేసిన పోస్ట్‌తో పవన్, ప్రభాస్ అభిమానుల్లో నూతన ఉత్సాహం నింపింది.



## రెండో సినిమాకి ఓకే చెప్పిన ప్రదీప్

యాంకర్ ప్రదీప్ బుల్లితెర ప్రేక్షకులకి పరిచయం అక్కర్లేని పేరు. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు అమ్మాయిలు, యూత్‌లోను కల్ట్ ఫాలోయింగ్ సాధించాడు. స్మాల్ స్క్రీన్‌పై షోస్ చేస్తూనే.. సిల్వర్ స్క్రీన్‌పై అడపాదడపా క్యారెక్టర్స్ చేశాడు. 2021లో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాలో మెయిన్ లీడ్‌గా చేసి పర్వాలేదనిపించాడు. తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎప్పుడా అని ఎదురుచూస్తున్నా అభిమానులకి ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ మధ్యకాలంలో షోస్ కూడా తగ్గించాడు. ఈ నేపథ్యంలోనే తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కి సంబంధించిన న్యూస్ ఒకటి బయటకొచ్చింది. అలాగే ఈ సినిమాకి ఓ 'పవన్ కళ్యాణ్' సినిమా టైటిల్ ఫిక్స్ అయ్యింది. ఇంతకీ ఆ డైరెక్టర్ ఎవరు.. టైటిల్ ఏంటంటే..ప్రదీప్ తన మొదటి సినిమాతోనే విభిన్నమైన స్టోరీతో ఆకట్టుకున్నాడు. '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమా వచ్చి నాలుగేళ్ళ అయినా తరువాతి ప్రాజెక్ట్ అనౌన్స్ కాలేదు. తాజాగా తెలుగు కామెడీ షో 'జబ్బర్దస్త్' డైరెక్టర్స్ నితిన్, భరత్‌ల దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా కూడా విభిన్నమైన లవ్ స్టోరీతో పాటు కామెడీ ట్రాక్ కలిగి ఉంటుందని ఇండస్ట్రీ లీక్. ఇక ఈ సినిమాకి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మొదటి సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' టైటిల్ ని ఓకే చేశారు. దీంతో ఆడియెన్స్ వీపరీతమైన బజ్ క్రియేట్ అయ్యే ఛాన్స్ ఉంది. దీపికా పిల్లి ప్రదీప్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మాంక్స్ & మంకీస్ నిర్మిస్తున్నారు.

## 'ఓజీ' షూటింగ్ షురూ

పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ ఖాతాలో వరుస చిత్రాలున్న సంగతి తెలిసిందే. రాజకీయాలతో బిజీగా కావడం వల్ల సినిమా షూటింగ్‌లకు కాస్త విరామం ఇచ్చారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే మధ్యలో సినిమాలకి సమయం కేటాయిస్తున్నారు. సెట్స్ మీదున్న మూడు చిత్రాల షూటింగ్ రీ స్టార్ చేశారు. 'హరి హర వీరమల్లు' చిత్రీకరణ ఇటీవల విజయవాడలో మొదలుపెట్టారు. విజయవాడలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. ఇదిలా ఉండగా త్వరలోనే 'ఓజీ' సెట్‌లోకీ అడుగు పెట్టనున్నారు పవన్‌కల్యాణ్. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. చిత్రీకరణ పునః ప్రారంభించినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించింది. డి.వి.వి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ. డి.వి.వి దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. కథానాయకుడు లేని కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇమ్రాన్ హాస్మీ, అర్జున్ దాస్, శ్రియారెడ్డి, హరీస్ ఉత్తమన్, అభిమన్యు సింగ్ కీలక పాత్ర ధారులు. ప్రియాంక ఆరుళ్ మోహన్ కథానాయిక. ప్రస్తుతం జరుగుతున్న 'హరిహర వీర మల్లు' పూర్తయిన తర్వాత, పవన్‌కల్యాణ్ 'ఓజీ' సెట్లోకి అడుగు పెట్టనున్నారు. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. వీటితోపాటు 'ఉస్తాద్ భగత్‌సింగ్' కూడా పూర్తి చేయాల్సి ఉంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

## ఈ అవార్డు ఒక్క పాత్రకే కాదు

జాతీయ ఉత్తమ నటి జాబితాలో నిత్యా మేనన్ ఇటీవల చేరారు. 'తిరుచిత్రంబలం' లోని నటనగానూ ఆమె ఆ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఓ మీడియా సంస్థతో ఆమె గురువారం మాట్లాడారు. అవార్డు, తదుపరి చిత్రాల సంగతులు పంచుకున్నారు. ''ఈ అవార్డు నాకెంతో ప్రత్యేకం. దాన్ని స్వీకరించిన వెంటనే పలువురు జ్యూరీ సభ్యులను కలిశా. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారితో మాట్లాడడం కొత్త అనుభూతి. ఈ అవార్డు ఈ ఒక్క సినిమా (తిరుచిత్రంబలం)కే కాదు, ఇప్పటి వరకూ నేను పోషించిన పాత్రలన్నింటికీ దక్కుతుంది. 'తిరు'లోని శోభన పాత్ర పోషించడం తేలిక కాదని ధనుష్ సినిమా ప్రారంభానికి ముందు చెప్పారు. ఆ రోల్ నాకు పూర్తి భిన్నమైంది. కానీ, దర్శక- రచయితలు కాగితంపై ఏం రాస్తారో.. దాన్ని తెరపై ఓ నటిగా ఆవిష్కరించా. మూస ధోరణికి భిన్నమైన ఆ పాత్రకు అవార్డుకు దక్కడం చాలా ఆనందంగా ఉంది. ఇంటెన్స్ యాక్టింగ్, మూవీస్‌కు అవార్డులు వస్తాయని చాలామంది అనుకుంటుంటారు. అది అవాస్తవం'' అని పేర్కొన్నారు. ''పాండిరాజ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ సినిమా చేస్తున్నా. ఇప్పటి వరకూ నేను నటించని కొత్త జానర్‌లో అది రూపొందుతోంది. ఈ ఏడాది చివరిలో 'గోల్డెన్ వీసా' సినిమా ప్రారంభం కానుంది. 'కాదలిక్కా నేరమిల్లై' (తమిళ్) షూటింగ్ పూర్తయింది. త్వరలోనే విడుదల కానుంది'' అని తెలిపారు. ధనుష్, నిత్యా మేనన్, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో మిత్రన్ ఆర్. జవహర్ తెరకెక్కించిన చిత్రం 'తిరుచిత్రంబలం'. 2022లో విడుదలైంది. 'తిరు' పేరుతో తెలుగు ప్రేక్షకులనూ ఆకట్టుకుంది. ధనుష్- నిత్యా మేనన్ అందులో స్నేహితులుగా కనిపించి అలరించారు. ఇదే కాంబినేషన్‌లో ఇప్పుడు 'ఇడ్లీకడై' సినిమా తెరకెక్కుతోంది. ధనుష్ స్వీయ దర్శకత్వంలో.. గ్రామీణ నేపథ్య కథతో అది రూపొందుతోంది.



## దంతాల నుండి పసుపు రంగును తొలగించే హోం రెమెడీస్

దంతాలు తెల్లగా, శుభ్రమైన దంతాలు అందరికీ మంచివి. కానీ చాలా సార్లు పసుపు రంగు పళ్ళు ఏర్పడతాయి. అనేక ఆహారపు అలవాట్ల వల్ల పళ్ళు పసుపు రంగులోకి మారుతాయి. అలాగే ధూమపానం, పొగాకు, మసాలాలు తినడం వల్ల దంతాలు పసుపు రంగులోకి మారుతాయి. చాలా సార్లు బ్రష్ చేసినా దంతాల పసుపు రంగు పోదు..పసుపు పళ్లను శుభ్రం చేయడానికి, మీరు దంతవైద్యుని వద్దకు వెళ్లి దంతాలను శుభ్రం చేసుకోవచ్చు. కానీ ప్రతిసారీ దంతవైద్యుని వద్దకు వెళ్లడం సాధ్యం కాదు. కాబట్టి కొన్ని హోం రెమెడీస్ చేయడం ద్వారా దంతాల పసుపు రంగును తొలగించుకోవచ్చు. పసుపు పళ్లను శుభ్రం చేయడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించవచ్చు. ఒక కప్పు నీటిలో రెండు టీస్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్ మిక్స్ చేసి మౌత్ వాష్ చేయండి. ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని నోటిలో వేసుకుని బ్రష్ చేసి మింగాలి. అయితే దీన్ని చేసే ముందు వైద్యుడిని సంప్రదించండి.



పసుపు పళ్ళు శుభ్రం చేయడానికి మరొక చిట్కా కూడా ఉంది. మీరు నిమ్మ, నారింజ, అరటి తొక్కను కూడా ఉపయోగించవచ్చు. ఇది మీ దంతాల మీద ఏర్పడిన పసుపు ఫలకాన్ని క్లియర్ చేయడంలో సహాయపడుతుంది. డి-లిమోనెన్, లేదా సిట్రిక్ యాసిడ్, పై తొక్కలోని సమ్మేళనం మీ దంతాలను తెల్లగా మార్చడంలో సహాయపడుతుంది. మీ దంతాలను శుభ్రం చేయడానికి ఈ తొక్కను మీ దంతాల మీద 2 నిమిషాల పాటు సున్నితంగా రుద్దండి. పసుపును బ్రష్‌పై అప్లై చేసి 2 నిమిషాలు బ్రష్ చేయండి. ఇది మీ దంతాలకు కూడా మేలు చేస్తుంది. బ్రష్‌ల గురించి కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం, మీరు మీ టూత్ బ్రష్‌ను ప్రతి 3 నెలలకు మార్చాలి.

## తక్కువ ఖర్చుతో సందర్శించడానికి బెస్ట్ దేశం థాయిలాండ్

సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకూ దేశ విదేశాల్లో అందమైన ప్రదేశాలను సందర్శించాలని కోరుకుంటారు. అలా భారతీయులు విదేశాలకు వెళ్ళాలనుకుంటే థాయిలాండ్ బెస్ట్ ప్లేస్. తాజాగా ప్రముఖ నటి ఫ్యాషన్ డిజైనర్ షామా సికందర్ తన భాగస్వామితో కలిసి థాయిలాండ్‌లోని కొన్ని ప్రదేశాలను అన్వేషిస్తుంది. మీరు కూడా మీ భాగస్వామితో కలిసి విదేశాలలో సందర్శించడానికి వెళ్లాలనుకుంటే.. థాయిలాండ్ కూడా దీనికి ఉత్తమ ఎంపిక. ఇక్కడ మీరు మీ భాగస్వామితో కలిసి ఈ ప్రసిద్ధ స్థలాలను అన్వేషించవచ్చు. ఆ అందమైన ప్రదేశాల గురించి తెలుసుకుందాం. ప్రముఖ భారతీయ నటి ఫ్యాషన్ డిజైనర్ షామా సికిందర్ ప్రస్తుతం తన భర్త జేమ్స్ మిల్లిరోన్‌తో కలిసి థాయిలాండ్‌లో విహారయాత్ర చేస్తోంది. తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఈ చిత్రంతో పాటు పచ్చని అడవిలో దాగి ఉన్న ఈ పురాతన దేవాలయం చియాంగ్ మాయిని కనుగొనడం మరొక కాలంలో వెళ్ళడానికి డోర్ తీసినట్లు అనిపిస్తుందనే క్యాప్షన్ ఆ పోస్ట్ కు జత చేసింది. మీరు కూడా తక్కువ ధరలో అందమైన థాయిలాండ్ టూర్ ను ఎంజాయ్ చేయవచ్చు. స్నేహితులతోనే కాదు మీ భాగస్వామితో కలిసి సందర్శించడానికి థాయిలాండ్ చాలా అందమైన ప్రదేశం. పెళ్లి తర్వాత విదేశాలకు వెళ్లాలనుకుంటే మీ బడ్జెట్‌లో థాయ్‌లాండ్‌కు వెళ్లేలా ప్లాన్ చేసుకోవచ్చు. ఈరోజు థాయ్‌లాండ్‌లోని కొన్ని ప్రత్యేక ప్రదేశాల గురించి ఇక్కడికి ఎక్కడికి ఎలా వెళ్లాలో పూర్తి వివరాలు తెలుసుకుందాం..



### పుకెట్‌లో సందర్శించడానికి ప్రసిద్ధ ప్రదేశాలు

బీచ్‌లో మీ భాగస్వామితో కొంత ప్రశాంతంగా గడపాలనుకుంటే పుకెట్‌లోని పటాంగ్ బీచ్‌కి వెళ్లవచ్చు. ఇక్కడి సహజ దృశ్యం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. అందమైన బీచ్‌లు, రోడ్లు, మార్కెట్‌లతో పాటు ఇక్కడ రుచికరమైన వంటకాలను కూడా ఆస్వాదించవచ్చు. అంతేకాదు మీరు సమీపంలోని స్థానిక దేవాలయాలను కూడా సందర్శించవచ్చు. పుకెట్‌లోని జేమ్స్ బాండ్ ద్వీపం థాయిలాండ్‌లోని పుకెట్ నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫాంగ్ న్గా బేలో ఉంది. స్థానిక ప్రజలలో దీనిని కో తపు అని కూడా పిలుస్తారు. మీరు పుకెట్ నుండి స్పీడ్ బోట్ లేదా పెద్ద పడవ ద్వారా ఇక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రదేశం సున్నపురాయి రాళ్లకు చాలా ప్రసిద్ధి చెందింది. ఇది ఆకుపచ్చ రంగులో భిన్నంగా కనిపిస్తుంది. చియాంగ్ మాయి మీరు థాయిలాండ్ లోని చియాంగ్ మాయి సందర్శనానికి బెస్ట్ ప్లేస్. ఇది థాయ్‌లాండ్‌లోని రెండవ అతిపెద్ద నగరం. గణేశ పుణ్యక్షేత్రం చియాంగ్ మాయి ఆర్కేడ్, సువాన్ డాక్ గేట్, మోంతా థాన్ జలపాతం, చియాంగ్ మై నైట్ సఫారి, ఆంగ్‌కేవ్ రిజర్వాయర్, వాట్ ఫా లాట్ హైక్ (సన్యాసుల మార్గం), వాట్ సువాన్ డాక్, తా ఫా వాకింగ్ స్ట్రీట్, వాట్ చియాంగ్ మాన్ యు వంటి అనేక ప్రదేశాలు ఉన్నాయి. ఈ నగరం ట్రిప్ కూడా ఎంతో మధురమైన జ్ఞాపకంగా మారుతుంది.

### థాయ్‌లాండ్‌లో సందర్శించడానికి ప్రసిద్ధ ప్రదేశాలు

ఇవి మాత్రమే కాదు మీరు గ్రాండ్ ప్యాలెస్, ఎలిఫెంట్ నేచర్ పార్క్, టైగర్ కింగ్‌డమ్, చియాంగ్ రాయ్ వైట్ టెంపుల్, ఫాంగ్ న్గా బే, సఫారీ వరల్డ్, బ్యాంకాక్, పట్టాయా, కో ఫై ఫై, చియాంగ్ మాయి, క్రాబి, అయుతయ, కో స్యామ్యూయి, హువా హిన్‌లను కూడా సందర్శించవచ్చు. కాంచనబురి, థాయ్‌లాండ్‌లోని కావో సామ్ రోయ్ యోట్ నేషనల్ పార్క్, సుఖోథాయ్, దోయి సుతేప్ వంటి ప్రదేశాలను కూడా సందర్శించవచ్చు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com